

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థపై నేపాల్ నవతరం తిరుగుబాటు

నేపాల్‌లో జాతీయ సంతాపదినం

యువ విప్లవం పూర్తికాలేదు, ఇప్పుడే మొదలైంది!

భద్రతామండలి సంస్కరణలకు ఏకాభిప్రాయం ఉండాలి : రష్యా 02


సంపుటి 08, సంచిక: 288 | గురువారం | 18-09-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

# ఉద్యమాలకు ఊపిరి

**ఈ పోరాట ఫలితంగా ప్రజల్లో చైతన్యం రగిలి మెరుగైన తెలంగాణ పౌర సమాజం ఏర్పాటు**

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభలో పలువురు వక్తలు**



ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి వేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రేరణనే దేశంలో అనేక విప్లవ, సామాజిక ఉద్యమాలకు ఊపిరి పోసిందని పలువురు వామపక్ష నాయకులు, ప్రముఖులు వక్తలు అన్నారు. ఆ పోరాటం ఫలితంగానే ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం రగిలి మెరుగైన తెలంగాణ పౌర సమాజం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభకు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్యపద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి.యూసుఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కళవేణ శంకర్, అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సభలో సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నాడు 52 శాతం తెలుగు, ఆ తర్వాత మరాఠ, కన్నడం వారు ఉంటే ముస్లింల సంఖ్య కేవలం 10 శాతమేనన్నారు. దీంతో మెజారిటీ ప్రజలకు తమ మాతృభాషలో చదువుకునేందుకు కూడా అవకాశం లేకపోయిందని, తరువాయి 12లో

## జెండాలు.. ఎజెండాలు పక్కనపెట్టి

# రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి

- చరిత్రలో లిఖించదగినది తెలంగాణ సాయుధ పోరాటం
- గత పదేళ్లలో నియంతృత్వ నిర్బంధంలోకి జారిన పాలనను ఓడించాం
- ప్రజాపాలనను తెచ్చుకున్నాం
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన ఘనత 'తెలంగాణ సాయుధ' పోరాటానిదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానంలో గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో మళ్లీ నియంతృత్వం, నిర్బంధంలోకి జారిందని, 'నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి, ప్రజాపాలనను తెచ్చుకున్నామని తెలిపారు. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన ప్రయాణం ప్రపంచ వేదికపైన తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలన్నారు. రాజకీయాలకతీతంగా జెండాలు, ఎజెండాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న తెలంగాణ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎన్నికల్లో పోటీ చేద్దామని, అప్పటి వరకు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఒక వేళ అభివృద్ధికి కలిసి ముందుకు రాకపోతే మౌనంగా ఉన్నా పర్వాలేదని, తాము మాత్రం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని సిఎం అన్నారు. త్వరలోనే మెట్రో రైల్ విస్తరణను, భారత భవిష్యత్ నూతన నగరానికి చెందిన ప్రణాళికను ప్రారంభించనున్నట్లు సిఎం వెల్లడించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన 'తెలంగాణ ప్రజా పాలన' దినోత్సవ వేడుకలకు సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు గన్‌పార్క్‌లోని అమర వీరులకు సిఎం నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని, నిజాం నియంతృత్వంపై తరువాయి 2లో

**దేశానికి దిక్సూచిలా రాష్ట్ర విద్యావిధానం**
విద్యారంగ సమూల ప్రక్షాళనే ధ్యేయం 3లో

### సాయుధ పోరాట స్ఫూర్తితో...

నిజాం నియంతృత్వంపై సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈరోజు మనం అనుభవిస్తోన్న ప్రజాస్వామ్యం. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది. 1948, సెప్టెంబర్ 17.. ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకను ఎగురవేసిన రోజు. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన మన ప్రయాణం.. ప్రపంచ వేదికపై తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలి. ఆ బాధ్యత మాది.

— సిఎం రేవంత్‌రెడ్డి

---

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట

### చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### పటేల్ కలలను నిజం చేయడానికి మోదీ కృషి

కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

### పటేల్‌ను అవమానిస్తున్న బిజెపి

తెలంగాణ విలీన దినోత్సవంలో టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ 3లో

**స్వగ్రామంలో సాయుధ పోరాట సేనాని విగ్రహం**



తెలంగాణ సాయుధ పోరాట సేనాని పద్మ విభూషణ్ రావి నారాయణరెడ్డి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బొల్లెపల్లిలో ఆయన విగ్రహాన్ని బుధవారం ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. 3లో

---

## పంట వ్యర్థాల దహనం

# రైతులను జైలుకు పంపండి

- కొందరిని జైల్లో వేస్తేనే ఇతరులు పద్ధతి మార్చుకొంటారు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పంట వ్యర్థాల దహనాన్ని నియంత్రించని పంజాబ్ ప్రభుత్వంపై సీరియస్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలలో పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శీతాకాలంలో కాలుష్యం స్థాయిలు సాధారణంగా పెరగడంపట్ల తీవ్ర ఆందోళ చెందుతోన్న సుప్రీంకోర్టు వాయుకాలుష్యానికి కీలక కారణమైన వ్యర్థ పదార్థాలను తగులబెట్టినందుకు కొంతమంది రైతులను ఎందుకు అరెస్ట్ చేయకూడదని పంజాబ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 'మీరు నిర్ణయం తీసుకోండి. లేదంటే మేం మాండమస్ జారీ చేస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై బలమైన వ్యాఖ్యలు చేసింది. ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల కాలుష్య నియంత్రణ తరువాయి 2లో

## సాయుధ పోరాటాన్ని

# తాత్కాలికంగా నిలిపేస్తున్నాం

- శాంతి చర్చలు సులభతరం చేయడానికి ఆయుధాలు వీడుతున్నాం
- మావోయిస్టు పార్టీ ప్రకటన ?
- ఒక నెలపాటు కాల్పుల విరమణ ప్రకటించాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదన



**రాయ్‌పూర్ :** శాంతి చర్చలను సులభతరం చేయడానికి ఆయుధాలను వీడుతున్నామని, తమ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని నిషిద్ధ సిపిఐ మావోయిస్ట్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ ప్రక్రియను ప్రారంభించడానికి ఒక నెల కాల్పుల విరమణను ప్రకటించాలని, భద్రతా దళాల కార్యకలాపాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరింది. కాగా, మంగళవారం సామాజిక మీడియాలో వెలువడిన మావోయిస్టుల ప్రకటన ప్రామాణికతను ధృవీకరిస్తున్నట్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మావోయిస్టులు విడుదల చేసిన ప్రకటనలో తాము తమ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని ఇంటర్నెట్, రేడియోతో సహా ప్రభుత్వ వార్తా మాధ్యమాల ద్వారా పంచుకోవాలని మావోయిస్టు పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకటన ఆగస్టు 15 నాటి తేదీతో మావోయిస్టుల తరువాయి 2లో

**లేఖపై భిన్నాభిప్రాయాలు**
అభయ్ పేరిట మరో ఆడియో విడుదల 3లో

**మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం** 2లో

---

## బ్రిటన్ పర్యటనలో

# ట్రంప్‌కు నిరసన సెగ

- డంప్-ట్రంప్ అంటూ వేలాదిమంది నినాదాలు
- లండన్‌లో ట్రంప్-జెఫ్రీ ఎప్స్టీన్ భారీ పోస్టర్లు




**లండన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిటన్ పర్యటనకు ముందుగానే నిరసన ప్రదర్శకులు ఆయనకోసం కాచుకుని కూర్చున్నారు. లండన్‌లోని పార్లమెంటు స్క్వేర్ నుండి బుధవారం మధ్యాహ్నం వేలాదిమంది ప్రదర్శకులు ట్రంప్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ప్రదర్శనలు చేసేందుకు ముందు రోజు నుండే నిరసనకారులు సిద్ధమయ్యారు. ప్రదర్శకులను అదుపు చేసేందుకు దాదాపు 1600 మంది పోలీసులనులండన్‌లో, వెస్ట్‌మినిస్టర్ పరిసరాల్లో బ్రిటన్ ప్రభుత్వం మోహరించింది. దాదాపు 50 గ్రూపులు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు సంసిద్ధమయ్యాయి. 2019లో ట్రంప్ బ్రిటన్ పర్యటన సమయంలో కూడా ఆయనకు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. గతంలో ప్రజల వ్యతిరేకత మధ్య ఆయన బ్రిటన్ పర్యటన జరిపారు. రెండోసారి కూడా బ్రిటన్ పర్యటనలో ఆయనకు అసాధారణ పద్ధతులలో ప్రజా నిరసన ఎదురవుతున్నది. మంగళవారం రాత్రి ప్రదర్శకులు విండ్సార్ పారిష్ చర్చవద్ద గుమిగూడి "ట్రంప్....డంప్...." అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. లండన్‌లో ఒక మహిళా తరువాయి 2లో

### ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తి

దేశ విదేశీనేతల శుభాకాంక్షలు




**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బుధవారంనాడు ప్రపంచదేశాల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 75 ఏళ్ళు వయసు పూర్తిచేసుకున్న నరేంద్రమోదీకి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుండి శుభాభినందనల సందేశాలు వచ్చాయి. చిరకాలం ఆయన ఆరోగ్యంగా వర్థిల్లాలని నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. 1950 సెప్టెంబరు 17వ తేదీన గుజరాత్‌లోని వద్నాగర్ అనే చిన్న పట్టణంలో మోదీ జన్మించారు. అందరికంటే ముందుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్య సమస్యలు తొలగిపోగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ గొప్ప కృషి చేస్తున్నారని, ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న కృషితో తనవంత తరువాయి 2లో

### గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

12 మంది నక్సల్స్ లొంగుబాటు

24న సిడబ్ల్యుసి భేటీ 05

చలో చండీఘడ్
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)


ప్రధాన కార్యదర్శులు – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## శక్తిమంతమైన చైనా జెడ్–20 టి యుద్ధ హెలికాప్టర్



**బీజింగ్:** చైనా తయారు చేసిన అత్యంత శక్తిమంతమైన యుద్ధ హెలికాప్టర్లలో కొత్తతరం జెడ్–20 టి హెలికాప్టర్లను అందరిముందుకు తీసుకువచ్చింది. చాలా ఎత్తులో ఎగిరే ఈ హెలికాప్టర్ యుద్ధ సమయాల్లో అపార ప్రతాపం ప్రదర్శిస్తుంది. నౌకల నుండి కూడా ఇది కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈనెల మూడో తేదీన జరిగిన చైనా 80 వ విజయోత్సవ వేడుకలలో పాల్గొన్న ఈ యుద్ధ హెలికాప్టర్లను వచ్చేనెల 16 నుండి 19వ తేదీ వరకూ తియాన్‌జిన్‌లో నిర్వహించే హెలికాప్టర్ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది తియాన్‌జిన్ ఎక్స్‌పోలో మొత్తం 52 రకాల హెలికాప్టర్లను, డ్రోన్లను చైనా ప్రదర్శిస్తున్నది. జెడ్–10 జెడ్ 19 జెడ్ 20 టి, జెడ్ 8ఎల్, కెవిడి 001 కెవిడి 002 హెలికాప్టర్లను ప్రదర్శించనున్నది.

## భద్రతామండలి సంస్కరణలకు ఏకాభిప్రాయం ఉండాలి:రష్యా



**మాస్కో:** దీర్ఘకాలికంగా కేవలం కాగితాలకే పరిమితమైన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలకు రష్యా మద్దతు తెలియజేసింది. నూతన ప్రాపంచిక వాస్తవికతలకు అనుగుణంగా భద్రతామండలిని సంస్కరించాల్సిన అవసరం ఉందని రష్యా కేంద్ర కార్యాలయ అధికార ప్రతినిధి డ్మిత్రీ పెస్కోవ్ అన్నారు. ఈ సంస్కరణలకు అన్నిదేశాల మధ్య ఏకాభిప్రాయం అవసరమన్నారు. ప్రస్తుత భద్రతామండలిలో సభ్యదేశాలమధ్య మౌలికంగా సఖ్యత లేదన్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం వీటో అధికారాలను కొన్ని దేశాలకే పరిమితం చేయడం, భద్రతామండలిని సంస్కరించడంపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి పెస్కోవ్ పైవిధంగా స్పందించారు. 1945 నాటి పరిస్థితులకు, ఈనాటి ప్రపంచ వాస్తవికతకు చాలా తేడాలు ఉన్నాయని ఆంటోనియో గుటెరెస్ అన్నారు. భద్రతామండలిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు మాత్రమే వీటో అధికారాలు ఉన్నాయి. గడచిన ఆగస్టునెలలో జిన్హువా వార్తాసంస్థకు పుతిన్ ఇంటర్వ్యూ ఇస్తూ, భద్రతామండలిలో సంస్కరణలకు చైనా, రష్యా రెండూ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి భద్రతామండలిలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## నేపాల్‌లో జాతీయ సంతాపదినం
# యువ విప్లవం పూర్తి కాలేదు, ఇప్పుడే మొదలైంది!



**ఖాట్మండు:** జనరల్ జెడ్ ఉద్యమం (జెజెడ్ఎం) కాలం (సెప్టెంబరు 8,9 తేదీలు)లో మరణించిన 72 మంది యువకులను స్మరించుకుంటూ నేపాల్ దేశ ప్రజలు బుధవారంనాడు జాతీయ సంతాపదినం పాటించారు. ఈ సందర్భంగా విద్యాలయాలు, కార్యాలయాలను మూసివేశారు. జాతీయ సెలవుదినం పాటించారు. ప్రతిచోటా మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ ఉద్యమ సమయంలో మరో 1300 మంది గాయపడ్డారు. మరణించినవారిలో ముగ్గురు పోలీసులు కూడా ఉన్నారు. నేపాల్‌లో ప్రధానమంత్రి సుశీల కర్కి సారథ్యంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఈ జాతీయ సంతాపదినం నిర్వహించింది. నేపాల్‌కు సంబంధించిన విదేశాల్లో పనిచేస్తున్న వ్యవస్థలన్నీ కూడా మూతపడ్డాయి. నేపాల్ జాతీయ పతాకాన్ని కూడా అవనతం చేశారు. ఈ ఉద్యమ కాలంలో మరణించిన యువకులను త్యాగమూర్తులుగా గడచిన ఆదివారంనాడు సుశీల కర్కి ప్రకటించారు.

ఇదిలా ఉండగా నేపాల్‌లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకుంటున్నాయి. ఇదిలా ఉండగా నేపాల్‌లో రాజకీయ వాస్తవికతను జనరేషన్ జెడ్ ఉద్యమం పునర్నిర్వచించింది. నిజానికి నేపాల్‌లో ఉద్యమం ఇంకా పూర్తి కాలేదు. కె.పి.శర్మ ఓలి ప్రభుత్వ పతనం, సుశీల కర్కి ప్రమాణస్వీకారం, కొందరు జనరేషన్ జెడ్ నాయకులు ప్రభుత్వంలో మంత్రులుగా చేరడం, పార్లమెంటును రద్దుచేయడంతోనే ఈ ఉద్యమం పూర్తికాలేదు. ఇంకా దేశంలో అవినీతి నిర్మూలన కాలేదు. యువకుల సమస్యల పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఇంకా సజావుగా పూర్తి కావాల్సి ఉంది. వాస్తవానికి నిజమైన విప్లవం ఇప్పుడే ప్రారంభమైంది అని నేపాలీ పత్రికలు కొన్ని ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. లక్ష్యాల సాధన దిశగా తాత్కాలిక ప్రభుత్వం అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి ఉంది. విద్యార్థి యువజన ఉద్యమం నిర్దేశించిన లక్ష్యాలను గనుక తాత్కాలిక ప్రభుత్వం విస్మరించి వ్యవహరిస్తే కర్కి ప్రభుత్వం తన కాళ్ళను తనే నరుక్కునట్లవుతుందని పత్రిక కథనం పేర్కొంది. ఈ ఉద్యమం తర్వాత దేశంలో కొత్త రాజకీయ పరిణామాల దశ మొదలైంది. విదేశాలతో వ్యవహారాలో వైఖరి ఏమిటో ఇంతవరకూ తెలియదు. విదేశాంగమంత్రి పేరు తెలియలేదు. ఐతే ప్రభుత్వం పరిపాలన విదేశీ మంత్రిత్వశాఖను అప్పగించడానికి మాజీ దౌత్యాధికారులను, దౌత్యవేత్తల పేర్లను పరిశీలిస్తున్నది. దేశంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి భారత్, చైనా వంటి పొరుగుదేశాలు సహా అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, జపాన్, కొరియా వంటి దేశాల సహాయం కూడా ఎంతో కీలకమైనదని ప్రధానమంత్రి భావిస్తున్నారు. విదేశీ పర్యవేక్షకుల మధ్య ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది.



## జపాడ్–2025 మిలిటరీ విన్యాసాల్లో రష్యా, బెలారస్‌తో జత కలిసిన భారత సైన్యం

**మిన్స్క్:** బెలారస్‌లోని బోరిసోవ్ శిక్షణా ప్రాంగణంలో రష్యా, బెలారస్, భారతదేశాల సైన్యాలు జపాడ్–2025 వార్ గేమ్ విన్యాసాలు చేశాయి. ఈ సైనిక విన్యాసాలు ఈనెల 16వ తేదీన ముగిశాయి. 'జపాడ్' అంటే రష్యన్ భాషలో 'వెస్ట్' పశ్చిమం అని అర్థం. నాటో కూటమికి వ్యతిరేకంగా, నాటో కూటమి దాడుల నుండి దేశాన్ని రక్షించుకోవడానికి సంకేతంగా ఈ సైనిక విన్యాసాలకు 'జపాడ్–2025 (డ్రిల్)'గా నామకరణం చేశారు. రష్యా, బెలారస్‌లతో పాటు భారతదేశానికి చెందిన సైనికులు కూడా ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. భారత సైనికులు ఈ విధంగా వీరితో కలిసి సైనిక విన్యాసాలలో పాల్గొనడం ఇదే మొదటిసారి కాదు. భారత్ తరఫున 65 మంది సైనికులు ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. సువిశాలమైన ఈ ట్రైనింగ్ గ్రౌండ్‌లో మూడు దేశాల సైనికులు ముందస్తు విన్యాసాలు చేశారు. విమానాల ద్వారా దాడులు చేశారు. చెక్కలతో నిర్మించిన ఇళ్లను దాడుల్తో కూల్చివేశారు. బాంబు పొగల మధ్య మూడు దేశాల పతాకాలను ఉమ్మడిగా ఎగురవేశారు. డ్రోన్లు ఎగురవేసి, డ్రోన్ దాడులను నిలిపివేసే విన్యాసాలు చేశారు. ఈ సందర్భంగా రష్యా సైన్యాలు ఇన్ఫాంట్రీ క్షిపణులను లోడు చేసే విన్యాసాలు జరిపాయి. ప్రదర్శనల చివరిరోజున రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆకస్మికంగా ఈ విన్యాసాల ప్రాంతాన్ని సందర్శించారు. ఖాకీరంగులో సైనికులు ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. కానీ చాలా అరుదైన రీతిలో పాశ్చాత్య మీడియాను కూడా ఈ వార్ గేమ్ విన్యాసాలను చూడటానికి అనుమతించారు. ఉక్రేన్‌పై 2022 ఫిబ్రవరి నుండి యుద్ధం చేస్తున్న రష్యా గతవారంలో ఉక్రేన్‌పై ప్రయోగించిన డ్రోన్లు దారితప్పి పోలెండ్, రుమేనియా దేశాల సరిహద్దుల్లోకి దూసుకువెళ్లడంతో నాటో కూటమి పెద్ద వివాదానికి తెరలేపింది. తాము ఉద్దేశపూర్వకంగా డ్రోన్లను పోలెండ్, రుమేనియాలపై పంపలేదని రష్యా వివరణ ఇచ్చినప్పటికీ నాటో దేశాలు రష్యాను తీవ్రంగా తప్పుపట్టాయి. ''అసాధారణ పద్ధతులలో ఈ విన్యాసాలను మేం బహిర్గతం చేశాం, వీటివల్ల ఎవరికీ అపాయం లేదు, తాము ఎప్పుడూ సానుకూల దృక్పథంతో చర్చలకే ప్రాధాన్యం ఇస్తాం'' అని బెలారస్‌కు చెందిన సీనియర్ మిలిటరీ అధికారి వాలరీ రెవెంకో చెప్పారు. ఐతే మరోవైపు పొలెండ్ దేశం ఈ విన్యాసాలు జరుగుతున్న బెలారస్ సరిహద్దుల్లో 40,000 మంది సైనికులను మోహరించి అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

## గ్రూప్-1 విద్యార్థుల మీద కెటిఆర్ విషం కక్కుతున్నాడు : ఎంపి చామల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 533 మంది గ్రూప్1 విద్యార్థుల మీద విషం కక్కుతున్నాడని, వారిని అవమానిస్తున్నాడని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.గ్రూప్1 అభ్యర్థుల తల్లిదండ్రులు ఒక్కో పోస్ట్ కు రూ.3 కోట్లు ఇచ్చారని కేటిఆర్ అంటుండు అసలు కెటిఆర్ ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. కెసిఆర్ అధికారంలో ఉండి తెలంగాణ ను కూల్చారని అన్నారు. ప్రతి పక్షం లో ఉండి కూడా కూల్చాలనీ చూస్తున్నారని ఇదీ విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడికి పోయిండు అని కేటిఆర్ అంటుండు.. ఈరోజు ముఖ్యమంత్రి సచివాలయంలో ఉండు, ప్రతి పక్ష నేత మీ నాయన ఎక్కడికి పోయిండు అని కెటిఆర్‌ను నిలదీశాడు. కెటిఆర్ ఎనిమిది మంది ఎంపిల గురించి బేస్ లెస్ ఆరోపణలు చేస్తున్నాడని, ఇటీవల మాట్లాడిన అతని అనుచరుడు మ్యాడ అని తెలుసు, కానీ ఈరోజు కెటిఆర్ మాట్లాడితే ఏ మానాలి? అని వ్యంగంగా అన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో 42శాతం రెజర్వేషన్ల కు కెసిఆర్ గ్యాప్ విధించడం వల్లనే ఎన్నికలు లేటు అవుతున్నాయన్నారు.బిఆర్‌ఎస్ హాయంలో 1200 కోట్ల కాలేజి బకాయి లు ఎగ్గొట్టారని గుర్తు చేశారు. 2010 మెట్రో 2వ స్థానంలో ఉండగా ఇప్పుడు 2014 తర్వాత 20వ స్థానానికి పడి పోయిందన్నారు.

## రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో రాగల నాలుగు రోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతాయన్నారు. తెలంగాణను ఆనుకుని ఉన్న విదర్భ ప్రాంతంలో కొనసాగుతున్న మరో ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురు, శుక్ర వారాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు.

## రైతులను జైలుకు పంపండి
(మొదటి పేజీ తరువాయి)

బోర్డులలో ఖాళీలు భర్తీచేయడానికి సంబంధించి దాఖలైన సుమోటో పిటిషన్‌ను (స్వయంగా) ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ఈ రాష్ట్రాలను కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఏక్యూం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి)లను మూడు నెలల్లోగా ఖాళీలను భర్తీ చేయాలని కోరింది. విచారణ జరుపుతుండగా కోర్టులో ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ ప్రభుత్వం తరపున ప్రాతినిథ్యం వహించిన సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రాను ఉద్దేశించి తప్పు చేసిన రైతులను గడ్డి దహనం చేసినందుకు అరెస్ట్ చేసి శిక్ష ఎందుకు విధించకూడదు అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ధర్మాసనం ఆయన్ను ప్రశ్నించింది. 'రైతులు ప్రత్యేకమైన వారు. మనం వారివల్లే భుజిస్తున్నాం. అంటే పర్యావరణాన్ని కాపాడలేమని కాదు. కొన్ని జరిమానా నిబంధనలను ఎందుకు పాటించకూడదు?. కొంతమంది జైలులో ఉంటే , అది సరైన సందేశాన్ని పంపినట్లు అవుతుంది. రైతులపై విధించే జరిమానా నిబంధనల గురించి మీరు ఎందుకు ఆలోచించరు?. పర్యావరణాన్ని కాపాడాలనే నిజమైన ఉద్దేశం మీకు ఉంటే ఎందుకు దూరంగా ఉంటారు?' అని ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ప్రశ్నించారు. 'మట్టిని కూడా జీవ ఇంధనంగా వాడవచ్చని నేను వార్తాపత్రికలలో చదివాను. మేం దీనిని 5 సంవత్సరాలకు ఒకసారి చేసే కసరత్తుగా చేయలేం' అని ఆయన అన్నారు. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీలలో రైతులు తదుపరి విత్తనాల చక్రానికి తమ పొలాలను చదునుచేయడానికి వాడుకలో ఉన్న వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టడాన్ని నియంత్రించేందుకు పంజాబ్ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రారంభంలో, సిజెఐ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ చెత్తను కాల్చడానికి బదులుగా జీవ ఇంధనంగా తిరిగి ఉపయోగించవచ్చని, పర్యావరణ పరిరక్షణకు నిజంగా కట్టుబడి ఉంటే రాష్ట్రం కఠినమైన నిబంధనలను పరిగణించాలని పట్టుబట్టారు. 'పంజాబ్ ప్రభుత్వం ఇప్పటికే కఠినమైన చర్యలను తీసుకున్నదని, కాలుష్యస్థాయి క్రమంగా తగ్గుతోంది. గత సంవత్సరం ఇది తగ్గింది. ఇప్పుడు మరింత తగ్గుతోంది. మూడు సంవత్సరాలలో చాలా సాధించబడ్డాయి. ఇంకా ఈ ఏడాది చాలా సాధించబడుతుంది' అని మెహ్రా చెప్పారు. ఇటీవలి సంవత్సరాలలో పంట వ్యర్థాలను తగులబెట్టిన సంఘటనలు 77,000 నుండి 10,000వరకు తగ్గిపోయాయి అని న్యాయవాది మెహ్రా చెప్పారు. ఒక హెక్టారు భూమిని సాగుచేస్తున్న చిన్న రైతులను అరెస్ట్ చేయడం వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారిని అరెస్ట్ చేస్తే వారిపై ఆధారపడిన వారు కూడా నష్టపోతారని చెప్పారు. ఏ చట్టం కింద పంటలు కాల్చడం నిషేధించబడిందని అడిగినప్పుడు ఒక న్యాయవాది పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని (ఇపిఎ)ను ఎత్తిచూపారు. అయితే చట్టం కింద క్రిమినల్ ప్రాసిక్యూషన్ నిబంధనలను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టు పేర్కొందని చెప్పారు. 'ఎందుకు దానికి ఉపసంహరించుకున్నారు?. అలాంటి వారిని కటకటాల వెనకకు పంపడం గట్టి సందేశం ఇవ్వడం అవుతుంది కదా' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు. మెహ్రా వ్యక్తం చేసిన ఆందోళనను గమనించిన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అరెస్టులు నిత్యకృత్యంగా ఉండాల్సిన అవసరం లేదని ఉదాహరణగా నిలిచేందుకు అవసరమని చెప్పారు. నియంత్రణల సంస్థల తరపున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ నవీకరించబడిన నివేదికలను రికార్డులో ఉంచడానికి కొంత సమయాన్ని కోరారు. గత సంవత్సరం ఈ అంశంపై పంజాబ్, హర్యానా ప్రధాన కార్యదర్శులకు ధర్మాసనం సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఇజ్రాయెల్ బహిష్కరణకు కలిసిరండి

ఇరాన్ విదేశాంగమంత్రి పిలుపు



**టెహ్రాన్:** ఇజ్రాయెల్‌ను బహిష్కరించేందుకు అన్ని దేశాలు కలిసి రావాలని ఇరాన్ విదేశాంగమంత్రి ఇస్మాయెల్ బాఘెల్ పిలుపు ఇచ్చారు. బుధవారం టెహ్రాన్‌లో పత్రికాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ ఒక ఉగ్రవాద దేశంగా మారిందని, అన్ని దేశాలనూ ఆక్రమిస్తూ, ఊచకోతలకు పాల్పడుతోందని, అందువల్ల ఆ దేశాన్ని బహిష్కరించేందుకు ఇస్లామిక్, ప్రాంతీయ దేశాలన్నీ కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలకు అంగీకరిస్తే నేరాలను, ఘోరాలను, ఊచకోతలను సమర్థించి, చట్టబద్ధం చేసినట్టే కాగలదని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు సమీపంలో ఉన్న దేశాలు, భౌగోళికంగా దానికి అత్యంత దూరంగా ఉన్న దేశాలూ కూడా సంబంధాలు తెంచుకుని వాణిజ్య కార్యకలాపాలను రద్దుచేసుకుంటున్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ ఈనెల 15వ తేదీన విడుదల చేసిన నివేదికలో ఇజ్రాయెల్‌ను ''సామూహిక హత్యాకాండ''కు పాల్పడిన దేశంగా ప్రకటించింది.

## రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి (మొదటి పేజీ తరువాయి)

సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈ రోజు తాము అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం అని గుర్తు చేసుకున్నారు. సాయుధ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛా పతాకాన్ని 1948, సెప్టెంబర్ 17న ఎగుర వేసిన రోజుగా సిఎం అభివర్ణించారు. ఈ గడ్డపై రాచరికానికి గోరీ కట్టి, ప్రజా పాలనకు హారతి పట్టిన రోజు అని, అందుకే ఇది ప్రజాపాలన దినోత్సవం అని అన్నారు. స్వేచ్ఛ తెలంగాణ జీవన విధానమని, స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి తమదన్నారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా సిఎం ఘన నివాళి అర్పిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి అని, అలాగే డిసెంబర్ 7, 2023 కూడా స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయిగా సిఎం అభివర్ణించారు.

**రైతు సంక్షేమం విషయంలో రాజీపడం:** ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినప్పటికీ రైతుల సంక్షేమం విషయంలో తాము రాజీ పడలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, ఈ ఏడాది 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచామన్నారు.

**నీటి వాటాలపై రాజీపడబోం :** కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ జీవనాదుల అని, ఆ నదుల్లో తమకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్ట చేశారు. గత పాలకుల తప్పులను సరిదిద్ది, ప్రతి చుక్క నీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యామని, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన 904 టిఎంసిల వాటాను సాధించేందుకు వ్యూహరచన చేస్తున్నామన్నారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఎస్‌ఎల్‌బిసిని ప్రజలకు అంకితం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**'డ్రగ్స్, గంజాయి'లో రాజకీయ బంధువులనూ వదిలిపెట్టం..:** గంజాయి, డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇందులో రాజకీయ నాయకుల బంధువులు ఉన్నా వదిలిపెట్టబోమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాజకీయ నాయకుల హోదాతో ఫామ్‌హౌజ్‌లు కేంద్రాలుగా మారాయని, కొందరు విదేశాల నుంచి వచ్చిన ఇక్కడ శాశ్వితంగా డ్రగ్స్ దందా నిర్వహించాలని చూస్తున్నారని, అలాంటి వారిని కటకటాలకు పంపిస్తామని స్పష్టం చేశారు.

**భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం చెల్లిస్తాం :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారాన్నిఇచ్చి, వారిని ఆదుకుంటామని, రైతులంతా అభివృద్ధికి సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. స్థలాలు కోల్పోతున్న రైతులను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకురావాలనే కొందరు చేస్తున్న ప్రయత్నాలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటాయన్నారు. తెలంగాణ అభివృద్ధి నిరోధకులుగా స్వార్థ రాజకీయంగా పనిచేస్తున్న కొందరి పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోకపోతే, ప్రపంచంతో పోటీపడకపోతే భవిష్యత్ తరాల కు మనమే తీరని నష్టం చేసినవారమవుతామని తెలిపారు.

**'మూసీ' ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం**

హైదరాబాద్ మహానగరం తమ బలం, తమ బ్రాండ్ అని, ఈ బ్రాండ్ ను భవిష్యత్ లో ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెట్టే దీర్ఘకాలిక ప్రణాళికలు రచిస్తున్నామని సిఎం తెలిపారు. మూసీ ప్రాజెక్ట్ ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మూసీ ప్రాంతంలో తెలంగాణ వైతాళికులు, గొప్ప వ్యక్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి వచ్చే వందేళ్ల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారంగా గోదావరి జలాలు తీసుకువస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమయ్యే భారత్ ఫ్యూచర్ సిటీ ఆధునిక ప్రపంచానికి గేట్‌వేగా ఉంటుందన్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరం నిర్మిస్తుంటే, ఆ ప్రాంత ప్రజలను రెచ్చగొడుతున్నారని, కొందరిలో అక్కసు, అసూయ మాటలు కనిపిస్తున్నాయని, ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని సిఎం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు త్వరలోనే బుల్లెట్ రైలు రాబోతుందన్నారు.

## తాత్కాలికంగా నిలిపేస్తున్నాం (మొదటి పేజీ తరువాయి)

కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో జారీ చేశారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి నంబల కేశవ్ రావు అలియాస్ బసవ రాజు హత్యకు గురైన దాదాపు నాలుగు నెలల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లో హోం శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రకటన ప్రామాణికతను ధృవీకరిస్తున్నామని, మావోయిస్టులు లొంగిపోయి పునరావాస ప్రయోజనాలను పొందడమే ఉత్తమ మార్గం అని అన్నారు. యుద్ధం లాంటి పరిస్థితి లేనందున కాల్పు విరమణ అనే పదం చాలా అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలు షరతులతో కూడుకున్నవి కావని, అయినప్పటికీ వారు మరోసారి ముందస్తు షరతులు విధించారన్నారు. అయితే, ప్రకటనను ధృవీకరించిన తర్వాత ప్రభుత్వంలో చర్చలు జరుగుతాయనిచెప్పారు. మావోయిస్టు లు తమ ప్రకటనలో తాము ప్రభుత్వానికి కాల్పు ల విరమణను ప్రతిపాదించామని, పార్టీ అత్యున్నత నాయకత్వ సహచరులతో సంప్రదించడానికి ఒక నెల సమయం కావాలని కోరారు. కానీ దురదృష్టవశాత్తు, కేంద్ర ప్రభుత్వం దానిపై తన అనుకూల వైఖరిని వ్యక్తం చేయలేదు. బదులుగా, తన కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేసిందని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి (దివంగత బసవరాజు) చొరవతో ప్రారంభించిన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళడానికి, మారిన ప్రపంచ, జాతీయ పరిస్థితుల దృష్ట్యా, అలాగే దేశ ప్రధాన మంత్రి, హోం మంత్రి, సీనియర్ పోలీసు అధికారులు ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని చేస్తున్న నిరంతర అభ్యర్థనల దృష్ట్యా ఆయుధాలను విడనాడాలను నిర్ణయించుకున్నామని ఆ లేఖలో తెలిపారు. భవిష్యత్తులో ప్రజా ప్రయోజనం కోసం పోరాడుతున్న అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలతో వీలైనంత వరకు భుజంభుజం కలిపి పోరాడుతామని స్పష్టం చేస్తున్నామన్నారు.

మావోయిస్టు పార్టీ కేంద్ర సర్కార్‌తో ప్రత్యక్షంగా చర్చలు జపడానికి ముందుకొచ్చిందని, ఈ అంశంపై కేంద్ర హోంమంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధి బృందంతో మాట్లాడటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే తమ అభిప్రాయాలకు గురించి తమ పార్టీకి తెలియజేయాలని, అందువల్ల, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న తమ సహచరులతో, జైలులో ఉన్న వారితో సంప్రదించడానికి ఒక నెల సమయం ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వా న్ని అభ్యర్థిస్తున్నామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వంతో అభిప్రాయాలను పంచుకోవడాని కి ప్రధానంగా వీడియో కాల్ ద్వారా సిద్ధంగా ఉన్నామన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే నెల పాటు అధికారికంగా కాల్పుల విరమణ ప్రకటించాలని, శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని మరోసారి స్పష్టం చేస్తున్నామని మావోయిస్టులు ఆ లేఖలో వెల్లడించారు. అయితే అనేక కారణాలవల్ల ఆలస్యంగా జారీ చేయబడిందని ప్రకటనలో ఒక గమనిక కూడా ఉంది. ఈ ప్రకటనకు ప్రతిస్పందిస్తూ బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పి పిటిఐతో మాట్లాడారు. ఆయుధాలు వదులుకోవడం, శాంతి చర్చల అవకాశాలకు సంబంధించి సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటనను పోలీసులు గమనిస్తున్నారన్నారు. అందు లో ఉన్న సారాంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.

### మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: డాక్టర్ నారాయణ

నక్సల్ గ్రూపులు ఆయుధాలను వదిలి ప్రభుత్వంతో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేయాలని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్వాగ తిస్తోం దని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ తెలిపారు. నక్సల్స్ నిర్ణయం శాంతి, సయోధ్య, ప్రజాస్వామ్య చర్చలవైపు ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. విజయవాడలో బుధవారం మీడియా తో ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటాన్ని విరమించుకోవాలని నక్సల్స్ తీసుకున్న చర్య దీర్ఘకాలిక సమస్యలను ప్రజాస్వామ్య మార్గాల ద్వారా పరిష్కరించు కోవాలనే నిజాయితీగల ఆకాంక్షను ప్రతిబింబిస్తుందన్నారు. నక్సల్స్ నిర్ణయానికి సానుకూలంగా స్పందించడం, చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, విశ్వాసాన్ని పెంపొందించే చర్యలను నిర్ధారించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమని ఆయన అన్నారు.

## నూతన విద్యాపాలసీ రూపకల్పనను స్వాగతిస్తున్నాం

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం రాష్ట్ర నూతన విద్యాపాలసీ రూపకల్పన చేయనుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించడంఎఐఎస్‌ఎఫ్ స్వాగతిస్తోందని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. నూతన విద్యా పాలసీ ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో విద్యారంగంలో ఉన్న లోపాలను గుర్తించి సమూల మార్పులను చేయడం ద్వారా విద్యారంగ అభివృద్ధికి ఈ పాలసీ దోహదపడుతుందని భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. అయితే రాష్ట్ర విద్యా పాలసీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020 కి భిన్నంగా రాష్ట్ర పాలసీ ఉండాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఎన్ఇపి 2020 ద్వారా ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితులు ఉన్నాయని,బడ్జెట్ లో విద్యకు నిధుల తగ్గింపు, కార్పోరేట్ విద్యా వ్యవస్థ అనుకూలంగా, పాఠ్యాంశాల్లో మతోన్మాద చరిత్రలు పెట్టడం, ప్రభుత్వ పాఠశాలల, అంగన్‌వాడీల విలీనం చేసేలా ఉన్న ఆ నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర విద్యా పాలసీ ఉండాలన్నారు. రాష్ట్ర విద్యా పాలసీ రూపకల్పన పై విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు,అందరితో చర్చించి రూపకల్పన చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ కోరారు.

## ట్రంప్‌కు నిరసన సెగ
(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్ ఎగ్జిక్యూటివ్ మిఛెల్లే (32) ఎఫ్ఎఫ్‌పి వార్తాసంస్థతో మాట్లాడుతూ, ట్రంప్ బ్రిటన్ పర్యటన తనకు ఇష్టం లేదని, ఆయన రాకతోపాటు బ్రిటన్ పాలకులకు ఆయనకు ఎర్ర తివాచీలు పరచి స్వాగతాలకు సిద్ధం కావడంపట్ల తామెంతో అసంతృప్తికి గురయ్యామని విమర్శించారు. వలసలకు వ్యతిరేకంగా మితవాద నాయకుడు టమ్మీ రోబిన్సన్ 1.10 లక్షలమందితో సెంట్రల్ లండన్‌లో ప్రదర్శన జరిపిన నాలుగురోజుల తర్వాత మిఛెల్లే ఈ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య చర్చలు, అంతర్జాతీయ అంశాలపై చర్చల నిమిత్తం మంగళవారం రాత్రికే ట్రంప్ లండన్ చేరుకుని విన్‌ఫీల్డ్ హౌస్‌లో బసచేశారు. గాజాలో యుద్ధాన్ని పెంచిపోషించడమే కాకుండా వలస ప్రజలపట్ల ట్రంప్ అమానుష ప్రవర్తనపై బ్రిటన్‌లో తీవ్ర వ్యతిరేకత ఉంది.ఆయనను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. అమెరికా సెక్స్ అఫెండర్, ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్సీన్, ట్రంప్ ఇద్దరి పోస్టర్లను విండ్సార్ క్యాజిల్ భవంతి గోడలకు నిరసన ప్రదర్శకులు అంటించారు. ఈ పోస్టర్లు అంటించిన కేసులో నలుగురు నిందితులను బ్రిటన్ పోలీసులు అరెస్టు చేశారు. ట్రంప్‌ను నిశితంగా విమర్శిస్తూ ప్రదర్శకులు ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రంప్ బ్రిటన్‌కు రాకముందే నిరసన ప్రదర్శకులు తమ అభిప్రాయాలను ఆయన దృష్టికి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. అమెరికాలో ట్రంప్ సహా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారుల రాసలీలలకు సంబంధించి జెఫ్రీ ఎప్సీన్ తయారు చేసిన జాబితాను విడుదల చేయకూడదని అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయం ట్రంప్ ప్రోద్బలంతోనే జరిగిందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో బ్రిటన్‌లో కూడా ఆయనకు ఈ వివాద విమర్శలే ఎదురయ్యాయి. ట్రంప్‌తోపాటు ఆయన భార్య మెలనియా ట్రంప్‌కు విండ్‌సార్ క్యాజిల్ వద్ద బ్రిటన్ రాజు ఛార్లీ త్రీ, రాణి కేమెల్లా, యువరాజు విలియం, యువరాణి కటేలు స్వాగతం పలకడంతో వారి బ్రిటన్ పర్యటన ప్రారంభమైంది.

## ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తి
(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇస్తున్నారని ప్రశంసించారు. భారత్–రష్యా దేశాలమధ్య స్నేహ బంధాన్ని పటిష్టం చేయడంలో నరేంద్రమోదీ వ్యక్తిగతంగా ఎంతో గొప్ప కృషి చేశారని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ''గొప్ప పరిపాలనాధిపతిగా, మీ కార్యకలాపాల ద్వారా ప్రపంచ వేదికపై మీరు గొప గౌరవాన్ని సంపాదించుకున్నారు'' అని పుతిన్ క్రెమ్లిన్ వెబ్‌సైటు ద్వారా సందేశం పంపారు.

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా అభినందనలు తెలియజేస్తూ, ఆయనను ప్రియనేస్తంగా అభివర్ణించారు. భారతదేశం కోసం మీ జీవితంలో చాలా చేశారు, భారత్,ఇజ్రాయెల్ మధ్య మనిద్దరం కలిసి ఒక ఒప్పందం చేసుకుని మైత్రి సాధించామన్నారు. రెండు దేశాలమధ్యా స్నేహాన్ని ఇంకా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలని తాను ఎదురుచూస్తున్నానని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అభినందనలు తెలియజేస్తూ, మంచి ఆరోగ్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భారతదేశ అభివృద్ధికి, ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఆయన దోహదపడాలని కోరారు. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి రిషి సునక్ ఒక సందేశంలో ఆయనకు అభినందనలు తెలియజేయడం తనకొక గొప్ప గౌరవమన్నారు. 2023లో జి–20 సదస్సుకు భారత్‌కు వచ్చినప్పటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మోదీ మంత్రివర్గ సభ్యులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇంకా న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లగ్జన్, మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాంగ్, గుయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, డొమినికా ప్రధానమంత్రి రూజ్వెల్ట్ స్కెరిట్ తదితరులు అభినందనలు పంపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐక్యంగా పోరాడాలి: కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ పిలుపునిచ్చారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను కోదండరామ్ బుధవారం ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' సెప్టెంబర్ 17న' తెలంగాణ చరిత్రలో ఒక కీలక రోజు అని, ప్రజలు ఫ్యూడల్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక మార్పు కోసం సుదీర్ఘ కాలం పోరాటం సాగించారని గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నిజాం పాలన అంతమొంది, హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు గోపగాని శంకర్రావు, బైరి రమేష్, పల్లె వినయ్, నిజ్జన రమేష్, ఆశప్ప, ఎం. నరసయ్యగౌడ్ , సర్దార్ వినోద్, హనమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట
# చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి



సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలను తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, ఈ సమరంలో అసువులు బాసిన అమర వీరులను బిజెపి హైజాక్ చేసే ప్రయ్నతం చేస్తూ కొత్త నినాదాలతో చరిత్రను వక్రీకరించడం గర్హనీయమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 77వ వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం జాతీయ పతాకాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, అరుణ పతాకాన్ని కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ భూస్వాములు, వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నాటి మహోత్తర ఉద్యమాన్ని బిజెపి హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గోదా శ్రీరాములు, ఆర్.అంజయ్య నాయక్, కలకొండ కాంతయ్య, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, కె.ఏసురత్నం, బి.ఆర్.ఎస్ మోహన్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ కలలను నిజం చేయడానికి మోదీ కృషి

కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందన్న రక్షణమంత్రి పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా నిర్వహించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పరేడ్ మైదానంలోని అమర జవాన్‌ల స్మృతి స్థల్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భద్రతా బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారన్నారన్నారు. నిజాం ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ పటేల్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించారన్నారు. పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ అన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న కాంగ్రెస్, బిఆర్ఎస్ పేర్లు మార్చి వేడుకలు నిర్వహిస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా చొరవ వల్లే కేంద్రం తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఈటల రాజేందర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పికెట్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# పటేల్‌ను అవమానిస్తున్న బిజెపి

తెలంగాణ విలీన దినోత్సవంలో టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ చరిత్ర లేని బిజెపికి ఇతరుల చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ విలీనం దినోత్సవ ఉత్సవాలను బుధవారం గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మహేశ్ కుమార్ మాట్లాడుతూ ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు విలీనం దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పివి నరసింహరావులతో పాటు నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు.1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ పోలో ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆయన చేసిన విలీనాన్ని విమోచనగా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. బిజెపికి గాంధీ అంటే పడదని ఆయనను హత్య చేసిన గాడ్సే మాత్రం దేవుడన్నారు. ఆపార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్ర్యం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని ఎద్దేవా చేశారు. ఇప్పుడున్నది పాతబిజెపి కూడా కాదని, 2014లో పుట్టిన మోడీషా బిజెపి అన్నారు.. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించరని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా ప్రయాసగా అభివర్ణించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న ఓటు చోరీ ఉద్యమం బిజెపి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదని తెలిపారు.

# దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

విజన్ డాక్యుమెంట్ 2047లో విద్యా విధానానికి ప్రత్యేక అధ్యాయం

విద్యా రంగం సమూల ప్రక్షాళనే ధ్యేయం..

తెలంగాణ విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్షేత్రస్థాయి పరిస్థితులు, అధ్యయ నం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం (టిఈపి) భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ''ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదు. జ్ఞానం ఉన్న చోట భాష లేదు. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవు. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలి'' అని సిఎం చెప్పారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై సమావేశాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. సమావేశం లో సిఎం మాట్లాడుతూ తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం, నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని, ఇప్పుడు పంపకానికి భూము లు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సిఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆ స్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణం గా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సిఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏ ఏటికి ఆ ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సిఎం అన్నారు.

డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సిఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకుని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సిఎం కోరారు. తెలంగాణ విద్యా విధానం రూపకల్పన కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. ఎఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడో వంతు 'ఎన్ఈఈటి'గా ఉన్నారని, దాని అర్థం 'నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్' అని ఓ సర్వే తేల్చిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాము స్టార్టప్లను ప్రోత్సహిస్తున్నామని, ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామన్నారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సిఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ గంగాధర్, విశ్రాంత ఐఎఎస్‌లు మిని మాథ్యూ రంజీవ్ ఆచార్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు మాట్లాడారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, అధికారులు జయేశ్ రంజన్, శ్రీదేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# మరో నిజాంలు.. మోదీ, అమిత్‌షా, భాగవత్

తెలంగాణ పోరాట ఉత్సవాల ముగింపు సభలో సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి




**ప్రజాపక్షం/జనగామ :** మరో నిజాంలు ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమీత్‌షా, ఆర్ఎస్ఎస్ అధినేత భగవత్‌లు అని సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, హైదరాబాద్ విలీనం గురించి తెలంగాణ గడ్డపై మాట్లాడే నైతిక హక్కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల ముగింపు సభ జనగామ జిల్లా కేంద్రంలోని క్రిస్టన్ పాఠశాల ఆవరణలో బుధవారం జరిగింది. ఈ సభకు జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆనా డు నిజాం జాగీర్, జమీందార్, భూస్వాములకు అనుకూలంగా ఉన్నట్లే నేడు ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమీత్‌షా, ఆర్ఎస్ఎస్ అధినేత భగవత్‌లు అదానీ, అంబానీలకు అండగా ఉన్నారన్నారు. అస్సాం లో వేల ఎకరాల భూముల్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని, ఇందు కోసం పార్లమెంట్ లోనే ఆర్ఎస్ఐఆర్ పేరుతో చట్ట సవరణ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమి లబ్ధి పొందాలని బిజెపి చేస్తుందని, ఆ పోరాటంతో ఏమాత్రం సంబంధంలేని బిజెపి తెలంగాణ గడ్డపై ఎలా మాట్లాడుతుంది, రాజ్‌నాథ్‌కు మాట్లాడే హక్కు ఎక్కడిదని మండిపడ్డారు. నిజాం నవాబు ముస్లింలు ఆయనపై హిందువులు తిరగబడ్డారంటు ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేయడం సరియైంది కాదన్నారు. నెహ్రూ, వల్లబాయ్‌పటేల్‌లు కేంద్ర బలగాలను మోహరింపజేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి గొప్ప చరిత్ర ఉంది, ఆనాడు ప్యారిస్‌లో శ్రామికులు పోరాటం చేసి 70 రోజుల పాటు పరిపాలన సాగించారని తెలంగాణ పోరాటం ప్యారిస్‌కు మించిందని, ఇక్కడి పోరాటంలో 4వేల మంది చనిపోగా 10లక్షల ఎకరాల భూమి పంచబడిందన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున భూములు పంచిందని, అక్కడ ప్రభుత్వం పంచితే అంతకంటే గొప్పగా తెలంగాణలో కమ్యూనిస్టులే భూములు పంచారన్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన రోజు:కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ బిడ్డలు అడుగుపెట్టిన రోజు అని, దీనిని కొందరు విమోచనమని, మరి కొందరు విలీనం అని అన్నప్పటికీ వేలాది మంది ఆనాటి రాచరిక వ్యవస్థపై పోరాటం చేసి ప్రాణాలు అర్పించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. 'సెప్టెంబర్ 17' సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంటేనే త్యాగాల గడ్డ, పోరాటాల అడ్డ అని, ఆనాటి సాయుధ రైతాంగ పోరాటం నుంచి మొదలుకుని 1969 తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత జరిగిన కెసిఆర్ ఆధ్వర్యంలోని ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం ఇలా అన్ని ఉద్యమాలను తెలంగాణ చూసిందన్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగి, రావి నారాయణరెడ్డి లాంటి అద్భుతమైన అమరవీరులను తెలంగాణ కన్నదన్నారు. ఆనాటి పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరోసారి పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.



సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవమేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధులు ఎం.కె.మొయినుద్దీన్‌ను సత్కరించారు.

### తెలంగాణ సాయుధ పోరాటసేనాని
# రావి నారాయణరెడ్డి విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ సాయుధ పోరాట సేనాని నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యులు రావి నారాయణరెడ్డి స్వగ్రామం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో ఆయన విగ్రహాన్ని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ హన్మంతరావు ఆవిష్కరించారు. అనం తరం సభలో సిపిఐ ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రను బిజెపి వక్రీకరిస్తే తెలంగాణ సమాజం సహించదని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొనటువంటి బిజెపి నాయకులు ఆ చరిత్రను వక్రీకరించే విధంగా నాడు జరిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించి మతం రంగు పూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కొరకు భుక్తి కొరకు వెట్టి చాకిరి విముక్తి కొరకు భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం అని వివరించారు. విసునూరు రామచంద్రారెడ్డి, దేశ్ముకులు కొనసాగించిన ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటానికి మతం రంగు పూసి బిజెపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి నాయకత్వంలో జరిగిన సాయుధ పోరాటంతోనే తెలంగాణకు నిజాం పాలన నుంచి విముక్తి జరిగిందన్నారు. రావి నారాయణరెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ తన జీవితాన్ని పేద ప్రజలకే అంకితం చేశారని కొనియాడారు. తనకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికల సంక్షోభ సమయంలో కూడా నిటారుగా నిలబడి కడవరకు కమ్యూనిస్టుగా జీవించారని తెలిపారు.

# మావోయిస్టులు నిరాయుధులవుతారా..

లేఖపై సర్వత్రా చర్చ.. భిన్నాభిప్రాయాలు

అభయ్ పేరిట మరో ఆడియో

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారతదేశంలో సుదీర్ఘ కాలం సాయుధ పోరాటాన్ని నడిపిన పార్టీ సాయుధ పంథాను వీడనాడేందుకు సంసిద్ధమని ప్రకటిస్తున్నట్లు వచ్చిన లేఖపై సర్వత్రా చర్చ సాగుతుంది. కేంద్ర ప్రభుత్వ వైఖరితో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న మావోయిస్టులు గత నెల 15న అభయ్ అలియాస్ మల్లోజుల వేణుగోపాల్ విడుదల చేసినట్లు చెబుతున్న లేఖ నిజమైనదేనా లేక వ్యూహ, ప్రతివ్యూహాలలో భాగమా అన్నది ముందు తేలాల్సి ఉంది. వరుస ఎదురుదెబ్బలు తగులుతుండటం, దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగి ఉద్యమాన్ని నడిపించిన వారు, దన్నుగా నిలిచిన వారు ఎన్‌కౌంటర్లలో మరణించటమో లేక లొంగిపోవటమో జరుగుతుంది. సైనిక బలగాలు దండకారుణ్యాన్ని జల్లెడ పడుతున్న వేళ ఈ లేఖ కలకలం రేపింది. మావోయిస్టులు ఏనాడు ఫొటోతో లేఖ విడుదల చేయలేదు. మావోయిస్టులు లేఖలను గత కొంతకాలంగా నేరుగా మీడియా వ్యక్తులకు, సంస్థలకు పంపుతున్నారు. నెల రోజుల క్రితం రాసినట్లు చెపుతున్న లేఖ మంగళవారం రాత్రి ఎలా ప్రత్యక్షమైంది అన్నది ఒక ప్రశ్న. అందులో భాష కూడా మావోయిస్టుల సాంప్రదాయ భాష కాదని పరిశీలకులు భావిస్తున్నారు. ఆయుధాలు వదిలివేయాలన్న నిర్ణయం పార్టీలో జరిగి ఉంటే నెల రోజుల తర్వాత కూడా ఎందుకు సాయుధులుగా మావోయిస్టులు పోరాడుతున్నారనే ప్రశ్న తలెత్తుతుంది. ఆ లేఖలో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రస్తావన కూడా వచ్చింది. బసవరాజు కూడా నిరాయుధీకరణ వైపు ఆలోచన చేశాడని పేర్కొన్నారు. కానీ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు మూడు లేఖలను విడుదల చేసినప్పటికీ ఆ లేఖల్లో ఎక్కడ నిరాయుధీకరణ ప్రస్తావన లేదు. మార్చి 28న, ఏప్రిల్ 25న, మే మాసంలోనూ మావోయిస్టులు లేఖలను విడుదల చేసినప్పటికీ అందులో కూడా ఆయుధాలు వదిలేస్తామన్న ప్రస్థావన లేదు. మావోయిస్టులకు వ్యతిరేకంగా సైనిక చర్యలను నిలిపి వేయాలని తర్వాత చర్చలు జరపాలన్న డిమాండ్‌తో ఒక లేఖ విడుదలైంది. ఆ లేఖలో ప్రభుత్వం కాల్పులను నిలిపివేయాలని, షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆ లేఖలు రూపేష్, అభయ్ పేర్లతో విడుదలయ్యాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుండి శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధమన్న వార్తలు వెలువడ్డాయి. అయితే ఆయుధాలు వదిలితేనే మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను తుదముట్టిస్తామన్న ప్రకటనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఆ తర్వాత పలు ప్రకటనలు వెలువడ్డాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టుల నిరాయుధికరణ ప్రకటన లేఖ మావోయిస్టులు విడుదల చేసిన లేఖగా భావించడం లేదు. పోలీసులు సైతం ఇది మావోయిస్టులు రాసిన లేఖే అని ధృవీకరించడం లేదు. మావోయిస్టు ప్రతినిధి బృందం కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతినిధి బృందంతో చర్చించేందుకు సిద్ధమని లేఖలో ప్రకటించడం కూడా చర్చకు తావిస్తున్నది. అదేవిధంగా వెబ్‌సైట్ ప్రకటించడం మావోయిస్టు పంథా కాదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మావోయిస్టు పార్టీ బాధ్యుడు అభయ్ పేరుతో ఒక ఆడియో విడుదలైంది. ఆ ఆడియోలోనూ నిన్న లేఖలో పేర్కొన్న అంశాలనే పేర్కొన్నారు. ముప్పేట సవాళ్లను ఎదుర్కొంటున్న మావోయిస్టు సాయుధ పోరాట కొనసాగింపు కేంద్ర బలగాల మోహరింపు నిరంతర కూంబింగ్ వీటన్నింటి పైన చర్చ సాగుతున్న వేళ మావోయిస్టులు విడుదల చేసినట్లు చెబుతున్న లేఖ మరో చర్చ మాత్రమే తప్ప మరొకటి కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: కూకట్‌పల్లి సర్కిల్-24**

Lr No. 15/GHMC/KPC-24/EE/2025-26 టెండర్ ప్రకటన తేది: 16.09.2025

**NIT No.** 15/GHMC/KPC-24/EE/2025-26; తేది: 16.09.2025. **పని పేరు:** నిర్వహణ పని, **అంచనా విలువ :** NA, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 18.09.2025న ఉ.11.30గం.ల నుండి 25.09.2025న ఉ.11.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 8220-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్-26

**NIT No. 15/DB/EE/GJRM/CIRCLE-26/KPZ/GHMC/2025-26, తేది: 16.09.2025**

**పని పేరు:** జెసిబి వైబ్రేటరీ మినీ టెన్డం రోలర్ సేకరణ & బోర్‌వెల్ డ్రిల్లింగ్, **అంచనా విలువ :** రూ.23.80 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 18.09.2025న మ.03.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 26.09.2025న మ.03.30గం.ల వరకు. ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్ఎంసి. సెల్: 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 8243-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ ఫ్లోర్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

పబ్లిక్ నోటిఫికేషన్ HMDA చట్టం 2008 యొక్క U/s. 15(4) ప్రకారం

**(G.O.Ms.No. 189 MA & UD Dept., తేదీ: 10.09.2025)**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 ( 2008 చట్టం నెం.8) లోని సెక్షన్ సబ్ సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం G.O.Ms. No. 33 MA & UD, తేదీ: 24.01.2013ద్వారా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP-2031 ప్రకారం ఊహించిన భూవినియోగానికి, ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరమైన విధంగా ఈ క్రింది మార్పును చేస్తున్నది.

**ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్‌ప్లాన్ MDP-2031 ప్రకారం G.O Ms. No.33 MA & UD, తేదీ 24.01.2013ను ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్‌ప్లాన్ MDP-2031 ప్రకారం G.O.Ms.No.106 సమ్మతికి లోబడి తేదీ:06-07-2020న నీటిపారుదల శాఖ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లు జారీచేసిన NOCల ఆధారంగా సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు మండలం, ఇంద్రేశం గ్రామం వద్ద నెలకొని ఉన్న సర్వే నెంబర్లు 126, 129, 130/P & 132/P లను 23.34 ఎకరాల మేరకు నివాస వినియోగ జోన్‌గా రీనోటిఫికేషన్ చేయడమైనది.**

పైన పేర్కొన్న దానికి సంబంధించిన వివరాలు వెబ్‌సైట్లు http://gazette.telangan.gov.in// మరియు http://hmda.gov.in//.లో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (MK) హెచ్ఎండిఎ

DIPR R.O. No. : 8257-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025

## భూ నిర్వాసితులు రోడ్డుపై బైఠాయింపు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం రహదారిపై ఉదయమే భూ నిర్వాసితుల బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం తమపై దయతలిచి పూర్తిగా వ్యవసాయ భూముల నుంచి వెళ్తున్న త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ తక్షణమే మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనట్లయితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించిన భూ నిర్వాసితులను సిఐ రాములు, స్థానిక ఎస్సై జగన్ నేతృత్వంలో పోలీస్‌లు ధర్నా చేస్తున్న నిర్వాసితులను రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలను సజావుగా కొనసాగే చర్యలు తీసుకున్నారు.



## హమాలీలకు ఇఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: మార్కెట్ హమాలీ కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా అరుణ్‌కుమార్ ధేశ్‌ముఖ్ కు హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం హమాలీలతో కలిసి జడ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస సౌకర్యాలు కల్పిస్తూ, నాల్గవ తరగతి ఉద్యోగులుగా వారిని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామూర్తి,పానుగోతు గోపి,చక్రాల వెంకన్న,ధరావత్ అంజయ్య,బానోతు సైదులు,బానోతు వీరబాబు,బొల్లం కోటేశ్వరరావు,తేజవత్ నాగేష్,గణపవరం సైదులు,మల్సూర్ పాల్గొన్నారు.



# ప్రతీ ఊర్లో సాయుధ పోరాట త్యాగాల చరిత్ర

### ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ : పోరాటాలకు, త్యాగాలకు ఆత్మగౌరవానికి నిలువెత్తు సంతకం నల్లగొండ జిల్లా. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని నల్లగొండ జిల్లాలో ప్రతీ ఊర్లో త్యాగాల చరిత్ర ఉన్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తూ... వెట్టి నుంచి తెలంగాణ మట్టికి, ఈ ప్రాంతానికి విముక్తి కలిగిన సెప్టెంబర్ 17 ను పురస్కరించుకొని తెలంగాణ ప్రజాప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భూస్వామ్య జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అప్పటి నల్లగొండ జిల్లాలోని గుండ్రాంపల్లి, కడవెండి, రావులపెంట, శాలిగౌరారం, ఏనెమీదిగూడెం ప్రాంతాలు ఉద్యమానికి కేంద్ర బిందువులుగా నిలిచాయి అని గుర్తుచేశారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తున్నదని భారతదేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు ఎంతోమంది కృషి చేసినట్లుగానే ,తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని, తెలంగాణ ఉద్యమంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, అంతేకాక నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సెప్టెంబర్ 17న విముక్తి కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 2 లక్షల 33 వేల 981 మంది రైతులకు 2044.83 కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగింది. రుణమాఫీలో జిల్లాకు అత్యధిక లబ్ధి జరగడం సంతోషమన్నారు.ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణ పనులు మన ప్రజా ప్రభుత్వం ఏర్పాడ్డాక మళ్ళీ ప్రారంభించుకోవడం జరిగిందని, ఇటీవల దూరదృష్టావశాత్తు జరిగిన ప్రమాదం వల్ల పనులు మళ్లీ ఆగిపోవడం జరిగిందని,ఆగిన లైనింగ్ పనులు తిరిగి ప్రారంభించి 2027 డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నామని తెలిపారు.హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిని 8 లేన్ల నిర్మాణం, వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్టుకు అనుమతులు రావడం నాకు మిక్కిలి సంతోషమన్నారు.దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎం ఎల్ సి శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, లైబ్రరీ చైర్మన్ హాఫీజ్ ఖాన్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్బంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.



# అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష

### రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/సూర్యాపేట : అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, వాణిజ్య, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ, రాష్ట్రీయ గీతాలాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం కోసం అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ అమరవీరులకు జోహార్లు ఘటిస్తూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తుందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే వంట గ్యాస్, రైతుబరోసా కింద రైతులకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. రైతులు పంటసాగు కోసం చేసిన అప్పుల తీర్చలేక ఇబ్బందులు పడడంతో ఆరు నెలల్లోనే వారికి రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని దీని ద్వారా సూర్యాపేట జిల్లా 1లక్ష 27వేల 269 మంది రైతులకు రూ.1005 కోట్లు మాఫీ చేసిందన్నారు. రైతుభీమా పథకం ద్వారా 787 మంది రైతులు చనిపోగా వారి నామినిలకు రూ.39.35 కోట్లు అందజేయడం జరిగిందని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజక వర్గాల్లో అంచనా విలువ ఒక్కొక్కటి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్లు మంజూరి చేయడం జరిగిందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హుజూర్‌నగర్ మున్సిపాలిటిలోని రామస్వామి గుట్ట వద్ద యువత ఉపాధికి శిక్షణ ఇచ్చేందుకు రూ.22కోట్ల 16లక్షలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ ఐటిఐ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కొత్తగా 42వేల 279 నూతన రేషన్‌కార్డులు మంజూరి చేశామని చెప్పారు. నీటిపారుదల మెరుగు చేసేందుకు జిల్లాలోని ప్రధాన మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్‌కు కోట్లాది రూపాయలను మంజూరి చేసి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దీనికి ముందు విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పి కె నరసింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, నర్సింహాచారి, ఆర్‌డిఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.





## సిపిఐ కమ్యూనిస్టుల పోరాటంతోనే తెలంగాణకు స్వాతంత్ర్యం...

### తెలంగాణ విలీనమే...విమోచనం కాదు...పల్లా

ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 77వ వారోత్సవాల సందర్భంగా పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేందుకేనని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారి కంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి అనిత, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మైనోద్దీన్, మండల కౌన్సిల్ సభ్యులు, పట్టణ శాఖ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, జ్యోతిబస్, నగేష్, బుచ్చయ్య, వెంకటయ్య, శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

## తెలంగాణాలో ప్రజాపాలన మొదలైంది

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన అంతమై ప్రజాపాలన ప్రారంభమైందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు తెలిపారు. సెప్టెంబర్ 17 తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతోపాటు కాంగ్రెస్ కార్యాలయంలో వారు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత నిరంకుశపూరిత అధికారంతో పదేండ్లు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ బానిస సంకెళ్లు తెంపేసి ప్రజాపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిందన్నార. నాటి నిజాం ప్రభుత్వం నుంచి తెలంగాణాకు విముక్తి చెందిన ఏ విధంగానైతే భారత దేశంలో విలీనమైందో అదేవిధంగా నిరంకుశ రాజ్యం నుంచి విముక్తి పొందామన్నారు.

## ఎస్‌సి సంక్షేమ వసతి గృహాలకు కొత్త భవనాలు నిర్మాణం చేపట్టాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో అద్దె భవనాలలో నడుస్తున్న ఎస్సీ వసతి గృహాలకు కొత్త బిల్డింగులు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా పరిపాలనాధికారి జగన్మోహన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ జిల్లా కౌన్సిల్ పక్షాన వసతి గృహాలు సందర్శించిన క్రమంలో జిల్లాలో అద్దె భవనాలలో నడుస్తున్న భువనగిరి ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల వసతిగృహాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా రామన్నపేటలో నడుస్తున్న ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సి బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులు స్నానం చేయడానికి వాటర్ ట్యాంక్ లేక విద్యార్థుల అవస్థ పడుతున్నారన్నారు. భువనగిరి ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నారని రెండింటికి కలిపి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిప్పలపల్లి వంశీ, ప్రశాంత్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

# కళాశాలల్లో ఫలితాలు పెంచడంపై దృష్టి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కెజిబివి,ఇంటర్మీడియట్ కళాశాలలో ఫలితాలను పెంచడంపై దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా పాఠశాలలు,ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు.బుధవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కేజీ బివి లు, ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలు, అప్లిఏషన్, ఫలితాలు, ఫేస్ రికగ్నిషన్ సిస్టం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గడిచిన 3 సంవత్సరాలలో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో లెక్చరర్ల కోరతను తీర్చడమే కాకుండా, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నదని, అందువలన అడ్మిషన్స్ పెరిగే విధంగా ప్రిన్సిపల్స్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అలాగే కొన్ని కళాశాలల్లో ఫలితాలు తక్కువగా ఉన్నాయని ,అలాంటి కళాశాలల్లో ఫలితాలు పెంపొందించడం పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని ఇంటర్ కళాశాలల్లో నూటికి నూరు శాతం ఫేస్ రికగ్నిషన్ సిస్టం కవరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.యు డైస్ పూర్తిస్థాయిలో చేయాలని, అన్ని వివరాలు ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. కాగా ప్రభుత్వ సెక్టార్ లో పనిచేసే 97 మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, మోడల్ స్కూల్ లకు సంబంధించిన ప్రిన్సిపాల్స్ తో ఆమె సమీక్ష నిర్వహించారు.విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి విద్యను అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. అడ్మిషన్స్ తక్కువగా ఉన్నచోట అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించే చర్యలు చేపట్టాలని, అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. తాను కేజీబీవీలు, ఇతర పాఠశాలల సందర్శన సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడం జరుగుతున్నదని, కొన్ని పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు లోపించినట్లు గుర్తించామని, అందువల్ల ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ఈసమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ వైద్యాధికారి దశ్రు నాయక్, డిఈఓ భిక్షపతి ,ఆర్‌సిఓ స్వప్న, బలరాం, తదితరులు మాట్లాడారు. కాగా వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్స్ ఉన్నారు.



**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి**

పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె నల్గొండ మండలం, దోమలపల్లి లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తనిఖీ చేశారు.కాగా దోమలపల్లికి 70 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాగా, 56 ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్ లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అయితే ఈ 56 ఇళ్లలో పూర్తి అయిన ఇళ్లకు తక్షణమే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డిఓవై. అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాం ఉన్నారు.



## దడువాయి చాట స్వీపర్ హమాలీ కార్మికులకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: ఈనెల 27న నిజామాబాద్‌లో జరగనున్న మార్కెట్ హమాలీ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరంగా సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే దడువాయి చాట స్వీపర్ హమాలీ కార్మికులకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోతుందని, పెట్టుబడిదారులు మార్కెట్‌ను శాసిస్తూ రైతులకు తీరని దుఖాన్ని మిగిలిస్తున్నారని ఆరోపించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో హమాలీ యూనియన్ కార్మికులు బాలు, నాను, చందర్, నర్సింహ, బాషా, సైదయ్య, బద్రు, శంకర్, వెంకటయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

## అంజయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలి : ఆదిరెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) : నాటి నైజాం వ్యతిరేక పోరాటంలోపాత్ర లేని బిజెపి తెలంగాణ విలీన దినోత్సవం పై మాట్లాడే హక్కు లేదన్నారు.ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్య పెట్టేందుకేనని సిపిఐ సినియర్ నాయకులు మల్లేపల్లి ఆది రెడ్డి అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కనగల్ మండలంలోని చర్లగౌరారంలో అమరజీవి చిలకరాజు మరయ్య,అనచరుడు చింతల అంజయ్య గౌడ్‌ల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆదిరెడ్డి మాట్లాడుతూ అంజయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడం కోసం బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,బొల్గూరి నర్సింహులు నల్లగొండ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పొందరి, వి.లెనిన్, ఎం .నందం, బి.వెంకటయ్య,కె.నారాయణ,ఆర్ఎస్ రాములు, చింతల అంజయ్య గౌడ్ వారసులు మాజీ ఉప సర్పంచ్ చింతల బ్రహ్మయ్య,చింతల విజయ్, చింతల అంజయ్య,పల్లెబోయిన సైదులు, గంగన్నబోయిన మారయ్య పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం, విలువైన ప్రాణాలను కాపాడటానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి ఇరువైపులా పెద్దగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. పెద్ద చెట్ల వలన లైటింగ్ కనిపించకుండా ఉంటుందన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ధర్మోజిగూడెం క్రాస్ రోడ్డు, కొయ్యలగూడెం బస్సు స్టాప్, వలిగొండ ఎక్స్ రోడ్, అనంతారం బ్రిడ్జి, మోత్కూర్ పాటిమట్లల ఎక్స్ రోడ్ వంటి ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, అక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, యస్.ఈ రవీందర్, జిల్లా రోడ్లు భవనాల అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళ కోసం ప్రతి ఒక్కరూ కృషి

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

ప్రజాపక్షం/కోదాడ: ఆరోగ్య మహిళ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సూచించారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం ) కార్యక్రమాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో అన్ని ఆరోగ్య కేంద్రాల ముందు ప్రత్యేక మహిళ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాల్లో నేత్ర, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, దెర్మటాలజి, సైక్రియాటిస్ట్ వైద్య నిపుణులు పాల్గొని సేవలందిస్తారని, బిపి, షుగర్, క్యాన్సర్, టిబి, హిమోగ్లోబిన్, నేత్ర, గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు చేస్తారని అన్నారు. అవసరమై మందులను అక్కడికక్కడే అందజేస్తారని, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారని, అలాగే మహిళలకు రక్తహీనతకు గురికాకుండా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పిస్తారని, అవసరమైన మందులను కూడా వైద్య శిబిరంలో పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ దశరథ, డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మాధవ్‌కుమార్, ఇమ్యూనైజేషన్ డాక్టర్ లక్ష్మణ్, ఈఎన్‌టి డాక్టర్లు నర్సింహా, రాజేష్, అప్తమాలజీ డాక్టర్ నాగమణి, సైక్రియాటిస్టు డాక్టర్ స్రవంతి, జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవి, పల్మనాలజీస్ట్ డాక్టర్ వెంకటపాపిరెడ్డి, ఆయుష్ డాక్టర్ పారహీన్, కిశోర్ బాలికల డాక్టర్ శైలజ, డాక్టర్ పద్మావతి, ఆరోగ్యమిత్ర తిరుపమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాల ప్రచారం ఆపాలి

### సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు అఖిలభారత నాయకురాలు బృందాకరత్ హితవు

ప్రజాపక్షం/నల్లగొండ : భూమికోసం భుక్తి కోసం అలనాడు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి అబద్ధపు ప్రచారాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఆపాలని సిపిఐఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు అఖిలభారత నాయకురాలు బృందాకరత్ హితవు. పలికారు. నల్లగొండ పట్టణంలో బుధవారం సుభాష్ విగ్రహం సెంటర్‌లో సిపిఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణరైతాంగ సాయుధ పోరాట లో పాల్గొన్న అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ. భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 లిఖించబడ్డదని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కేంద్ర రక్షణ శాఖ మంత్రి హైదరాబాద్ కు వచ్చారు వస్తూ వస్తూ తనతో పాటు పెద్ద యంత్రం తెచ్చారు. ఆ యంత్రం ఏమిటంటే అబద్ధాలు తయారు చేసే మిషన్ తీసుకొని వచ్చారు. అది మీ అసత్య యూనిట్ నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో తయారైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ముందు అబద్ధాలు తయారు చేసే మిషన్ ని ప్రవేశపెట్టబోతున్నారు. వారు చెప్పే కథ ఏంటంటే వీర తెలంగాణ పోరాటము ముస్లిం రాజు,హిందువులకు మధ్య జరిగిన పోరాటమని చిత్రీకరించి ప్రచారం చేస్తున్నారు. వేదికపై సిపిఎం అఖిలభారత నాయకురాలు కామ్రేడ్ బృందా కారత్ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపల్లి సీతారాములు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మల్లు లక్ష్మి రాష్ట్ర నాయకులు బొంత చంద్రారెడ్డి,సిపిఎం నల్గొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆ వీడియోను వెంటనే తొలగించండి..
### కాంగ్రెస్‌కు పాట్నా హైకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లి దివంగత హీరాబెన్ మోదీ పై కాంగ్రెస్ ఎఐ వీడియో రూపొందించిన విషయం తెలిసిందే. ఈ వీడియో తీవ్ర దుమారానికి దారి తీసింది. దీనిపై బిహార్‌లో కాంగ్రెస్ పార్టీపై కేసు కూడా నమోదైంది. ఈ కేసును పాట్నా హైకోర్టు తాజాగా విచారించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలను వెంటనే తొలగించాలని హస్తం పార్టీని కోర్టు ఆదేశించింది. ప్రధాని మోదీకి ఆయన తల్లి హీరాబెన్ మోదీ కలలోకి వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ ఎఐ వీడియో రూపొందించిన విషయం తెలిసిందే. 'సాహబ్ కలలోకి అమ్మ వచ్చింది' అనే శీర్షికతో బిహార్ కాంగ్రెస్ 36 సెకన్ల వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో తీవ్ర దుమారం రేపింది. దీనిపై బిజెపి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల మనోభావాలను గాయపరచేందుకు ఉద్దేశించిన వీడియోగా దీనిపై బిజెపి మండిపడింది. కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై ఫిర్యాదు చేసింది.

### హైదరాబాద్ గెజిట్ ఆధారంగా డిమాండ్ చేస్తే
## వర్గాల మధ్య సామాజిక ఐక్యత సాధ్యం కాదు
### ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్



**పుణె :** ప్రతి సామాజికవర్గం హైదరాబాద్ గెజిట్‌ను ఆధారంగా చేసుకుని డిమాండ్ చేస్తే వర్గాల మధ్య ఐక్యతను సాధించడం కష్టమవుతుందని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. వసంతదాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో పాల్గొనేందుకు పుణెకు వచ్చిన పవార్ విలేకరులతో మాట్లాడారు. మరాఠాలు, ఒబిసిల కోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పవార్ ప్రశ్నించారు. సామాజిక ఐక్యతపై ఎటువంటి రాజీ పడకూడదని, రాజకీయంగా ఏదైనా మూల్యం చెల్లించాల్సి వస్తే చేయాల్సిందేనన్నారు. మరాఠా సామాజికానికి చెందిన వారు ఒబిసి కుంబి కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు వీలుగా హైదరాబాద్ గెజిట్ అమలు చేయడం వల్ల ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన తరగతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివిధ కుల సంఘాలు వాదించాయి. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ప్రారంభంలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) సంక్షేమ చర్యలను వేగవంతం చేయడానికి, రిజర్వేషన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి తొమ్మిది మంది సభ్యులతో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ముంబయిలో ఐదు రోజులుగా మరాఠా రిజర్వేషన్ ఉద్యమకార్యకర్త మనోజ్ జరంగే నిరాహార దీక్ష చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లలో చాలా వరకు అంగీకరించింది. అర్హత కలిగిన మరాఠాలకు కున్బి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయడం ద్వారా వారు ఒబిసిలకు రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు అర్హులవుతారు. అయితే రిజర్వేషన్ ప్రయోజనాల కోసం మరాఠాలను ఒబిసి కేటగిరీలో చేర్చడాన్ని ఒబిసి నాయకులు, సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదిలా ఉండగా, 'దురదృష్టవశాత్తు, గత కొన్ని రోజులుగా, మరాఠ్వాడాలో వివిధ వర్గాలలో అశాంతి పెరుగుతోంది. అందుకే సామాజిక నిర్మాణం బలహీనపడుతోందని చెప్పాను. ప్రతి రోజూ కొత్త డిమాండ్లు లేవనెత్తుతున్నారు. రెండు రోజుల క్రితం, బంజారా కమ్యూనిటీ ఎస్‌టి కేటగిరీలో చేర్చాలని నిరసన వ్యక్తం చేయగా, మరుసటి రోజు ఆదివాసీలు అలాంటి చేరికను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు' అని పవార్ అన్నారు. మరాఠా, ఒబిసి వర్గాల మధ్య కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎత్తి చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటి ఒబిసిల కోసం, మరొకటి మరాఠాల కోసం రెండు కమిటీలను ఏర్పాటు చేసిందని పేర్కొంటూ కులం ఆధారంగా రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం నిజంగా ఉందా అని ప్రశ్నించారు. అలాంటి కమిటీలు సహజంగానే అవి ఏర్పాటవుతున్న సంఘాల గురించి మాత్రమే ఆలోచిస్తాయని, మరొక వైపు చూడవన్నారు. రెండు వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం అవసరమని పవార్ అన్నారు. మనం ఐక్యతను కోరుకుంటే, అలాంటి కమిటీల ద్వారా విడిగా పనిచేయడం సహాయపడదు అని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. అంతిమంగా, వర్గాల మధ్య వైరాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. బలహీనపడుతున్న సామాజిక నిర్మాణం గురించి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చేసిన ప్రకటనపై పవార్‌ను ప్రశ్నించగా, వివధ వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం, వైరాన్ని అంతం చేయడం, దానికి ఏదైనా మూల్యం చెల్లించాల్సి వస్తే, దానిని చెల్లించాలి' అని అన్నారు. కోటా డిమాండ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం హైదరాబాద్ గెజిట్ సహాయం తీసుకుంటుంటే తనకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కానీ ప్రతి సామాజిక వర్గం తమ డిమాండ్లను ముందుకు తీసుకురావడానికి హైదరాబాద్ గెజిట్‌ను ప్రాతిపదికగా ఉపయోగిస్తోందన్నారు. హైదరాబాద్ గెజిట్ వర్గాల మధ్య చీలికలను సృష్టిస్తుందా అని అడిగినప్పుడు, పవార్ తాను ఇంతకు ముందు ఎప్పుడూ హైదరాబాద్ గెజిట్ చదవలేదని, ఇప్పుడు దాన్ని చదివాను అని అన్నారు

### ఆ తల్లి వ్యవహరించిన తీరుతో...
## న్యాయవ్యవస్థలు 'అసహనానికి' గురయ్యాయ్
### 'సుప్రీంకోర్టు' కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :**భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లోని న్యాయవ్యవస్థను ఒక మహిళ తనకు బాగా తెలిసిన కారణాల వల్ల 'అసహనానికి గురిచేసింది'అని గమనించిన సుప్రీంకోర్టు ఆమె మైనర్ కుమారుడి కస్టడీని అతడి తండ్రికి అప్పగించాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ మహిళ ప్రవర్తనను ఖండించింది. ఈకేసు ఆమహిళ, ఆమె భర్త మధ్య లోతుగా పాతుకుపోయిన సంఘర్షణను ప్రతిబింబిస్తోందని తెలియజేసింది. భారతదేశంలో కలిసిఉండటం, వారి పిల్లలను పెంచడం గురించి వారి విభిన్న ఉద్దేశాల నుంచి ఉద్భవించిందని పేర్కొంది. ఈ విభేదాలు వారి వైవాహిక జీవితాన్ని దెబ్బతీయడమే కాకుండా వారి ఇద్దరు పిల్లలు వారి తల్లితో యునైటెడ్ కింగ్‌డమ్‌లో కలిసి ఉండటంపైన కూడా ప్రతికూల ప్రభావం చూపిందని ధర్మాసనం అభిప్రాయపడింది. 2010 నవంబరులో వివాహం చేసుకున్న ఈ జంట మధ్య చాలా దీర్ఘకాలికంగా పొడసూపుతున్న విభేదాలు వారి ఇద్దరి పిల్లల విషయంలో మరింత ప్రభావానికి దారితీసిందని వివరించింది. ఇది కేవలం అహాల మధ్య సంఘర్షణ కాదని, ప్రాథమికంగా మైనర్ పిల్లలపై ప్రభావం చూపే మనస్తత్వానికి సంబంధించినదని ధర్మాసనం గమనించింది. పరిస్థితులు పిల్లల సంక్షేమం, ప్రయోజనాలను కాపాడేందుకు బలవంతం చేస్తున్నాయని వెల్లడించింది. ఆమహిళ ప్రవర్తన గురించి ప్రస్తావిస్తూ ఆమె తన తండ్రిని భారతదేశంలో వదిలివెళ్లేటప్పుడు తండ్రికి తెలియజేయడం తన ప్రాథమిక కర్తవ్యమని, దానిని ఆమె పాటించలేదని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఆ వ్యక్తి దరఖాస్తు దాఖలు చేసిన యుకె హైకోర్టులో ఆ బాలుడు తనతో లేడని తెలియజేయడం కూడా ఆమె విధి అని ధర్మాసనం తెలియజేసింది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆదేశాలు ఉన్నప్పటికీ తండ్రికి 'కె'(ఆబాలుడి)తో వర్చువల్ మీటింగ్స్ నిర్వహించే అవకాశం లేకుండా పోయిందని, చివరికి అనుమానం తలెత్తినప్పుడు అతను హెబియస్ కార్పస్ పిటిషన్‌ను పంజాబ్ మరియు హైకోర్టు ముందు దాఖలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని ధర్మాసనం ఎత్తిచూపింది. ఆ మహిళ తన కుమారుడిని ఎప్పుడూ తన తండ్రిని కలవాలని కోరుకోలేదని, అంతేకాకుండా కనీసం కోర్టు ఆదేశాలను కూడా గౌరవించాలని ఎప్పుడూ కోరుకోలేదనే విషయం అర్థం అవుతోందని ధర్మాసనం తెలిపింది. ఆ తల్లికి బాగా తెలిసిన కారణాల వల్ల భారతదేశం, యుకె న్యాయవ్యవస్థలు ఇబ్బందుల్లో పడిందని బెంచ్ వెల్లడించింది. తనభార్య తనకు తెలియజేయకుండా, తన సమ్మతిని తీసుకోకుండానే ఇద్దరు పిల్లలతో కలిసి 2021 మేలో భారతదేశానికి వెళ్లిందని ఆ వ్యక్తి సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆ తర్వాత తన మైనర్ కుమారుడు అత్తమామలతో కలిసి భారత్‌లో ఉన్నాడని అతడికి తెలిసింది. తన పిల్లల అక్రమ కస్టడీపై పంజాబ్, హర్యానా హైకోర్టును ఆయన సంప్రదించాడు. సెప్టెంబరు 16న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో ఆ మహిళ లండన్‌లోని ఫ్యామిలీ కోర్టు నుండి విడాకులు పొందిందని, ఆ వ్యక్తి జింద్‌లోని ఫ్యామిలీ కోర్టు నుండి విడాకులు పొందాడని వెల్లడించింది. హైకోర్టు బాలుడి తాత్కాలిక కస్టడీని తన తండ్రికి ఇవ్వడం సమర్థనీయమని ధర్మాసనం పేర్కొంది. సెప్టెంబరు 30 నాటికి బాలుడిని కస్టడీ ని తన తండ్రికి అప్పగించాలని ఆదేశించింది. ప్రతీ శనివారం సాయంత్రం 5 గంటల నుండి 7గంటల వరకు తల్లి లేదా సోదరి అతడితో ఆడియో లేదా వీడియో యాక్సిస్ చేసుకునే హక్కు కలిగిఉంటారని ధర్మాసనం ఆదేశం జారీ చేసింది. తల్లి భారతదేశ పర్యటన సందర్భంగా ప్రతీ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్ర 5 గంటల వరకు ఇరువురూ ఎంపిక చేసుకున్న స్థలంలో కలుసుకునే హక్కును కూడా కలిగి ఉం టారని ధర్మాసనం తెలియజేసింది. అలాగే అబ్బా యి అమ్మమ్మలు కూడా ప్రతీ ఆదివారం ఇదే సమయంలో ఇరువురూ నిర్ణయించిన స్థలంలో కలుసుకునే హక్కును కలిగిఉంటారని కూడా ఆదేశాలు జారీచేసింది.

## గ్యాంగ్‌స్టర్ చోటారాజన్ బెయిలు రద్దు..
### 'సుప్రీం' సంచలన తీర్పు



**న్యూఢిల్లీ :** గ్యాంగ్‌స్టర్ చోటారాజన్‌కు 2001 జయశెట్టి హత్య కేసులో ముంబయి హైకోర్టు ఇచ్చిన బెయిలును సుప్రీంకోర్టు బుధవారం నాడు రద్దు చేస్తూ కీలక తీర్పు చెప్పింది. హోటల్ వ్యాపారి జయశెట్టి హత్యకు సంబంధించిన కేసులో గత ఏడాది మేలో ప్రత్యేక కోర్టు చోటా రాజన్‌ను దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును ముంబయి హైకోర్టులో చోటారాజన్ సవాలు చేశారు. 2024 అక్టోబర్ 23న ముంబయి హైకోర్టు చోటారాజన్ విధించిన శిక్షను సస్పెండ్ చేస్తూ బెయిలు మంజూరు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సిబిఐ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్ దీనిపై విచారణ జరిపింది. 'చోటారాజన్ నాలుగు కేసుల్లో దోషిగా ఉన్నప్పుడు అలాంటి వ్యక్తికి విధించిన జైలుశిక్షను ఏ విధంగా రద్దు చేస్తారు?' అని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. హైకోర్టు ఉత్తర్వును రద్దు చేసింది. చోటారాజన్‌పై ఉన్న 71 కేసుల్లో 47 కేసుల్లో సిబిఐ దగ్గర ఎలాంటి సాక్ష్యాలు లేవని రాజన్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే ఆయన వాదనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇతర కేసుల్లో ఇప్పటికే జీవిత ఖైదు పడినందున తిరిగి అతను లొంగిపోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం, దక్షిణ ముంబైలోని గోల్డెన్ క్రౌన్ హోటల్ యజమాని జయశెట్టికి చోటారాజన్ ముఠా నుంచి బలవంతపు వసూళ్ల బెదిరింపులు వచ్చాయి. శెట్టికి పోలీసు రక్షణ కల్పించినప్పటికీ అతని హత్యకు రెండు నెలల ముందు భద్రతను ఉపసంహరించారు. రూ.50,000 ఇవ్వాలన్న చోటారాజన్ గ్యాంగ్ డిమాండ్‌ను కాదన్నందుకు 2001 మే 4న జయశెట్టిని అతని కార్యాలయం వెలుపల ఇద్దరు ముఠా సభ్యులు కాల్చిచంపారు. 2024 మేలో ముంబైలోని ప్రత్యేక ఎంసిఒసిఎ కోర్టు చోటారాజన్‌కు జీవిత ఖైదు, రూ.1,00,000 జరిమానా విధించింది.

## పాకిస్థాన్‌ను మోకాళ్ళమీద కూర్చోబెట్టాం
### ధార్ సభలో నరేంద్రమోదీ



**ధార్:** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యం పాకిస్థాన్‌ను రెప్పపాటుకాలంలో అణచివేసి మోకాళ్ళమీద కూర్చోబెట్టిందని, ఉగ్రవాదుల రోదనలను యావత్ ప్రపంచ వీక్షించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని పిఎం మిత్ర పార్క్ (ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్–అపారల్)కు బుధవారం పునాదిరాయి వేసిన తర్వాత జరిగిన సభలో ప్రధానమంత్రి మాట్లాడారు. శత్రుదేశం ఇంట్లోకి ప్రవేశించాం, వాళ్ళమీదే దాడిచేశాం, పాకిస్థాన్ ఉగ్రవాదులు మన సోదరీమణుల, మన కుమార్తెల మాంగల్యాలను తెంచేశారు, అందుకే మనం ఆపరేషన్ సిందూర్ చేశాం, ఉగ్రవాదులు దాడులు చేయడానికి ఉపయోగించే కేంద్రాలను ధ్వంసం చేశాం'' అని నరేంద్రమోదీ చెప్పారు. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ కమాండర్ విడుదల చేసి వైరల్‌గా మారిన వీడియోను సభలో ప్రధానమంత్రి ప్రస్తావించారు. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న కశ్మీరు భూభాగంలోకి, పాకిస్థాన్ భూభాగంలోకి భారత గగనతల వ్యవస్థలు ప్రవేశించి దాడులు చేశాయన్నారు. అదేవిధంగా స్వదేశీ వస్తువులనే ఎక్కువగా ఉపయోగించాలని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ''ఇది పండుగలు, పర్వదినాల సమయం, ఈ సందర్భం గా మనం ఒక మంత్రాన్ని గుర్తుంచుకోవాలి, అదే మన స్వదేశీ మంత్రం, స్వదేశీ వస్తువులనే మనం కొనుగోలు చేద్దాం, స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహిద్దాం, స్వదేశీ వస్తువులనే మన జీవితాల్లోకి ఆహ్వానిద్దాం, 140 కోట్లమంది భారతీయ ప్రజలకు నాదొక వినయపూర్వక విజ్ఞప్తి, మీరు మార్కెట్‌లో ఏది కొనుగోలు చేసినాగానీ, మనదేశంలో తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయండి, మనదేశంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో మన కార్మికులు చెమటలు చిందించి తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయండి, ఈ విషయాన్ని బోర్డులు ప్రదర్శించడం ద్వారా దుకాణదారులు గర్వంగా ప్రకటించండి'' అని మోదీ విజ్ఞప్తి చేశారు. మహిళల ఆరోగ్యం మెరుగుదల, వారిలో పోషకాహార విలువల ప్రోత్సాహంకోసం ప్రచారం నిమిత్తం 'స్వస్త్ నారీ సాక్షాత్ పరివార్', 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ ప్రచార కార్యక్రమాలను నరేంద్రమోదీ ప్రారంభించారు. స్వదేశీ నారీశక్తి పరివార్ ఆరోగ్య చొరవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా దేశ మహిళలకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ''మనదేశంలో మన తల్లుతు, సోదరీమణు ఎలాంటి సందేహాలు లేకుండా ఈ ప్రచార శిబిరాల్లో పాల్గొనండి, ఈ శిబిరాల్లో ఉన్న ఔషధాలను ఉచితంగా వాటిని పొందండి, మీఆరోగ్యం కంటే ప్రభుత్వ ధనం గొప్పదేమీ కాదు'' అని ప్రధానమంత్రి అన్నారు. పుట్టినరోజు సందర్భంగా మోదీ ధార్ జిల్లాలో పర్యటించడం ఇది రెండోసారి. 2022లో కూడా ఇదేనెలలో తన పుట్టినరోజు సందర్భంగా ధార్ జిల్లాలో నరేంద్రమోదీ పర్యటించారు.

**సెప్టెంబరు 17ను ఇక హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా పాటిద్దాం**

ధార్‌లో జరిగిన సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ విముక్తి దినోత్సవాన్ని ప్రస్తావించారు. 1948 సెప్టెంబరు 17వ తేదీన భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌ను విముక్తి చేశారన్నారు. హైదారబాద్‌ను అణచివేత నుండి భారతదేశ సైన్యం విముక్తిచేసిప్రజల హక్కులను కాపాడిందని, భారతదేశంలోకి తిరిగి హైదారాబాద్‌ను విలీనం చేసిందన్నారు. ''ఇకమీదట మనం సెప్టెంబరు 17వ తేదీని హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా పాటించడం ప్రారంభిద్దాం, బ్రహ్మాండంగా ఉత్సవాలు చేసుకుందాం, ఈరోజు హైదరాబాద్‌లో విముక్తి దినోత్సవం జరుగుతోంది'' అని చెప్పారు.

## 24న సిడబ్ల్యుసి భేటీ



**న్యూఢిల్లీ :** పాట్నాలో ఈనెల 24న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ అగ్ర నాయకత్వం రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై మేధోమథనం, 'ఓటు చోరీ'కి సంబంధించి బిజెపిపై దాడిని తీవ్రతరం చేయనుందని బుధవారం వర్గాలు తెలిపాయి. సమావేశంలో శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభా పార్టీ (సిఎల్‌పి) నాయకులు పాల్గొని విస్తృతంగా చర్చించనున్నారు. బిహార్, పార్టీ ప్రచార వ్యూహం, భవిష్యత్ ఎన్నికలు, 'ఓటు చోరీ'పై దృష్టి సారించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈనెల 24న ఉదయం 10 గంటలకు సిడబ్ల్యుసి సమావేశం జరుగుతుందని వారు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ సహా పార్టీ అగ్ర నాయకులందరూ ఈ సమావేశంలో పాల్గొంటారు. మహాఘట్బంధన్ భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు, రాహుల్ గాంధీ 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నిర్వహించిన 'ఓటరు అధికార్ యాత్ర', రాష్ట్రంలో పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచిన, ఉత్తేజపరిచిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ తర్వాత కొన్ని రోజుల తర్వాత ఈ సమావేశం జరుగుతుంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఎన్నికలకు సిద్ధం కావడానికి కాంగ్రెస్ మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. అందులో బిహార్ యూనిట్ చీఫ్ రాజేష్ రామ్, షకీల్ అహ్మద్ ఖాన్, మదన్ మోహన్ ఝా వంటి వారు ఉన్నారు. ఈ కమిటీలో 39 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు బిహార్‌కు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎఐసిసి కార్యదర్శులు, సిడబ్ల్యుసి సభ్యులు, ఫ్రంటల్ సంస్థల అధిపతులు ప్యానెల్‌కు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. బిహార్ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

## ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలు - ప్రచారం, ప్రభావం




భారతదేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో జరిగే విద్యార్థి సంఘాల ఎన్నికలను, సామాన్య ప్రజల నుండి అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు సైతం పరిశీలిస్తారు. దేశంలోనే వివిధ ప్రాంతాల నుండి, భిన్న భాషలు, సంస్కృతుల నుండి విశ్వ విద్యాలయాలకు వచ్చే విద్యార్థులు, యూనివర్సిటీ క్యాంపస్ లను రాజకీయ అవగాహనతో దేశ ప్రజలను ప్రభావితం చేస్తారు. రేపటి భారత పౌరులుగా తమ సైద్ధాంతిక పునాదులపై నిలబడి, ఉపన్యాసాలతో, చర్చలతో మేథ మదనానికి శ్రీకారం చుడతారు. ఆలోచనపరులుగా రాజకీయాలకు దూరంగా ఉండే వారిలో సైతం అవగాహన కల్పిస్తారు. ఆశలను రేకెత్తిస్తారు. దేశ రాజధాని ఢిల్లీలోని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడింది. దీంతో వివిధ సంఘాలు తమ అభ్యర్థులను పోటీలో నిలబెట్టాయి. వామపక్ష విద్యార్థి సంఘాలతో పాటు ఇతర సంఘాలు ప్రచారాన్ని ప్రారంభించాయి. ఎఐఎస్‌ఎఫ్ నుండి అభ్యర్థులు పోటీలో ఉండడంతో దేశంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులను ప్రచారం నిమిత్తం ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కౌన్సిల్ ఢిల్లీ రావాలని చెప్పడంతో, తెలంగాణలోని ఉస్మానియా యూనివర్సిటీ నుండి నేను, ఉదయ్ కుమార్ ఢిల్లీ వచ్చాము.


ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఎఐఎస్‌ఎఫ్, ఎఐడిఎస్‌ఒ కలిసి ఒక ప్యానెల్‌గా పోటీ చేస్తున్నాయి. అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులకు నామినేషన్లు వేశారు. ఇక అక్కడి నుండి బిజెపి దాని అనుబంధ ఎబివిపి కుత్ర రాజకీయాలు మొదలయ్యాయి. ఢిల్లీ యూనివర్సిటీ అధ్యక్ష పదవికి అభిషేక్ (ఎఐడిఎస్‌ఒ), ఉపాధ్యక్ష పదవికి మాలిక్ జాఫర్ (ఎఐఎస్‌ఎఫ్), కార్యదర్శిగా మోహిత్(ఎఐఎస్‌ఎఫ్), సహాయ కార్యదర్శిగా అమేలియా అన్ వర్గీస్ (ఎఐఎస్‌ఎఫ్) లు నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన ఎఐఎస్‌ఎఫ్ అభ్యర్థి మాలిక్ జాఫర్ నామినేషన్‌ను యూనివర్సిటీ అధికారులు తిరస్కరించారు. ఎందుకు తిరస్కరించారో చెప్పాలని విద్యార్థులు డిమాండ్ చేస్తే, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యక్ష పదవికి అనర్హులన్నారు. కానీ గత సంవత్సరం వేరే విద్యార్థి సంఘాలకు అనుమతి ఇచ్చారు కదా అని అడగగా, దానికి యూనివర్సిటీ అధికారుల వద్ద సమాధానం లేదు. ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన మాలిక్ జాఫర్ ముస్లిం కావడం, అందునా కశ్మీర్ ముస్లిం కావడం వల్లనే అతని నామినేషన్ తిరస్కరించబడిందని ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులే యూనివర్సిటీ అధికారులను నిలదీసి అడిగారు. బిజెపి ప్రోద్బలంతో ఢిల్లీ యూనివర్సిటీ అధికారుల తీరు ఇలా ఉంటే, ఎబివిపి ఆగడాలు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయి. ఎఐఎస్‌ఎఫ్ అభ్యర్థులు అన్ని పోస్టులకు నామినేషన్లు వేయగా ఎబివిపి గుండాలు నామినేషన్ పత్రాలు చింపివేశారు. దీనికి సంబంధించిన వీడియో సాక్ష్యాలను సైతం యూనివర్సిటీ అధికారులకు అందించి, ఈ ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేయగా, వారి నుండి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదు. నిరసనగా ఢిల్లీ యూనివర్సిటీ గేట్ ముందు ధర్నా చేయగా ప్రయివేట్ సెక్యూరిటీ సిబ్బంది విద్యార్థులపై దాడులు చేశారు. అమ్మాయిల పట్ల అసభ్యకరం గా ప్రవర్తించారు. ఇదంతా ఢిల్లీ పోలీసుల సమక్షంలో జరిగినా, పోలీసులు మాత్రం మౌనం గా ఉన్నారు. ఇంత దాడి జరిగినా అభ్యర్థులు, విద్యార్థులు ఎక్కడా నిరాశ చెందకుండా, తరువాతి రోజు నుండే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టాం. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ఏ కాలేజీ ముందు చూసినా వందల సంఖ్యలో ఢిల్లీ పోలీసు లు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిఆర్‌పిఎఫ్ బలగాలు మోహరించాయి. వామపక్ష విద్యార్థి సంఘాలు కాకుండా, మిగతా విద్యార్థి సంఘాల ప్రచార తీరు సాధారణ ఎన్నికలను తలపించింది. ఖరీదై న కార్లలో తిరుగుతూ, డిజె శబ్దాలతో, మందు పార్టీలతో విద్యార్థుల వద్దకు వెళ్లడం కాస్త ఆశ్చర్యంగా అనిపించింది. ఇందుకు భిన్నంగా వామ పక్ష విద్యార్థి సంఘాల ప్రచారం కొనసాగింది. ఎఐఎస్‌ఎఫ్ ఎఐడిఎస్‌ఒ జాయింట్ పానెల్ గా ప్రతికాలేజీకి వెళ్లి, కాలేజీలోని ప్రతి డిపార్ట్‌మెంట్లో విద్యార్థులను కలిశాం. విద్యార్థి సంఘ ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టోను విద్యార్థుల ముందు ఉంచాం. మా పానెల్‌ను ఎన్నుకుంటే విద్యార్థుల కోసం ఏం చేస్తామో తెలిపాం.

ఢిల్లీ యూనివర్సిటీ ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య హాస్టల్ లేకపోవడం. యూనివర్సిటీ పరిధిలో దాదాపు లక్ష నలభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి, ఉన్నత చదువుల కోసం, ఢిల్లీ యూనివర్సిటీకి వచ్చినవారు. కానీ అందులో కేవలం 30 శాతం మంది విద్యార్థులకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉంది. మిగతా డెబ్బై శాతం విద్యార్థులు బయట వేల రూపాయలు ఖర్చు చేసి, ప్రైవేటు హాస్టల్‌లలో, రూమ్‌లలో ఉంటున్నారు. విద్యార్థులు డబ్బు కోసం సాయంత్రం వేళల్లో పార్ట్ టైం ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులన్నీ ఢిల్లీ యూనివర్సిటీ ఉన్నత చదువులు కేవలం డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తున్నాయి. పేద విద్యార్థులు వారి కుటుంబ పరిస్థితుల వలన యూనివర్సిటీలో సీటు వచ్చినా చదవకపోవడం, చేరినా ఖర్చులు భరించలేక చదువులు మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు. దేశ రాజధాని, ఢిల్లీ మహానగరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఢిల్లీ యూనివర్సిటీలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉండటం బిజెపి ప్రభుత్వం విద్య పట్ల, యూనివర్సిటీల పట్ల అవలంబిస్తున్న విధానాలు ఏంటో దేశ ప్రజలకు కళ్ళ ముందు కనబడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కొత్త హాస్టల్లను అయినా నిర్మించాలి, లేదంటే ప్రైవేట్ హాస్టల్ రెంటును విద్యార్థులకు రియింబర్స్‌మెంట్ చేయాలని ఎఐఎస్‌ఎఫ్‌గా డిమాండ్ చేశాం. ఢిల్లీ యూనివర్సిటీలో మరో ప్రధాన సమస్య విద్యార్థులకు, విద్యార్థి సంఘాలకు, యూనివర్సిటీ అధికారుల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఉన్నత వర్గాల పిల్లలు ఎక్కువగా చదివే ఢిల్లీ యూనివర్సిటీలో, వారికి యాదృచ్ఛికంగానే రాజకీయాల పట్ల అనాసక్తి ఉంది. అక్కడక్కడ కనిపించే సాధారణ విద్యార్థులకు రాజకీయాలు చేయాలనే ఆసక్తి ఉన్నా, వారంతా నిస్సహాయ స్థితిలో వున్నారు. వారందరికీ ఒక నమ్మకం కలిగించాలని, అసమానతలపై పోరు చేయాలనే చైతన్యం రగిలించాలని ఏఐఎస్‌ఎఫ్‌గా మా పాత్ర పోషించాం. ఒకవైపు గుంపులుగా అరుస్తూ, ధనబలంతో కొన్ని విద్యార్థి సంఘాలు ప్రచారం చేస్తుంటే, మరోవైపు విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పట్ల, సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూనే విద్యార్థులుగా మనం ఏం చేయగలమో మా ప్రచారంలో ప్రశ్నలుగా లేవనెత్తాం.

బిజెపి, ఎబివిపి యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కొన్ని కాలేజీల వద్ద మమ్మల్ని గేటు వద్ద ఆపివేసినా, నిరుత్సాహ పడకుండా వారి అసమర్థ, గుండా రాజకీయాలను విద్యార్థులకు చెబుతూ ముందుకు సాగిపోయాం. గెలుపు ఓటములు ఎలా ఉన్నా. మా ప్రచార సరళి విద్యార్థుల్లో కొన్ని ప్రశ్నలు లేవనెత్తింది, ఆశలు రేకెత్తించింది. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ల తప్ప అనే నమ్మకాన్ని కలిగించింది. పోలింగ్ 18.9.25

**రెహమాన్**
**ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి**

### గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్
## ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి



**గడ్చిరోలి :** మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్ జరిగింది. బుధవారం గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఎటపల్లి తాలూకాలోని మోడస్కే గ్రామాన్ని ఆనుకుని ఉన్న అడవిలో మావోయిస్టుల గట్టా ఎల్‌ఒఎస్ (స్థానిక సంస్థ దళం) సభ్యులు కొంతమంది మకాం వేస్తున్నట్లు ఉదయం విశ్వసనీయ సమాచారం అందిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ నేపథ్యంలో గడ్చిరోలి పోలీసులకు చెందిన ఐదు యూనిట్ల సి60తో పాటు, అహేరి నుండి పోలీసులు వెంటనే ఆపరేషన్ ప్రారంభించారని ఆయన చెప్పారు. సి60 దళం అటవీ ప్రాంతంలో శోధిస్తున్నప్పుడు, మావోయిస్టులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారని అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ తరువాత ఘటనాస్థలిలో పరిశీలించగా ఇద్దరు మహిళా నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఒక ఆటోమేటిక్ ఎకె47 రైఫిల్, ఒక అధునాతన పిస్టల్, లైవ్ మందుగుండు సామగ్రి, పెద్ద మొత్తంలో నక్సల్ సాహిత్యం, వారి వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## 12 మంది నక్సల్స్ లొంగుబాటు



**నారాయణపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో 12 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో తొమ్మిది మందిపై సమష్టిగా రూ. 18 లక్షల రివార్డు ఉన్నట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఐదుగురు మహిళలు సహా ఈ కేడర్లు సీనియర్ పోలీసు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) అధికారుల ముందు లొంగిపోయారని నారాయణ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా తెలిపారు. మావోయిస్టు భావజాలం, అమాయక గిరిజనులపై నక్సలైట్లు చేసిన దురాగతాలు, నిషేధిత సంస్థలో పెరుగుతున్న అంతర్గత విభేదాల పట్ల వారు నిరాశ చెందారని ఆయన అన్నారు. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు సుద్రేన్ నేతమ్ (41), ధోబా సలాంలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. లొంగిపోయిన మరో ఇద్దరు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రివార్డు ప్రకటించగా, మరో ముగ్గురి తలలపై రూ. 1 లక్ష రివార్డు, ఇంకో ఇద్దరు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 50,000 రివార్డు ప్రకటించారని ఆయన తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి మరింత పునరావాసం కల్పిస్తామన్నారు. దీంతో ఈ సంవత్సరం జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 177 మంది కార్యకర్తలు లొంగిపోయారని పోలీసులు తెలిపారు.

# తుదిలేని వివాదం

పంట అవశేషాల దగ్ధం.. పెరుగుతున్న కాలుష్యం మరోసారి తెరపైకి వచ్చాయి. తుదిలేని సమస్యగా మారిన ఈ 'స్టబుల్ బర్నింగ్' వివాదంపై పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు హెచ్చరికలు జారీ చేయడం ఈ సమస్య తీవ్రతకు నిదర్శనం. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ కాలాల్లో, కోత అనంతరం టన్నుల కొద్దీ పంట అవశేషాలు మిగిలిపోతాయి. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో వరి పంట కోత అక్టోబర్ – నవంబర్‌లో జరుగుతుంది. గోధుమ విత్తనాలు వేసేందుకు కేవలం 15 నుంచి 20 రోజుల వ్యవధి ఉంటుంది. అంత తక్కువ సమయంలో పొలాన్ని సిద్ధం చేసుకోవాలంటే, వ్యర్థాలను దగ్ధం చేయక తప్పడం లేదు. వీటిని ఇతరత్రా మార్గాల్లో తొలగించే అవకాశం ఉన్నప్పటికీ, అందుకు ఎక్కువ సమయం, అధిక వ్యయం తప్పదు. వ్యర్థాలను తొలగించే యంత్రాల ఖరీదు చాలా ఎక్కువ. చిన్న రైతులు వీటిని కొనుగోలు చేయలేరు. ప్రభుత్వాలు ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. పంట వ్యర్థాలకు ఇతరత్రా ఉపయోగాలు ఉంటాయనే అవగాహన ఎక్కువ మంది రైతుల్లో లేదు. వీటిని ఎరువుగా, పశువుల మేతగా లేదా బయోగ్యాస్ తయారీలో వాడే విధానాలపై వారికి అవగాహన కల్పించే ప్రయత్నాలు సమర్థవంతంగా జరగడం లేదు. మానవ శ్రమ ద్వారా పంట అవశేషాలను తొలగించడానికి ఖర్చు అధికం కాబట్టి, తగలబెట్టడం ఒక్కటే, తక్కువ ఖర్చుతో, సులభమైన మార్గంగా కనిపిస్తుంది. అయితే, పంట అవశేషాలను తగలబెట్టినప్పుడు కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హానికర వాయువులు బయటకు వస్తాయి. ఒక హెక్టారు పొలంలో 'స్టబుల్ బర్నింగ్' వల్ల సుమారు 13 టన్నుల వరకు కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి వెళ్తుంది. కాలుష్యాన్ని పెంచుతుంది. ఢిల్లీలో ప్రతి శీతాకాలంలో విపరీతమైన మంచు, తీవ్రమైన వాయు కాలుష్యం వంటి సమస్యలకు 'స్టబుల్ బర్నింగ్' ప్రధాన కారణం. పార్టిక్యులేట్ మీటర్ (పిఎం) 2.5, పిఎం 10 స్థాయి కణాలు గాలి నాణ్యతను దారుణంగా దెబ్బతీస్తాయి. పంట అవశేషాలు మట్టిలో కలిస్తే సేంద్రియ పదార్థాలు పెరుగుతాయి. కానీ దహనం చేస్తే భూసారం తగ్గుతుంది. సూక్ష్మ జీవులు నశించి, మట్టి జీవవైవిధ్యాన్ని కోల్పోతుంది. పంట అవశేషాలు నేలపై ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిలుస్తుంది. దహనం చేస్తే నేల ఎండిపోతుంది. భూగర్భ జలాలు అంతరిస్తాయి. ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె పోటు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. ఎన్నో సమస్యలకు కారణమవుతున్న 'స్టబుల్ బర్నింగ్'ను నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఇది వరకే నిషేధించింది. కానీ, ప్లాస్టిక్ వినియోగం మాదిరిగానే, ఈ నిషేధం కూడా ఆచరణలో విఫలమవుతున్నది. సమస్య మూలాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రయత్నించకుండా, రైతులపై కేసులు పెట్టడం, జరిమానాలు విధించడమే పరిష్కార మార్గం అనుకోవడం ప్రభుత్వాల ఆలోచనా రాహిత్యానికి నిదర్శనం. పలాయన వాదానికి పరాకాష్ట. ఇప్పటికే అనేక రకాలుగా కుంగిపోతూ, కష్టాలకు ఎదురీదుతున్న రైతులను మరింత కుంగదీసే చర్యలు మానుకొని, 'స్టబుల్ బర్నింగ్' సమస్యకు పరిష్కార మార్గాలు అనుసరించడం అత్యవసరం. సుప్రీం కోర్టు నేరుగా జోక్యం చేసుకొని, 'మాండమస్' జారీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించే పరిస్థితులు రావడం ప్రభుత్వాల స్వయంకృతమే. గత్యంతరం లేకనే రైతులు పంట వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారన్నది వాస్తవం. అందుకే, బయోమాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు మద్దతు, ప్రోత్సాహకాలు ప్రకటించాలి. పంట వ్యర్థాలను తొలగించే పరికరాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి. వాటిని రైతులకు ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి. పంట వ్యర్థాల నిర్వహణపై వారికి అవగాహన కల్పించాలి. శిక్షణ ఇప్పించాలి. కేవలం పంట వ్యర్థాల దగ్ధం ఒక్కటే పర్యావరణ కాలుష్యానికి కారణం కాదన్నది నిజం. మితిమీరిన పారిశ్రామికీకరణ పోషిస్తున్న పాత్ర బహిరంగ రహస్యం. తుదిలేని సమస్యగా మిలిగిపోతున్న 'స్టబుల్ బర్నింగ్' పేరుతో రైతులను నిందించడం, కేసులు పెట్టి వేధించడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇది ఒక్కరాత్రిలో పరిష్కారమయ్యే సమస్య కాదు... రైతుల జీవనోపాధి, పర్యావరణ సంరక్షణ, ప్రభుత్వ విధానాల మధ్య సమతౌల్యంలో ఎదురయ్యే సవాలు. సమన్వయంతో కృషి చేస్తే, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని, శుభ్రమైన గాలిని, భవిష్యత్ తరాలకు అందించడం సాధ్యమే.

ప్రజాపక్షం
18-09-2025,గురువారం

# పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థపై
# నేపాల్ నవతరం తిరుగుబాటు



నిత్యా చక్రవర్తి

నేపాల్‌లో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన తిరుగుబాటు ఫలితంగా కె.పి.ఎస్ ఓలీ ప్రభుత్వం పడిపోయింది. ఈ తిరుగుబాటులో పార్లమెంట్ భవనం, సుప్రీంకోర్టు, శక్తిమంతమైన తాజా, మాజీ మంత్రుల అధికార, ప్రైవేటు నివాసాలపై దాడులు చేసి తగలబెట్టారు. ఇది భారతదేశానికి పొరుగున ఉన్న ఈ హిమాలయ దేశంలో పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థ, కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు, వాటి చిహ్నాలపై జెనరేషన్ జెడ్ తరానికి చెందిన యువత సంపూర్ణ తిరుగుబాటుకు వ్యక్తీకరణ.

నేపాల్‌లో యువత జరిపిన తిరుగుబాటు ఆగస్టు 2024లో బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలకు, 2022లో శ్రీలంకలో విద్యార్థులు చేసిన తిరుగుబాటుకు భిన్నంగా ఉంది. నేపాల్‌లో ఇది కేవలం రెండు రోజుల్లోనే ఒక భారీ ఉద్యమ స్వభావాన్ని సంతరించుకుంది. మొదటి రోజునే పోలీసులు 19 మంది ప్రదర్శన కారులను చంపడం ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణం. ప్రస్తుతం మృతుల సంఖ్య 75కి చేరుకుంది. అంతేకాకుండా, విద్యార్థుల కోపం తీవ్రంగా, హింసాత్మకంగా మారి మూడు కమ్యూనిస్ట్ పార్టీలు, నేపాల్ కాంగ్రెస్ సహా పాతుకుపోయిన రాజకీయ పార్టీల కార్యాలయాలను తగలబెట్టారు. నేపాల్‌లో ముఖ్యంగా ఖాట్మండులో, అలాగే మరో రెండు మూడు నగరా ల్లో, స్కూలు విద్యార్థులు, అందులోనూ చాలా మంది ఉన్నత కుటుంబాలకు చెందిన అమ్మాయిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నేపాల్‌లో జరిగిన తిరుగుబాటు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తరం తిరుగుబాటు. వీరు కమ్యూనిస్టులతో సహా ఉన్నత శ్రేణి పాలక వర్గంతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన ఆలోచనా ధోరణిలో ఉన్నారు. నేపాల్‌లోని కమ్యూనిస్ట్ పార్టీలకు బలమైన విద్యార్థి సంఘాలు ఉన్నాయి. కానీ 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై అధికారిక నిషేధానికి వ్యతిరేకంగా జెనరేషన్ జెడ్ తరం తిరుగుబాటు చేయడంతో ఈ సంఘాలు తాజా ఉద్యమంలో పూర్తిగా తటస్థంగా మారిపోయాయి. వాస్తవానికి, ఈ నిషేధమే తిరుగుబాటుకు ప్రధాన కారణం. ఎందుకంటే నేపాల్‌లోని జనరేషన్ జెడ్ తరం పూర్తిగా సోషల్ మీడియా వలయంలో ఉన్నారు. కుటుంబంలో పెద్దలు లేదా ప్రభుత్వం చేసే ఏ జోక్యాన్నీ వారు భరించే స్థితిలో లేరు.

ఉద్యమంలో పాల్గొన్నవారిని చంపేయడంతో తిరుగుబాటు ఒక కొత్త కోణాన్ని తీసుకున్న తరువాతే అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ హత్యలు ఉద్యమాన్ని ప్రభుత్వం, మొత్తం రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా మార్చాయి. అందుకే సెప్టెంబర్ 9న రెండో రోజు చాలా మంది పెద్దవారు కూడా చేరడంతో జనరేషన్ జెడ్ ఉద్యమం జాతీయ ఉద్యమంగా మారింది. నేపాల్ జనాభా 2.96 కోట్లలో, 1.17 కోట్ల మంది 35 ఏళ్ల లోపు వారు. అందులో 15–24 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు 57.6 లక్షల మంది ఉన్నారు. ఈ గ్రూప్ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లతో పెరిగింది. నేపాల్‌లో సెప్టెంబర్ తిరుగుబాటుకు వీరే ప్రధాన చోదకులు.

గత పదేళ్ల నేపాల్ సంక్షుభిత రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే, ఆ దేశం ఆర్థికాభివృద్ధిలో పెద్దగా నష్టపోలేదని తెలుస్తుంది. 2025లో దాని వృద్ధి రేటు 6 శాతం స్థాయిలో ఉంది. ఐదుగురు యువకుల్లో ఒకరికి నిరుద్యోగం ఉన్నప్పటికీ, ఈ సమస్య ఎప్పుడూ పెద్దదిగా మారలేదు. నేపాలీ యువత ఎల్లప్పుడూ బయట ఉద్యోగాల కోసం చూస్తారు. సగటున ప్రతి సంవత్సరం 4 లక్షల మంది నేపాలీలు ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్తారు. అదేవిధంగా, నేపాల్‌కు విదేశాల నుండి భారీగా డబ్బు వస్తుంది. ఇది పర్యాటక రంగం నుండి వచ్చే ఆదాయంతో కలిసి దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది.

ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం, నేపాల్ ఆర్థిక సూచికలు అభివృద్ధి చెందుతున్నాయి. సింగపూర్‌లాగే వాహనాలపై అత్యధిక సుంకాలు వసూలు చేసే దేశం నేపాల్. అలాగే, దక్షిణాసియాలో స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి)కి పన్ను నిష్పత్తి అత్యధికంగా ఉన్న దేశం కూడా ఇదే. సామాజిక సూచికలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయి. 1990లో సగటు జీవిత కాలం 54.77 ఏళ్ల నుండి 2024లో దాదాపు 72 ఏళ్లకు పెరిగింది. ప్రాథమిక పాఠశాలల్లో నమోదు దాదాపు వంద శాతానికి చేరుకుంది. అక్షరాస్యత రేటు 2000లో 59 శాతం నుండి 2024లో 76 శాతానికి పెరిగింది. నేపాల్ జీవన ప్రమాణాల సర్వే 2022/23 ప్రకారం, పేదరికం 2011లో 25.16 శాతం నుండి 2023లో 20.27 శాతానికి తగ్గింది. ఆశ్చర్యకరంగా 81 శాతం మంది నేపాల్ ప్రజలు తమ సొంత ఇళ్లలో నివసిస్తున్నారు. ఐదుగురు నేపాలీ కుటుంబాలలోని నాలుగు కుటుంబాలలో కనీసం ఒకరైనా విదేశాలలో పనిచేస్తున్నారు లేదా నివసిస్తున్నారు. జనాభా 1991, 2021 మధ్య 10 మిలియన్లు పెరిగింది. ఇది మూడు దశాబ్దాలలో 50 శాతం పెరుగుదల.

కానీ, గత పదేళ్లుగా నేపాల్‌ను పరిపాలిస్తున్న పాతుకపోయిన రాజకీయ పార్టీల రాజకీయ నిర్వహణ తీవ్ర విమర్శల పాలైంది. ఈ కాలంలో పాలన కేవలం మూడు, నలుగురు రాజకీయ నాయకులకు, వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే పరిమితమైందని, తద్వారా పెద్ద ఎత్తున అవినీతికి దారితీసిందనే అభిప్రాయాన్ని కలిగించింది. స్కూలు విద్యార్థుల మధ్య 'నెపో కిడ్స్' అనే చర్చ సర్వసాధారణమైంది. స్కూలు విద్యార్థులు చేసిన సెప్టెంబర్ ఉద్యమం, పాలక కుటుంబాల పిల్లలైన 'నెపో కిడ్స్'పై వారి కోపాన్ని వ్యక్తం చేసింది.

కె.పి.శర్మ ఓలీ, పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ', షేర్ బహదూర్ దేవ్‌బా అనే ముగ్గురు ప్రముఖ రాజకీయ నాయకులు అధికారంతో మ్యూజికల్ చెయిర్ ఆట ఆడుతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) (సిపిఎన్ –యుఎంఎల్)కి చెందిన ఓలీ కమ్యూనిస్ట్ పార్టీలను చీలుస్తూ, ఏకం చేస్తూ నాయకత్వంలో కొనసాగగలిగారు. 72 సంవత్సరాల వయసులో ఆయన మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఆయన తన పార్టీలోని ఇద్దరు కీలక ప్రత్యర్థులను పార్టీ చీలికకు, కొత్త పార్టీ ఏర్పాటుకు పురికొల్పి పక్కన పెట్టగలిగారు. తనను వ్యతిరేకించే వారిని బహిష్కరిస్తూనే ఉన్నారు.

దహాల్ 'ప్రచండ' హింసాత్మక తిరుగుబాటుకు నేతృత్వం వహించడం ద్వారా ప్రఖ్యాతి చెందారు. 2008లో రాజ్యాంగ సభలో సిపిఎన్ (మావోయిస్ట్ సెంటర్)కి అత్యధిక సీట్లు గెలవడం ద్వారా ఆయన తొలిసారిగా ప్రధానమంత్రి అయ్యారు. ఆ తర్వాత ఆయన రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. 70 ఏళ్ల దహాల్ అనేక కూటమిలలో భాగమయ్యారు. తన కుటుంబాన్ని వంశ పారంపర్య పద్ధతిలో భాగస్వామ్యం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన తిమ్మినిబమ్మి చేయడంలో దిట్ట. ఏదో ఒక విధంగా ఉన్నత స్థాయిలో కొనసాగేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు.

ఈ ముగ్గురిలో దేవ్‌బా అందరి కంటే పెద్దవారు, ఆయనకు 79 ఏళ్లు. ఆయన ఐదుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. తెలివైన రాజకీయ నాయకుడైన ఆయనకు తన కుటుంబ ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో బాగా తెలుసు. ఆయన నేపాలీ కాంగ్రెస్‌తో విభేదించి తన సొంత ముఠాను ఏర్పాటు చేసుకొని, ఆ తర్వాత పునరేకీకరణ చేసి 2016 నుండి పార్టీని నడిపిస్తున్నారు. ఆయన తన ప్రత్యర్థి రామ్ చంద్ర పౌదేల్‌ను అధ్యక్షుడిగా ఒక వైపు నెట్టేసి, వివిధ కుటుంబ ముఠాలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పి కొయిరాలా కుటుంబానికి దూరంగా ఉన్నారు. ఆయనకు రాజకీయ సూత్రాలు లేవు. అత్యున్నత స్థానం కోసం ఎవరితోనైనా చేతులు కలపగలరు.

నేపాల్‌లో ఇంకా గందరగోళం కొనసాగుతోంది. నేపాల్ ఆర్మీ చీఫ్, ఆ దేశాధ్యక్షుడు ఉద్రిక్తతలను తగ్గించడానికి, విద్యార్థి ఆందోళనకారులతో చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రదర్శనకారులకు స్పష్టమైన కార్యాచరణ లేదు. వారు కేవలం అవినీతికి, రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కార్కి తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. మార్చి 2026లో తాజా సాధారణ ఎన్నికలు జరిగే వరకు ఆమె ఆరు నెలల పాటు ప్రభుత్వాన్ని నడుపుతారు. పార్లమెంట్ రద్దు చేయబడింది. ప్రస్తుత రాజకీయ పార్టీల పరిస్థితి ఎలా ఉంటుందో ఇంకా స్పష్టంగా తెలియదు, కానీ జనరేషన్ జెడ్ ప్రతినిధులు సైన్యాధిపతితో కలిసి కొత్త ప్రధానమంత్రి నేతృత్వంలో తదుపరి ప్రభుత్వం ఎలా పని చేయాలనే దానిపై సూచనలు చేస్తున్నారు.

భారతదేశం విషయానికొస్తే, పరిణామాలను పర్యవేక్షించడానికి, గమనించడానికి ఇది సమయం. నేపాల్‌లో తిరుగుబాటు సమయంలో భారత వ్యతిరేక భావన తక్కువగా ఉంది. పాలక కె.పి.ఎస్.ఓలి ప్రభుత్వంపైన, వివిధ రూపాల్లో చైనాకు దగ్గరగా ఉన్న మావోయిస్టులపైనే వారు ఎక్కువ దృష్టి సారించారు. గత రెండు దశాబ్దాలుగా భారతదేశం నేపాల్‌కు అనేక విధాలుగా సహాయం చేసినప్పటికీ, భారతదేశ అనుకూల భావన కూడా లేదు. ఫిబ్రవరి 2026లో జరిగే తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి బంగ్లాదేశ్ కోటా వ్యతిరేక ప్రదర్శనకారులు తమ సొంత పార్టీ నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి)ని స్థాపించిన తరహాలో నేపాల్ విద్యార్థి నాయకులు ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తారా? లేదా? అనేది తెలిసిన తర్వాత రాజకీయ పరిస్థితి స్పష్టమవుతుంది. ఎన్‌సిపి భారతదేశానికి పచ్చి వ్యతిరేకి. జనరేషన్ జెడ్ విద్యార్థి ఆందోళనకారులు ఎలాంటి కార్యక్రమాన్ని చేపడతారు? భారతదేశంపై వారి వైఖరి ఎలా ఉండబోతుంది? అనే విషయాలను మనం వేచిచూడాలి.

(ఐపిఎ సర్వీస్)


# సార్క్‌లో ఒంటరైన భారత్!

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'నైబర్‌హుడ్ ఫస్ట్' (మొదట పొరుగు దేశాలు) కార్యక్రమం గురించి మాట్లాడుతున్నారు. అయితే, గడిచిన పదకొండేళ్ళ పాలనలో దక్షిణ ఆసియా ప్రాంతీయ సహకార మండలి (సార్క్) సభ్యులైన పొరుగు దేశాల నుండి భారతదేశం చాలావరకు ఒంటరైంది. సార్క్ లో దక్షిణ ఆసియాలోని ఏడు దేశాలు ఉన్నాయి. అవి భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, నేపాల్, మాల్దీవులు. ఈ దేశాలలో భారతదేశానికి ప్రస్తుతం మాల్దీవులు, శ్రీలంకతో మాత్రమే సాధారణ సంబంధాలు ఉన్నాయి. మాల్దీవులతో సంబంధాలు గతంలో క్షీణించినప్పటికీ, ఈ ఏడాది జూలైలో ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటన, ఆరు ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల ద్వైపాక్షిక సంబంధాలు బాగా మెరుగుపడ్డాయి. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో సంబంధాలు కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. పాకిస్తాన్‌తో సంబంధాలు క్షీణించడానికి కారణాలు ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్ విషయంలో తాత్కాలి క అధిపతి డాక్టర్ ముహమ్మద్ యూనుస్ ద్వైపాక్షిక సంబంధాలను చర్చించడానికి మోదీని కలవాలని చేసిన ప్రయత్నాలను మోదీ తిరస్కరించడం తప్పు.

ఆఫ్ఘనిస్తాన్ విషయానికొస్తే, తాలిబాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి కొన్ని సంకేతాలు చేసింది. మహిళలకు సంబంధించిన వారి కఠినమైన చర్యల కారణంగా ఐక్యరాజ్యసమితి ఆఫ్ఘన్ ప్రభుత్వంపై ఆంక్షలు విధించినప్పటికీ, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్థాయిలో చర్చలు ప్రారంభమయ్యాయి. భూటాన్‌తో సంబంధాలు మామూలుగానే ఉన్నాయి. భద్రతా కోణం నుండి భూటాన్ భారతదేశానికి ముఖ్యమైనది. ఇది భారతదేశం, చైనాల మధ్య ఒక బఫర్ దేశంగా పనిచేస్తుంది. ఇటీవల కాలంలో, భూటాన్ చైనా వైపు కొంత మొగ్గు చూపుతోంది, ఇది భారత ప్రభుత్వానికి నచ్చడం లేదు. అయినప్పటికీ, ద్వైపాక్షిక సంబంధాలు నియంత్రణలోనే ఉన్నాయి.

సార్క్ సమూహంలో అగ్రగామి దేశంగా భారతదేశం తన సొంత ప్రయోజనాల కోసం, అలాగే మొత్తం ప్రాంతం ప్రయోజనాల కోసం ఈ సమూహానికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత ఉంది. కానీ 2016లో భారతదేశం పాకిస్తాన్‌లో జరిగిన సార్క్ శిఖరాగ్ర సదస్సును బహిష్కరించింది. నాటి నుండి భారతదేశం దీనిపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా సార్క్ పనిచేయడం లేదు, అప్పటి నుండి దాని వార్షిక సమ్మిట్లు జరగడం లేదు.

సార్క్ సభ్య దేశం కానప్పటికీ చైనా చొరవ తీసుకొని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో సార్క్ పునరుద్ధరణ గురించి మాట్లాడింది. గత సంవత్సరం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి హాజరైనప్పుడు నేపాల్ మాజీ ప్రధానమంత్రి, శ్రీలంక అధ్యక్షుడితో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సార్క్ పునరుద్ధరణ గురించి చర్చించారు. ఈ నెల చివరలో జరగబోయే ఐక్యరాజ్యసమితి సమావేశంలో కూడా పాకిస్తాన్ ప్రధాని ఇతర సభ్య దేశాలతో సార్క్ గురించి చర్చలను ముందుకు తీసుకువెళ్లవచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమావేశానికి హాజరు కావడం లేదు. కాబట్టి షరీఫ్ తన ప్రయత్నాలను కొనసాగించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. నరేంద్ర మోదీకి ముందు ఇతర సార్క్ సభ్య దేశాల నుండి భారతదేశం గౌరవాన్ని పొందింది. ప్రస్తుత మోదీ ప్రభుత్వం దక్షిణ ఆసియా రాజకీయాలలో అర్థవంతమైన పాత్ర పోషించాలనుకుంటే, ఆ గౌరవాన్ని తిరిగి పొందాలి. లేకపోతే అనేక సార్క్ దేశాలతో సరిహద్దులు కలిగిఉన్న చైనా, సార్క్‌లో సభ్యత్వాన్ని కోరి, తన మిత్ర దేశాల సహాయంతో పునరుద్ధరించబడిన సార్క్ నాయకత్వాన్ని చేజిక్కించుకునే అవకాశం లేకపోలేదు.




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)


25వ కాంగ్రెస్

21-25 సెప్టెంబర్, 2025

చండీఘడ్ (పంజాబ్)

# ప్రధాన కార్యదర్శుల జీవిత సంగ్రహం

## ఇంద్రజిత్ గుప్తా



ఇంద్రజిత్ గుప్తా సుప్రసిద్ధ కార్మిక నాయకుడు. 11 సార్లు లోక్‌సభకు ఎన్నికైన ప్రజా నాయకుడు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత. గుప్తా 1919 మార్చి 18న కలకత్తాలో జన్మించారు. 1937లో ఢిల్లీలో సెయింట్ స్టీఫెన్స్ కాలేజి నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. ఉన్నత విద్య కింగ్స్ కాలేజి, కేంబ్రిడ్జిలో అభ్యసించారు. ఇంగ్లండ్‌లో చదువుకుంటున్నప్పుడే కమ్యూనిజం పట్ల ఆకర్షితులైనారు. కేంబ్రిడ్జిలో భారతీయ విద్యార్థులు ఒక బృందంగా ఫాసిస్టు చైతన్యం పెంపొందించుకున్నారు. ఆ బృందంలోని సభ్యులందరూ తర్వాత కాలంలో కమ్యూనిస్టుపార్టీలో ప్రముఖ నాయకులయ్యారు. భూపేష్ గుప్తా, జ్యోతి బసు, నిఖిల్ చక్రవర్తి, రేణూ చక్రవర్తి, మోహనకుమార మంగళం, పార్వతీ కృష్ణన్, అరుణ్‌బోస్, రమేశ్ చంద్ర తదితరులు వారిలో ఉన్నారు.

ఇంద్రజిత్ గుప్తా అర్థశాస్త్రం, చరిత్ర అధ్యయనం చేశారు. 1940లో కేంబ్రిడ్జి యూనివర్శిటీ నుంచి 'ట్రిపోస్' అనే పట్టా పొందారు. అదే సంవత్సరం అక్టోబర్‌లో స్వదేశం తిరిగి వచ్చారు. తదుపరి భారత కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించి కొరియర్‌గా పనిచేశారు. తదుపరి బొంబాయిలో పార్టీ అఖిలభారత కేంద్రంలో పనిచేశారు. ఢిల్లీ, లాహోర్, కలకత్తా, లక్నో తదితర నగరాలకు నిషిద్ధ కమ్యూనిస్టు సాహిత్యాన్ని ట్రంకు పెట్టెలో చేరవేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొరియర్‌గా భవానీ సేన్, సోమనాథ్ లాహిరికి తోడ్పాటు అందించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయటానికి కొంతముందు గుప్తా బెంగాల్ కేంద్రానికి బదిలీ అయ్యారు. అక్కడే ఆయన ట్రేడ్ యూనియన్ జీవితం ఆరంభమైంది. 1951లో ఏఐటియుసి కార్యదర్శిగా ఎన్నికైనారు. 1980 నుంచి 1990 వరకు ఏఐటియుసి ప్రధాన కార్యదర్శిగా,1982 నుంచి 1998 వరకు ప్రపంచ కార్మిక సమాఖ్య ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

1958లో సిపిఐ జాతీయ సమితికి, 1964లో కేంద్ర కార్యవర్గానికి, 1971లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికైన గుప్తా 1988లో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వర రావు అనారోగ్య కారణాలతో 1990లో జాతీయ సమితి సమావేశంలో రాజీనామా చేయటంతో ఇంద్రజిత్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1992లో హైదరాబాద్, 1995లో న్యూఢిల్లీ పార్టీ కాంగ్రెస్‌ల్లో ప్రధాన కార్యదర్శి గా ఆయన తిరిగి ఎన్నికైనారు. 1996లో దేవగౌడ ప్రధానిగా ఏర్పడిన ఐక్య సంఘటన ప్రభుత్వంలో హోంమంత్రిగా, చతురానన్ మిశ్రా వ్యవసాయ మంత్రిగా చేరారు. వీరే కేంద్రంలో తొలి కమ్యూనిస్టు మంత్రులు. గుప్తా మంత్రివర్గంలో చేరాక పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి కార్యదర్శి వర్గంలో కొనసాగారు.

రెండో లోక్‌సభకు తొలిసారి ఎన్నికైన ఇంద్రజిత్ పార్టీ ఆరవ లోక్‌సభలో (1977–79) మినహా 2001 ఫిబ్రవరి 20న కన్నుమూసేవరకు సభ్యుడిగా ఉన్నారు. 1971 నుంచి 1977 వరకు, తిరిగి 1981 నుంచి లోక్‌సభలో సిపిఐ పక్షం నాయకునిగా పనిచేశారు. 1992లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గోవింద వల్లభ్ పంత్ తొలి పురస్కారం అందుకున్నారు. 12, 13వ లోక్‌సభలకు ప్రోటెం స్పీకర్‌గా వ్యవహరించే గౌరవం ఆయనకు దక్కింది.

## ఎ.బి.బర్ధన్



మార్క్సిస్టు మేధావి, మంచి వక్త, కార్మికవర్గం ఇతర కష్టజీవుల జీవితాల మెరుగుదలకు జీవితాన్ని ధారపోసిన ధన్యజీవి ఎ.బి.బర్ధన్. ఇంద్రజిత్ గుప్తా తదుపరి – 1996 నుంచి, 2012 మార్చిలో రిటైర్ అయ్యే వరకు 14 సంవత్సరాలుపైగా భారత కమ్యూనిస్టుపార్టీని బలోపేతం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని లోతుగా అధ్యయనం చేసి అది భారతదేశ సమైక్యత, సమగ్రతకు ప్రమాదకారి అని ఎండగట్టిన వ్యక్తి. రెండవ తరం కమ్యూనిస్టు నాయకుల్లో ఆయన చివరి వ్యక్తి.

బర్ధన్ బెంగాల్ ప్రెసిడెన్సీలోని బరిసాల్ (ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉంది) లో 1924 సెప్టెంబర్ 24న జన్మించారు. నాగపూర్ (మహారాష్ట్ర)కు నివాసం మారిన తదుపరి కమ్యూనిజంవైపు ఆకర్షితులైనారు. 1940లో నాగపూర్ యూనివర్శిటీలో విద్యార్థిగా ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారు. యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైనారు. 1945లో ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. బర్ధన్ అర్థశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందారు. 1957లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. జౌళి, విద్యుచ్ఛక్తి, రైల్వేలు, రక్షణ ఉత్పత్తులు వగైరా పరిశ్రమల్లో ట్రేడ్ యూనియన్‌లు నిర్మించారు.

బర్ధన్ తొలుత సిపిఐ మధ్య భారత్ ప్రొవిన్షియల్ కమిటీకి, పిమ్మట మహారాష్ట్ర రాష్ట్ర సమితికి, 1968లో సిపిఐ జాతీయ సమితికి, 1978లో కేంద్ర కార్యవర్గ కమిటీకి ఎన్నుకోబడ్డారు. 1994లో ఏఐటియుసి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బర్ధన్ 1995 అక్టోబర్ 7–11 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సిపిఐ 16వ కాంగ్రెస్‌లో పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఇంద్రజిత్ గుప్తా 1996లో కేంద్ర హోం మంత్రి బాధ్యతలు స్వీకరించాక బర్ధన్ ప్రధాన కార్యదర్శి అయినారు. తదుపరి చెన్నై(1998), తిరువనంతపురం (2002), చండీఘడ్ (2005), హైదరాబాద్ (2008) పార్టీ కాంగ్రెస్‌ల్లో ప్రధాన కార్యదర్శిగా ఆయన వరుసగా ఎన్నికైనారు. పుదుచ్చేరి పార్టీ కాంగ్రెస్ (2015) ఆమోదించిన ముసాయిదా 'పార్టీ కార్యక్రమం' బర్ధన్ చొరవతో తయారైందే.

2004లో వాజ్‌పేయి, అద్వానీ ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాక కాంగ్రెస్, లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలతో యుపిఎ ప్రభుత్వం ఏర్పాటులో సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్‌తో కలిసి బర్ధన్ కీలక పాత్ర పోషించారు. రాష్ట్రపతి పదవికి ప్రతిభా పాటిల్ పేరును యుపిఎ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రతిపాదించింది బర్ధనే అంటారు.

బర్ధన్ శ్రీమతి పద్మ సరస్వతీ హయ్యర్ సెకండరీ స్కూలు (నాగపూర్) టీచర్. వారికి కుమారుడు అశోక్, కుమార్తె అల్కా బారువా సంతానం. పద్మ 1986లో చనిపోయారు.అప్పటినుంచి బర్ధన్ ఢిల్లీలో పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఒక గదిని తన నివాసం చేసుకున్నారు. ఆయన మరాఠీతోపాటు బెంగాలీ, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషలు సునాయాసంగా మాట్లాడగలరు. 2015 డిసెంబర్‌లో పక్షవాతానికి గురైన బర్ధన్ 2016 జనవరి 2న తన 91వ ఏట ఢిల్లీలో ఆసుపత్రిలో కన్నుమూశారు.

## సురవరం సుధాకరరెడ్డి



విద్యార్థి, యువజన సంఘాలు, ఉద్యమాల నిర్మాణంలో నుంచి ఆవిర్భవించిన మిలిటెంట్ యోధ సురవరం సుధాకరరెడ్డి 2012 నుంచి 2019 వరకు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకు ముందు 2007 నుంచి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

సుధాకరరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో 1942 మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావ్‌పల్లి గ్రామంలో జన్మించారు. తెలంగాణ నవయుగ వైతాళికుడిగా ప్రసిద్ధి పొందిన సురవరం ప్రతాపరెడ్డి వీరికి స్వయాన చిన్నాన్న. కర్నూలులో హైస్కూలు విద్య, కర్నూలులోని ఉస్మానియా కాలేజీలో బి.ఎ, హైదరాబాద్‌లో ఉస్మానియా లా కాలేజీలో ఎల్‌ఎల్ బి చదివారు. కర్నూలులో ఎఐఎస్‌ఎఫ్‌లో క్రియాశీలక పాత్ర పోషించారు. 19ఏళ్లకే ఎఐఎస్‌ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, 1960 నాటికి కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

1962లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 56రోజులపాటు ఏకధాటిగా సాగిన సమ్మెకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. 1966లో ఎఐఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. 1970లో ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడిగా ఎన్నికై కార్యస్థానాన్ని ఢిల్లీకి మార్చారు. 1971లో సిపిఐ జాతీయ సమితి సభ్యుడైనారు. అంతకు ముందు 1969లో "18ఏళ్లకే ఓటు హక్కు" డిమాండ్‌తో పార్లమెంటుకు యువజన – విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. 1972లో ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేబట్టి, సికె.చంద్రప్పన్ ప్రధాన కార్యదర్శిగా, కశ్మీర్ నుంచి కేరళ వరకు జీపు జాతా నిర్వహించారు. వివిధ ఆందోళనల సందర్భంలో ఢిల్లీ, కలకత్తా, పట్నా, లక్నో తదితర నగరాల్లో అరెస్టు అయి జైల్లో గడిపారు.

1992లో రాజమండ్రిలో జరిగిన సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో సహాయ కార్యదర్శిగా ఎన్నికై రెండు పర్యాయాలు 1997 వరకు పనిచేశారు. 1997 నుంచి 2005 వరకు రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలు, చార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమంలో ఆయన నాయకుడిగా రాణింపు పొందారు.

1985, 1989లలో కొల్లాపూర్ నియోజకవర్గం నుండి, 1994లో కర్నూలు నుంచి అసెంబ్లీకి పోటీ చేశారు. 1998లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుండి తొలిసారి పోటీ చేసి ఎన్నికైనారు. అయితే ఆ సభ 1999లోనే రద్దయింది. 2004 ఎన్నికల్లో అదే నల్లగొండ స్థానం నుంచి లోక్‌సభకు తిరిగి ఎన్నికై పూర్తి ఐదు సంవత్సరాలు పనిచేశారు. కార్మికశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఐరాసలో భారత ప్రతినిధిగా ప్రసంగించారు. విద్యార్థి, యువజన నాయకునిగా ఉన్న రోజుల్లో అనేక అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. పలు దేశాలు పర్యటించారు.

2008లో హైదరాబాద్‌లో జరిగిన సిపిఐ 20వ కాంగ్రెస్‌లో పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నుకోబడ్డారు. 2012 (పట్నా), 2015 (పుదుచ్చేరి), 2018 (కొల్లాం, కేరళ)లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లలో ప్రధాన కార్యదర్శిగా వరుసగా ఎన్నికైనారు. ఆరోగ్య కారణాలతో 2019లో ఆ బాధ్యతలు విరమించుకున్నారు.

2025 ఆగస్టు 22న హైదరాబాద్‌లో అసువులు బాశారు.

## డి.రాజా



సిపిఐ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి దొరైస్వామి రాజా కమ్యూనిస్టు నాయకునిగా, రాజ్యసభ సభ్యునిగా జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న వ్యక్తి. తమిళనాడు వెల్లూరు జిల్లాలోని చితత్తూర్ గ్రామంలో 1949 జూన్ 3న జన్మించారు. తల్లిదండ్రులు వ్యవసాయ కార్మికులు. ఆయన కష్టపడి చదువుకున్నారు. గుడియాట్టంలో బి.ఎస్‌సి ఉత్తీర్ణత తదుపరి వెల్లూరులో బి.ఇడి. చదువుకున్నారు. ఏదో టీచరు ఉద్యోగం సంపాదించుకుని కుటుంబాన్ని పోషిస్తాడని తల్లిదండ్రులు అనుకుంటే, ఆయన కాలేజీ రోజుల్లోనే ఎఐఎస్‌ఎఫ్‌లో చేరి క్రమంగా కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితుడై మార్క్సిజం – లెనినిజం అధ్యయనం చేశారు. 1975–80లో తమిళనాడు రాష్ట్ర అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐవైఎఫ్) కార్యదర్శిగా పనిచేశారు. 1980లో ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలో దాని ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, నివాసం ఢిల్లీకి మార్చారు. అదే ఆయన శాశ్వత చిరునామా అయింది. 1994లో సిపిఐ కార్యదర్శివర్గం సభ్యునిగా ఎన్నుకోబడిన రాజా, 2019 జులై 21 జాతీయ సమితి ద్వారా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినారు. 2022 అక్టోబర్‌లో విజయవాడలో జరిగిన పార్టీ 24వ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా రాజా తిరిగి ఎన్నికైనారు.

తమిళనాడు అసెంబ్లీ నుండి 2007 జులైలో తొలిసారి రాజా రాజ్యసభకు ఎన్నికైనారు. 2013లో మరో పర్యాయం ఎన్నికైనారు.

## యథేచ్ఛగా మద్యం అక్రమ రవాణా



**ప్రజాపక్షం/చెన్నూరు :** వేమనపల్లి మండల పరిధిలో అక్రమ మద్యం రవా ణా జోరుగా సాగుతుంది. సమీపంలోని ప్రాణహిత మీదుగా నాటు పడవల్లో వైన్ షాపు నిర్వాహకులు అక్రమార్కులతో చేతులు కలిపి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్క రాష్ట్రంలో మద్యం నిషేధం ఉండడాన్ని ఆసరాగా తీసుకొని సమీపంలోని ప్రాణహిత నది మీదుగా మహారాష్ట్రకు మద్యం తరలిస్తూ పలువురు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నా సంబంధిత అధికారులు మాములుగానే తీసుకుంటుందనీ వేమనపల్లి వైన్ షాపు నుండి రాత్రింబవళ్లు తేడా లేకుండా మద్యం సరఫరా సాఫీ గా సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రావస్థను వీడి అక్రమ దందాకు అడ్డుకట్ట వేసి, మద్యాన్ని హద్దులు దాటిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు

**ప్రజాపక్షం/అదిలాబాద్ :** మావల మండలంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని 170వ కాలనీలో 77వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ అదిలాబాద్ రూరల్ మండల కార్యదర్శి మహబూబ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి, ప్రజలకు తమ హక్కులు లభించడానికి సిపిఐ మహానాయకుల త్యాగాలు,



పోరాటాలే కారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ 170వ శాఖ కార్యదర్శి కామ్ దాస్, సిపిఐ నాయకులు సురేష్ వల్లాద్ కాలనీ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నిజాంసాగర్‌లో 12 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ ప్రాజెక్టు 12 వరద గేట్ల ద్వారా 83056 క్యూసెక్కుల నీటిని మాంజీరాలోకి వదిలిపెడుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు బుధవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఏఇఇ అక్షయ్‌కుమార్, సాకేటేలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి 57268 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండడంతో నీటి విడుదలకు 12 వరద గేట్లను ఎత్తివేసి పెద్ద మొత్తంలో నీటిని వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1404.52 అడుగులు, 17.010 టీఎంసీల నీరు నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## సింగరేణి వార్షిక క్రీడల్లో బాల్ బాడ్మింటన్ పోటీలు



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 61వ వార్షిక క్రీడల్లో భాగంగా బాల్ బాడ్మింటన్ పోటీలు సోమవారం స్థానిక సింగరేణి గ్రౌండ్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడబ్ల్యూస్ ఎస్ఇ హరికృష్ణ , ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సింగరేణి సిఅండ్ ఎండి బలరాం ఆదేశాల మేరకు ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల వలన ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందుతోందని, ప్రతిభావంతులు కోల్ ఇండియా స్థాయిలో రాణించి సంస్థకు పేరు ప్రతిష్టలు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సీనియర్ క్రీడాకారులు యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన పోటీల్లో కాసిపేట్ 2 గ్రూప్ విజేతగా నిలవగా, కేకే గ్రూప్ రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఒ ఎం.కార్తీక్, క్రీడల గౌరవ కార్యదర్శి శివకృష్ణ, డబ్ల్యూపిఎస్ అండ్ జిఎ కో ఆర్డినేటర్, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

## హామీలు వెంటనే అమలు చేయాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** సివిల్ సప్లై హమాలీలకు పెంచిన ఇన్సెంటివ్, స్వీటుబాక్స్, దుస్తుల కుట్టుకూలి వంటి వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి మండల స్థాయి సమన్వయకర్త తిరుపతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు టి.దివాకర్ మాట్లాడుతూ హమాలీలు ఎనిమిది రోజుల పాటు సమ్మె చేసిన సమ్మె తర్వాత ఒప్పందం ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి హమాలీ రేట్లు పెంచి బకాయిలతో చెల్లించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారు. జిఒఎంఎస్ నెం.01, సివిల్ సప్లైస్ (సిఎస్ 1సివిల్ డిపార్ట్మెంట్) ప్రకారం హమాలీలకు, స్వీపర్లకు స్వీటుబాక్స్‌కు రూ. 900లు, రెండు జతల యూనిఫారాల కుట్టుకూలికి రూ.1600లు, మహిళా స్వీపర్లకు రెండు జతల కుట్టుకూలికి రూ. 200లు చెల్లించాలని చెప్పారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ. 30 వేలు, స్త్రీ, పురుష కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గతేడాది ఒప్పందం ప్రకారం అదనంగా రూ. 1000 కలిపి చెల్లించాల్సి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుట్టపల్లి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అద ద్యు, శంకర్, ఓమాజి, మోహన్, కుర్సింగ గుజారి రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ నీటి బొట్టు పొదుపు చేయాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** భూగర్భ జల వనరుల అభివృద్ధికి ప్రతీ వర్షపు నీటి బొట్టును పొదుపు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో పలు శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి చెరువులు, కాలువలు, బావులు, బోరుబావుల ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ, భూగర్భ జలాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలో ఇంకుడు గుంతలు నిర్మించి నీటిని భూగర్భంలోకి చేరవేయాలని సూచించారు. నీటి పొదుపు కోసం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ జల వనరుల అధికారి సుహాసిని, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, నీటిపారుదల శాఖ అధికారి గుణవంత రావు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

### మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఒప్పంద ప్రాతిపదికన ఇటీవల నియమితులైన 13 మంది వైద్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు కొత్త నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. వైద్యులు విధులలో సమయపాలన పాటిస్తూ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రజల పట్ల సహనంతో వ్యవహరించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది

### ప్రజల సుఖ సంతోషాల కోసం ప్రజాపాలన : మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మెదక్ :** ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది చరిత్ర సృష్టించిదని , ఎందరో మహానుభావుల త్యాగ పలితమే తెలంగాణ అని, తెలంగాణలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందని మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ లో ఘనంగా జరిగాయి. వేడుకలకు జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుండి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు.మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పి డి.వి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, ఆర్డివో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఇతర జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి వివేక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవము జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు స్వాతంత్ర్య సమరయోధులు అందరికీ నాజోహార్లు అర్పిస్తున్నామన్నారు.సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు అన్నారు. తెలంగాణ ప్రాంతం భారతీ యూనియన్ చేరి ప్రజా పాలన మొదలై నేటికి 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని 78వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మొదటిసారి అసువులు బాసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైనది. ఆనాటి పోరాటంలో తెలంగాణ మహిళలైన చాకలి ఐలమ్మ , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి కీలక పాత్ర పోషించారు. నల్లగొండ జిల్లా నుంచి బండి యాదగిరి రాసిన బండెనకబండి కట్టి పదహారు బండ్లు కట్టి, ఏ బండ్లో పోతావు కొడుకో.. నైజాం సర్కారోడో పాట సాయుధ పోరాటాన్ని ఉధృతం చేసి రాచరిక ప్రభుత్వం పై తిరుగు బాటు చేయడానికి ప్రజల్లో చైతన్యం రగిలించిందన్నారు. ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలుచేయడం ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పథకాలు అమలు చేస్తున్నాం. మెదక్ జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మహిళా మరియు శిశు సంక్షేమం, రోడ్లు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీలు, మునిసిపాలిటులు, వాటర్ సప్లై, వెటర్నరీ ఇతర అన్ని శాఖలలో విప్లవాత్మకమైన అభివృద్ధి సాదించడం గర్వకారణంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాలు నిరోధించడంలో, రహదారుల ప్రమాదాల నివారణలో, మత్తు పదార్థాల మరియు సైబర్ నేరాల నియంత్రణ కొరకు కృషి చేస్తున్న పోలీస్ యంత్రాంగానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి విజయవంతం చేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ‘బాంచన్ దొర’ అన్నవారితో బందూకులు పట్టించిన ఘనత సిపిఐది

### జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నాటి హైదరాబాద్ సంస్థానంలో భూస్వాములు రజాకారుల అండతో పేదల భూములను ఆక్రమించుకొని వారి భూముల్లోనే వారిని కూలీలుగా మార్చి దౌర్జన్యాలు చేసే పరిస్థితిలో భూస్వాములకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలను ఐక్యం చేసి బాంచన్ దొర నీ కాళ్లు మొక్కుతా అన్న ప్రజలతోనే బందూకులు పట్టించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య అన్నారు. బుదవారం జిల్లా సిపిఐ కార్యాలయ ఆవరణలో తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ ప్రత్యేక సంస్తానంగా ఉంది. ఈ ప్రాంతంలో భూస్వాములు, రజాకారులు లక్షల ఎకరాల పేదల భూములను ఆక్రమించుకొని వారి భూముల్లోనే వారిని కూలీలుగా మార్చారన్నారు. మూడు వేల గ్రామాల్లో దొరలు రజాకారుల వద్ద ఉన్న పది లక్షల ఎకరాల భూముల్ని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పేదలకు పంచినట్టు చెప్పారు. ఆ పోరాటంలో నాలుగున్నరవేల మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రాణాలు కోల్పోయారన్నారు. చారిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వంటి పార్టీలు వక్రీకరించి హిందూ, ముస్లిం పోరాటంగా వక్రీకరించి రాజకీయ లబ్ది పొందాలని చూడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పోరాట నాయకుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పోరాట నాయకుల పేర్లతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు ముత్యాలు, ఫెరోస్, బానుచందర్, గోవర్ధన్, ఇమ్రాన్ అలీ, పరశురాం, రమేష్, కవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కోసం ‘స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్’



**ప్రజాపక్షం/నర్సాపూర్ జి :** నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ‘‘స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్’’ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ,మహిళల ఆరోగ్యం,పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం,దేశం ఆరోగ్యంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని,ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే,రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి.డా.రాజేందర్,సూపరింటెండెంట్ గోపాల్ సింగ్,డా.ప్రమోద్ చంద్రరెడ్డి,సురేష్,ఇతర వైద్యాధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## కుట్రపూరితంగానే లాభాల వాటా ప్రకటించలేదు

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటాను యాజమాన్యం కుట్రపూరితంగా ప్రకటించలేదని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. బుధవారం ఆర్కే 5, ఎసిపి ఆర్కే న్యూటెక్ గనుల వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 24న బోర్డు సమావేశం జరిగినప్పటికి ఇప్పటి వరకు లాభాలు ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సెప్టెంబర్ 12న గుర్తింపు సంఘం స్ట్రక్చర్ సమావేశంలో కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని, గత సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్లు జారీ చేయాలని తాము డిమాండ్ చేశామన్నారు. అయితే యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకుపోయిందని ఆయన విమర్శించారు. ఈ నెల 19న జిఎం కార్యాలయాల వద్ద జరగబోయే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. యాజమాన్యం తక్షణమే లాభాలు ప్రకటించి డిమాండ్లను అమలు చేయాలని, లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా సాయుధ వార్షికోత్సవాలు

**రామకృష్ణాపూర్ :** సాయుధ పోరాటంలో వేల గ్రామాలు విముక్తి పొంది, పేదలకు భూములు పంపిణీ అయ్యాయని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధ వా రం రామకృష్ణాపూర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో వాసిరెడ్డి సీతారామయ్య, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజీవ్ చౌక్ ఆర్కే 1 స్తూపం, రామాలయం, సూపర్ బజార్, రైల్వే స్టేషన్‌లలో కూడా జెండాలను ఎగురవేశారు. సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలు అర్పించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి గోపి, మదాసు శంకర్, కరుకూరి రాయలింగు, మండల శ్రీనివాస్, మారెపల్లి రవి, కుక్క దేవానంద్, మత్తుల మొగిలి , కొడగాని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

### త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుక సందర్భంగా చిన్నారుల ససాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. సిద్ధార్థ కళాక్షేత్ర, నవీపేట, కంజర సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలికలు, బోర్గాం (పి) ఉన్నత పాఠశాల, డిచ్‌పల్లి మానవతా సదన్ చిన్నారులు చూడ చక్కని నృత్యాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు చూరగొన్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, కేశ వేణు, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, డిసిసిబి చైర్మన్ రమేష్‌రెడ్డి, రాజిరెడ్డి, గంగారెడ్డి, కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఆర్‌డిఒ రాజేంద్రకుమార దిలీప్‌కుమార్, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.


### జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్పీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి హోదాలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్‌పి సిఇఒ సాయగౌడ్, డిప్యూటీ సిఇఒ సాయన్న సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంతో మంది త్యాగధనుల ఫలితమే నేటి ప్రజాపాలన దినోత్సవం

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఎంతో మంది త్యాగధనుల ఫలితమే నేటి ప్రజాపాలన దినోత్సవం మని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్లో ప్రజాపాలన దినోత్సవంకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాను అన్ని రంగాలలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిల్పడానికి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి జిల్లా ప్రగతిని చదివి వినిపించారు. జిల్లా ప్రజలకు మంత్రి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంతో మంది త్యాగధనుల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ రాష్ట్రం (హైదరాబాద్‌స్టేట్ ఏర్పడిందన్నారు.) తెలంగాణలో ముఖ్యమంత్రి రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అన్నా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానికి చేరువగా ఉన్న సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలోని అగ్రగామిగా అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఎస్పీ పరితోష్‌పంకజ్, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజరాణి, సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.




## ఆధార్ సేవలు పునః ప్రారంభించాలి




**ప్రజాపక్షం/నేరడిగొండ :** గత కొన్ని నెలలుగా మూతపడి ఉన్న ఆధార్ సెంటర్ ను పునః ప్రారంభించాలని నేరడిగొండ మండల యువకులు బుధవారం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిచేసుకోవాలన్న,కార్డు అప్డేట్ చేసుకోవాలన్న, కొత్తగా పెళ్లైన వారి ఆధార్ కార్డు బదిలీ చేసుకోవాలన్న ఆధార్ సెంటర్ కు వెళ్ళాలి.కానీ గత కొన్ని నెలలుగా ఆధార్ సెంటర్ మూతపడి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ సెంటర్ మూతపడి ఉండడంతో ప్రజలు తీవ్రఇ బ్బందులు ఎదుర్కొంపటన్నారు. ఆధార్ కార్డులో ఏమైనా వివరా లు నమోదు చేసుకోవలన్నా ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ఇచ్చోడ ఆధార్ సెంటర ఇటీవల తిరిగి ప్రా రంభమైనా నేరడిగొండ ఆధార్ సెంటర్ ఇంకా ప్రారంభం కాకపోవడంతో తహశీల్దార్‌ని ఆశ్రయించడం జరిగిందన్నారు. అలా గే మండల జనాభా ప్రాతిపదికన ప్రజల సౌలభ్యం కోసం మరో ఆధార్ సెంటర్, మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో సాబ్లే సంతోష్ సింగ్,రాథోడ్ రాజశేఖర్, ఏలేటి మనోజ్ రెడ్డి,బొంతుకుల శ్రీను,కుంచపు గోవింద్,బాక్రే ప్రశాంత్, సురేష్,తగిరే చందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వరదల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

### ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య..

**ప్రజాపక్షం/నిర్మల్ :** ఇటీవలి భారీ వర్షాలు,వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్పష్టం చేశారు.బుధవారం సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో తెగిపోయిన పెద్ద చెరువు కట్టను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించిన ఆయన,రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.వాగు ప్రవాహాలను దాటి చెరువు గట్టుకు చేరుకున్న చైర్మన్,కలెక్టర్ పంట నష్టంపై పరిశీలన జరిపారు.రైతుల బాధలు విన్న అనంతరం చైర్మన్ మాట్లాడుతూ,ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,పంట నష్టానికి సంబంధించిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు.అదేవిధంగా వరద ప్రవాహానికి దెబ్బతిన్న రహదారులను కూడా మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు.రైతులు నష్టపోయిన సుమారు 300 ఎకరాల పంటకు సంబంధించిన నివేదికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,చెరువుగట్టుకు మరమ్మత్తులు తక్షణమే చేపడతామని తెలిపారు. రహదారి పునరుద్ధరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నా రు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,వీలైనంత త్వరగా పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు,మాజీ జెడ్పిటిసి ఫోరం అధ్యక్షుడు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి,మొయినుద్దీన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రూ.50 కోట్లతో డబుల్‌రోడ్డు మంజూరు

**ప్రజాపక్షం/చొప్పదండి:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకుని చొప్పదండి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించడంతో పండగ వాతావరణం నెలకొందన్నారు. మండలంలోని ఆర్నకొండ గ్రామం నుంచి మల్యాల క్రాస్ రోడ్డు వరకు రూ.50 కోట్లు డబుల్‌రోడ్డు మంజూరు చేయడం జరిగిందని, అందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి చేతిరాతలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొందిన చొప్పదండి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని చెట్టుపల్లి సింధును ప్రత్యేకంగా అభినందించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చందు, మహేష్, వైస్ చైర్మన్, గంగయ్య గౌడ్, రాజేందర్‌రెడ్డి, చందు, రమేస్, కడారి శంకర్, స్వరూప, వెంకటేష్, రాజశేఖర్, అఖిల్, శేఖర్, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులున్నారు.

## 'పోషణ మాసం' పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** మహిళల ఆరోగ్యం బలోపేతం అయితేనే కుటుంబాలు శక్తివంతంగా ఉంటాయని ఎంఎల్‌ఏ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేకంగా చేపట్టిన స్వస్త నారి ససక్త పరివార్ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొని పోషణమాసం పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.ప్రమోద్, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి డా.నరేష్, డిప్యూటీ వైద్యాధికారి డా.శ్రీనివాస్, డా.ఆకుల శ్రీనివాస్, సూపరిండెంట్ కృష్ణమూర్తి, ఆర్ఎంవో సుమన్, గీతి, ఏవో శ్రీనివాస్, టీఎం సి రజిత, వైద్యులు , వైద్య సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ త్యాగధనులను అందరూ గుర్తించాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** తెలంగాణ సాధన కొరకు సకల జనులు పోరాడారని.. వారి త్యాగాలను అందరం గుర్తించాలని.. ..తెలంగాణ ఉద్యమంలో నీళ్లు,నిధులు. నియామకాలు.ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారి ఆశయాలను ముందుకు తీసుకపోతుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. 2023 డిసెంబర్ 7న మీ అందరి ఆశీర్వాదంతో ప్రజాపాలన ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించినట్లు. ఇ ప్పటివరకు 200 కోట్లు ప్రయాణాలు దాటాయన్నారు. ఆరోగ్య శ్రీ 5 నుండి 10లక్షలు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. బుధవారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవానికి రాష్ట్ర రవాణ,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కోటిమహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా మహిళ సంఘాల ద్వారా సున్నా వడ్డీ ద్వారా మహిళ పథకాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. పదేండ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులు అందించి, ప్రతి పౌరునికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 9రోజుల్లో 9వేల కోట్ల రైతుభరోసా. 23 వేల కోట్ల రూపాయల రైతురుణమాఫీ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ ప్రక్షాళన చేసి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. చరిత్రలో నిలిచే విధంగా పెండింగ్‌లో ఉన్న అమరుల స్థూపాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు.తెలంగాణ కవులు,కళాకారులను గౌరవించుకున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి మొక్కను నాటి తెలంగాణలో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలిపినందుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ,తెలంగాణ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ హైమావతి. పోలీస్ కమిషనర్ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి. అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్. ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం రైతన్నకు ఆపన్న హస్తం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** నాణ్యమైన విత్తనం రైతులకు ఆపన్నహస్తం అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అన్నారు. కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామంలో బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులకు, పరిశోధనా కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాన్ని సరఫరా చేసి విత్తనోత్పత్తిని గ్రామంలోనే ప్రోత్సహించేందుకు గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వరి జేజిఎల్ 24423 క్షేత్రాలను పరిశీలించి బెరుకులు తీసివేయాలని సూచించారు. పైరిలో కొద్దిగా ఆకుముడతను గమనించి నివారణ కోసం కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త డా.బి.రాం ప్రసాద్, శాస్త్రవేత్తలు డా.జి.ఉషారాణి, ఇ.ఉమారాణి, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేంద్ర ప్రసాద్, రైతులు ఆకుల శంకరయ్య, గిర్ర శ్రీనివాస్, గ్రామానికి చెందిన ఇతర రైతులు పాల్గొన్నారు.

## జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కరీంనగర్ పోలీసు కమిషనర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పోలీసు కమిషనరేట్ కేంద్రంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంధర్బంగా కమిషనరేట్ కేంద్రంలో గల క్వార్టర్స్ గార్డ్ వద్ద పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కమీషనరేట్ పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భీంరావు, ఏసిపి శ్రీనివాస్ రావు, శ్రీనివాస్‌జి, వెంకటస్వామి, విజయ్‌కుమార్, వేణుగోపాల్, యాదగిరిస్వామి, కమిషనరేట్ ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలతో పాటు వివిధ విభాగాలకు చెందిన సూపరిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కార్మికులపై అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేత

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం గర్షకుర్తిలో గత నాలుగు రోజుల క్రితం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పవర్‌లూమ్స్‌పై దాడులు చేశారు. పవర్‌లూమ్స్‌ను సీజ్ చేసి కలర్ బట్టలు నేస్తున్నారనే నెపంతో చేనేత కార్మికులపై కేసులు నమోదు చేశారు. బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గర్షకుర్తి గ్రామానికి వెళ్లి చేనేత కార్మికులతో మాట్లాడారు. అధికారులు అక్రమంగా తమపై కేసులు నమోదు చేశారని కార్మికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌కు ఫోన్‌లో మాట్లాడారు. చేనేత కార్మికుపై అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సీజ్ చేసిన పవర్‌లూమ్స్ తిరిగి పునరుద్దరించాలని కోరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో చేనేత కార్మికులపై పెట్టిన కేసులను విజిలెన్స్ అధికారులు ఎత్తివేశారు. అంతేకాకుండా సీజ్ చేసిన పవర్‌లూమ్స్‌ను తిరిగి పునరుద్దరించారు. గంటల వ్యవధిలోనే తమపై పెట్టిన కేసులను ఎత్తివేయించడంతో పాటు పవర్‌లూమ్స్ తిరిగి పునరుద్దరింపజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గర్షకుర్తి గ్రామ చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్





**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి లక్ష్మ ణ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న నిజాం చెర నుండి తెలంగాణ అఖండ భారత్ లో విలీనమైన రోజని... ఇంతటి మహోత్తరమైన రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తుందని తెలిపారు. తెలంగాణ భౌగోళిక స్వరూపం మాత్రమే కాదని... ఇదోక అస్థిత్వ పోరాటానికి ప్రతీక అని, అనాదిగా అణగదొక్కబడిన తెలంగాణ ప్రాంతంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం దశాబ్దాలుగా పోరాటాలు కొనసాగాయన్నారు. నాటి ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి నేటి మిలియన్ మార్చ్ వరకు ఉవ్వేత్తున ఎగిసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. ఈ ప్రాంతంలో జన్మించి ఈ ప్రాంత అస్థిత్వం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పరితపించిన మహనీయులను మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం జిల్లాలో అమలు చేస్తున్న పథకాల గురించి మంత్రి వివరించారు. 2023 డిసెంబర్ 9న ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. ఇప్పటి వరకు 5 కోట్ల 35 లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారని, తద్వారా 227 కోట్ల 34 లక్షల రూపాయల లబ్ది పొందారని తెలిపారు. ఒక లక్షా 57 వేల 120 మంది అబ్దిదారులకు ఇప్పటి వరకు 6 లక్షల 33 వేల737 గ్యాస్ సిలిండర్ లను 500 రూపాయలకే సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందుకు గాను ప్రభుత్వం 19 కోట్ల 59 లక్షల రూపాయల సబ్సిడిని రాష్ట్ర ప్రభుత్వం భరించిందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులందరికి జీరో బిల్లులు జారీ చేసిందని తద్వారా జిల్లాలో ఒక లక్షా 58 వేల 875 సర్వీసులకు గాను 6 కోట్ల 94 లక్షల 24 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా పథకం ద్వారా వానా కాలం సీజన్ ప్రారంభంలోనే ఒక లక్షా 90 వేల 186 మంది రైతులకు 206 కోట్ల 62 లక్షల 96 వేల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 2లక్షల వరకు రైతులకు రుణమాఫీ పథకం ద్వారా జిల్లాలో 79 వేల 541 మంది రైతులకు 622 కోట్ల 6 లక్షల రూపాయలను రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతు బీమా ద్వారా వివిధ కారణాలతో జిల్లలో మరణించిన రైతు కుటుంబాలకు 25 కోట్ల 50 లక్షల బీమా సొమ్మును అందజేసి అర్థిక చేయూతనందించినట్లు తెలిపారు.ఇందిరా మహిళా శక్తి ద్వారా 517 వ్యక్తిగత యూనిట్లకు 10 కోట్ల 16 లక్షలరూపాయలు, గ్రూపు యూనిట్లకు 7 కోట్ల 36 లక్షల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిసనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా గ్రథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** మహిళ ఆరోగ్యంగా ఉంటేనే తన కుటుంబం, తద్వారా దేశం అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్, 8వ జాతీయ పోషణమాసం కార్యక్రమాలను దేశంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కరీంనగర్ ప్రభుత్వ జనరల ఆసుపత్రిలోనూ ఈ వర్చువల్ ప్రారంభోత్సవం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా బుధవారం నుంచి వచ్చేనెల రెండు వరకు అన్ని జనరల్ ఆసుపత్రుల్లో క్యాంపులు నిర్వహించి మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళ తన ఆరోగ్యం పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 13 సంవత్సరాలు దాటిన బాలికలు మొదలుకొని మహిళలందరికీ 50 రకాల రూ.50 వేల ఖరీదు చేసే ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ జిల్లాలో 85 శాతం మందికి పరీక్షలు పూర్తయ్యాయని అన్నారు. ఈ పరీక్షల ద్వారా క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులను ముందే గుర్తించి నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిజిహెచ్ సూపరిండెంట్ వీరారెడ్డి తదితరులున్నారు.

## విశ్వకర్మ జయంతి మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** విశ్వకర్మ జయంతిని పునస్కరించుకొని వేములవాడ పట్టణం భగవంతు రావు నగర్‌లో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విశ్వకర్మ జయంతి మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.. సందర్భంగా విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్పెషల్ డేవలెప్మెంట్ ఫండ్ నుండి మంజూరు అయిన 6 లక్షల ప్రొసీడింగ్ కాపీ ని సంఘ సభ్యులకు అందజేశారు.

## ఆరోగ్యం పట్ల మహిళలు జాగ్రత్త వహించాలి

కలెక్టర్ కె. హైమవతి



**ప్రజాపక్షం/హుస్నాబాద్** ప్రతి మహిళ తమ అరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటు ప్రభుత్వం అందిస్తున్న వైద్యపరిక్షలను చేయించుకుని తమ అరోగ్యం కాడుతోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కె హైమవతి, అడిషనల్ కలెక్టట్ గరిమాఅగ్వాల్‌తో కలిసి హుస్నాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో కలిసి వైద్య శిబిరం ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో మాత శిశుసంక్షరక్షణ కేంద్రంలో స్వస్ట్ వారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమను ప్రారంబించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఈ నెల 17వ తేది నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని అన్ని అరోగ్య కేంద్రాల్లో బస్తిదావా ఖానల్లో ఎ ఎ ఎం లు వైద్య సిబ్బంది మహిళలకు మెడికల్ పరీక్షలు నిర్వహించాలని కొరారు. ఈ శిబిరంలో బ్లడ్‌డోనేషన్ క్యాంపులను నిర్వహించడం , ప్రతి రోజు వైద్య పరిక్షలను ఏలాంటి సెలవులు లేకుండ నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్యాధికారులచే పరీక్షలు నిర్వహించి 14 రకాల అరోగ్యసేవలను అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన దైనందిత కార్యక్రమంల్లో పడి తమ అరోగ్యంను మరిచిపోతున్నరని వారికి చిన్నపాటి అనారోగ్యం ఏర్పడిన అసుపత్రికి వెల్లినప్పుడు వారి అరోగ్య సమస్యలు తెలుస్తున్నయని అన్నారు. గతంలో ప్రతి ఒక్కరు పనిచేస్తే ఏలాంటి రోగాలు రాకుండ ఉండేవని నేడు అందుకు భిన్నంగా పని చేయకుండ ఉన్నందున అనేక అరోగ్య సమస్యలు వస్తున్నయని తెలిపారు. రోగాల నుండి కాపాడుకోవాలంటే ముఖ్యంగా అకు కూరలు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డిసి ఎహ్ ఓ అన్నపూర్ణ, ప్రోగ్రాం అధికారి అనంద్, సూపరెండెంట్ రమేశరెడ్డి, తో పాటు వైద్యులు పాల్గోన్నారు.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే హాజరయ్యారు. ప్రభుత్వ విప్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 77 సంవత్సరాలు పూర్తి చేసుకుని 78వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో 60 ఏండ్ల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తుందని, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచి అమలు చేయడం ప్రారంభించిందన్నారు. 2047 నాటికి దేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న ప్రజా ప్రభుత్వంది అన్నారు. ఈ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047'. 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ – 2047 ఉంటుందనీ ఇది కేవలం ప్రణాళిక కాదు, ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం గర్షకుర్తిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసిన పవర్‌లూమ్స్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. అధికారులు కేసులు నమోదు చేసిన కార్మికులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే చెన్నై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను గర్షకుర్తికి అనమతించవద్దని కోరారు. విజిలెన్స్ అధికారులు కార్మికులపై నమోదు చేసిన కేసులను రద్దు చేయించి, సీజ్ చేసిన పవర్‌లూమ్స్‌ను తిరిగి తెరిపిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. చేనేత కార్మికులను ఇబ్బంది పెట్టేలా అధికారులు ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడివో రామ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, రామిడి శ్రీనివాస్ రెడ్డి, చిప్ప చక్రపాణి, తిరుపతి, శ్రీనివాస్, వేముల అంజి, రాజేశం, మల్లిఖార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గరిగంటి కరుణాకర్, మల్లేశం, ముచ్చ శంకర్, చందు, మధు, శ్రీధర్, ముద్దం నగేష్, అంజి, ప్రవీణ్ తదితరులున్నారు.

### మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు

# స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్

ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు. స్వస్త్ నారీ ,సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్త్ నారీ , సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు బాగుండాలంటే మన ఇంటిలోనే మహిళలు వారి ఆరోగ్యం బాగుండాలని అన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకుంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలని అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య క్యాంపులో హెల్త్ చెక్ అప్ చేసుకొవాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన మహిళలకు సంబంధిత చికిత్సను కూడా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రతినెల దాదాపు 200 పైగా ప్రసవాలు విజయవంతంగా జరుగుతున్నాయని, ఈ సేవలో కూడా వినియోగించుకోవాలని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి, అంబులెన్స్ సేవలు అందించేందుకు అవసరమైన సోమ్ము ఎంపీ నిధుల నుంచి అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నేడు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు. మన కుటుంబంలో ఉన్న మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది అనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులు మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల పట్ల ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సి లలో స్పెషాలిటీ డాక్టర్లను ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి ప్రాణదానం చేయటం హర్షణీయం

మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సత్యసాయి ట్రస్టు చేసే గొప్పకార్యక్రమంలో ఉడుత భక్తిగా తాను చిన్న ప్రయత్నం చేసానని..ఈ ఆసుపత్రికి వచ్చి పిల్లలతో, తల్లి దండ్రులతో మాట్లాడటం ఏంతో సంతోషాన్ని ఇచ్చిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. తల్లిదండ్రుల కళ్లలో మెరుపులు చూస్తుంటే ఏంత ఆనందంగా ఉందో చెప్పలేమన్నారు. సత్యసాయి ఆసుపత్రిలో మందులేకాకుండ దేవుని ఆశీర్వాదం, ప్రేమ దొరుకుతుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక సత్యసాయి సంజీవని చైల్డ్ హర్ట్ కేర్ సెంటర్‌లో 196 చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్ చేసిన సందర్భంగా గిఫ్ట్ ఏ లైఫ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైప్ ఈజ్ షార్ట్.. దిస్ హస్పిటర్ ఈజ్ ఫరేవర్ అన్నారు. ఇక్కడకు వచ్చే పెషెంట్లను తమ పిల్లలుగా భావించి సేవలు అందించటం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించి సేవ చేస్తుండటంతో అదే సగం రోగాన్ని తగ్గిస్తుందన్నారు. ఒక్క రూపాయి తీసుకోకుండ ఉచితంగా ఆపరేషన్ చేసి కడుపునిండ అన్నం పెట్టి ,బస్సు కిరాయి పెట్టి పంపించారన్నారు. తన రెండు దశాబ్దాల ప్రజాజీవితంలో కొన్ని పనులు అత్యంత సంతృప్తినిచ్చాయని, ఆనందం కలిగించాయన్నారు. ఆందులో ఒకటి సత్యసాయి హర్ట్ ఇన్సిట్యూట్ నెలకొల్పడం అన్నారు. కాళేశ్వరం ద్వారా నీళ్లను పంట పోలాలను పారించి రైతుల కళ్లలో ఆనందం చూసినట్లు తెలిపారు. సత్య సాయి ట్రస్టు ఆసుపత్రిని నిర్మించి వందలమంది పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేసే గొప్ప కార్యక్రమం చేయటం గొప విషయమన్నారు. ఈప్రాంత నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలకు మనం ఎప్పుడు సత్యసాయి ట్రస్టుకు,శ్రీనివాస్‌కు రుణపడి ఉండాలన్నారు. ఈసేవల నుండి మనం కొంత ప్రేరణ పొందాలన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వామలై, ఏంతో పిల్లల ప్రాణాలను కాపాడిన డాక్టర్లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.



# క్రీడ

## ఆసీస్‌పై భారత్ మహిళా జట్టు ఘన విజయం

### చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన








ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలోనే ఆస్ట్రేలియాపై అత్యంత వేగంగా శతకం బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మంధాన 77 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకుంది. పురుషుల క్రికెట్‌లో ఈ రికార్డ్ విరాట్ కోహ్లీ పేరిట ఉంది. అతను ఆస్ట్రేలియాపై వన్డేల్లో 52 బంతుల్లోనే శతకం సాధించాడు. ఈ మ్యాచ్‌లో మంధాన 91 బంతులాడి 14 ఫోర్లు, 4 సిక్స్‌లతో 117 పరుగులు చేసి వెనుదిరిగింది. తద్వారా పలు రికార్డ్‌లను తన పేరిట లిఖించుకుంది. వన్డేల్లో అత్యంత వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా నిలిచింది. ఐర్లాండ్‌పై స్మృతి మంధాననే 70 బంతుల్లో సెంచరీ బాదింది. ఇది మంధానకు 12వ శతకం కాగా.. ఓపెనర్‌గానే ఈ సెంచరీలు నమోదు చేసింది. తద్వారా అరుదైన జాబితాలో మంధాన చోటు దక్కించుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో ఓపెనర్‌గా అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్ల జాబితాలో సుజీ బేట్స్, స్మృతి మంధాన, టమ్మీ బౌమోంట్ 12 సెంచరీలతో అగ్రస్థానంలో ఉండగా..చార్లోట్ ఎడ్వర్డ్స్ హీలీ మాథ్యూస్ 9 శతకాలు నమోదు చేశారు. ఈ ఏడాది మంధానకు మూడో శతకం. వన్డేల్లో వేర్వేరు క్యాలెండర్ ఇయర్‌లో మూడు, అంత కంటే ఎక్కువ శతకాలు నమోదు చేసిన తొలి మహిళా బ్యాటర్‌గా కూడా మంధాన చరిత్రకెక్కింది. గతేడాది మంధాన వన్డేల్లో 4 శతకాలు నమోదు చేసింది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు నమోదు చేసిన మెగ్ లాన్నింగ్‌కు మంధాన చేరువవుతోంది. మెగ్ లాన్నింగ్ 15 శతకాలు బాదగా, సుజీ బేట్స్ 13 శతకాలతో మంధాన కంటే ముందుంది. 12 వన్డే శతకాలతో పాటు రెండు టెస్ట్ సెంచరీలు, ఓ టీ20 సెంచరీ కూడా మంధాన పేరిట ఉన్నాయి. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు బాదిన రెండో బ్యాటర్‌గా మంధాన నిలిచింది. ఈ జాబితాలో మెగ్ లాన్నింగ్ 17 శతకాలతో టాప్‌లో ఉండగా.. స్మృతి మంధాన 15 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. సుజీ బేట్స్(14), టమ్మీ బూమోంట్(14), చార్లోట్ ఎడ్వర్డ్స్(13) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 102 పరుగుల భారీ తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ మంధాన శతకంతో 292 పరుగుల భారీ స్కోర్ చేసింది. మంధానకు తోడుగా దీప్తి శర్మ(40) ఒక్కతే రాణించింది. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్(3/42) మూడు వికెట్లు తీయగా.. మేగన్ స్కట్, అన్నబెల్ సదర్లాండ తహిలా మెక్‌గ్రాత్ చెరో వికెట్ తీసారు. భారత్‌పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ కీలక ప్రకటనభారత్‌పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ కీలక ప్రకటన అనంతరం ఆస్ట్రేలియా 190 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్3/28) మూడు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ(2/24) రెండు వికెట్లు పడగొట్టింది. రేణుకా సింగ్, స్నేహ్ రాణా, అరుందతి రెడ్డి, రాధా యాదవ్ తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో ఎల్లిస్ పెర్రీ(44), సదర్లాండ45) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1–1తో సమంగా నిలిచింది. ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి నీరజ్





**టోక్యో:** జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా జపాన్‌లోని టోక్యోలో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం తొలి ప్రయత్నంలోనే నీరజ్ చోప్రా క్వాలిఫయింగ్ మార్క్ దాటేశాడు. అతను జావెలిన్‌ను 84.85 మీటర్ల దూరం విసిరాడు. అయితే ఈ టోర్నీలో ఆటోమెటిక్ క్వాలిఫయింగ్ మార్క్ 84.50 మీటర్లు లేదా అతని గ్రూపులో బెస్ట్ 12 మంది త్రోయర్లు ఫైనల్‌కు ప్రవేశిస్తారు. కానీ ఒలింపిక్ చాంపియన్ నీరజ్ మాత్రం తన ఫస్ట్ అటెంప్ట్‌లోనే క్వాలిఫయింగ్ మార్క్ దాటేసి ఫైనల్లో తన బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఈవెంట్‌లో బుధవారం నీరజ్ తన పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. పారిస్ ఒలింపిక్స్ సమయంలో కూడా నీరజ్ తొలి ప్రయత్నంలోనే క్వాలిఫై అయి ఫైనల్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. వరల్డ్ ఛాంపియన్, జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ తన రెండో ప్రయత్నంలో క్వాలిఫయింగ్ మార్క్ దాటి ఫైనల్లోకి ప్రవేశించాడు. అతను రెండో ప్రయత్నంలో తన జావెలిన్‌ను 87.21 మీటర్ల దూరం విసిరాడు.

## టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యుఎఇ

ఆసియా కప్‌లో భాగంగా పాక్తిస్తాన్‌యూఏఈ మధ్య మ్యాచ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానున్నది. పిసిబి బాయ్‌డ్రామ్ నేపథ్యంలో మ్యాచ్ ఆలస్యమైంది. షేక్ హ్యాండ్ వివాదం నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను రిఫరీగా తప్పించాలని పిసిబి డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఐసిసి రిఫరీని మార్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. అయితే, మరోసారి ఐసిసికి పిసిబి మెయిల్ చేసింది. పైక్రాఫ్ట్‌ను తొలగించకుంటే మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బెదిరింపులకు దిగింది. అయినా, ఐసిసి వెనక్కి తగ్గకపోవడంతో పాకిస్తాన్ జట్టు ఆలస్యంగా మైదానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. టాస్ గెలిచి యుఎఇ కెప్టెన్ మహ్మద్ వసీం తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇక మ్యాచ్‌కు రిఫరీగా ఆండీ పైక్రాఫ్ కొనసాగనున్నారు. ఈ మ్యాచ్ కోసం పాక్ జట్టులో రెండు మార్పులు చేసింది. సుఫ్యాన్ ముఖీమ్, ఫహీమ్ అష్రఫ్‌ను పక్కన పెట్టింది.

# షో కే స్

## చరిత్ర: బానిసి వ్యాపారం.. చరిత్ర చెప్పిన చేదు నిజం..



'మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగలం! ...
మనదీ ఒక బతుకేనా?
కుక్కల వలె, నక్కల వలె!
మనదీ ఒక బతుకేనా?

సందులలో పందులవలె!' అంటాడు మహాకవి శ్రీశ్రీ తన 'చేదుపాట' కవితలో. నాటి బానిస వ్యవస్థ పరోక్షంగా నేటికీ కొనసాగుతున్న వైనాన్ని చెప్తాడు. ఆర్థిక పరమైన అంశాలే సమాజిక రుగ్మతులుగా ప్రతిబింబిస్తాయన్న వాస్తవం, నేటి 'కాంట్రాక్ట్ ఉద్యోగ' వ్యవస్థ నిరూపిస్తునే ఉంది. చరిత్ర పుటలను తిరగేస్తే, సాటి మనిషిని బనిసగా మార్చి, అంగట్లో అమ్మకానికి పెట్టే దుర్మార్గపు వ్యవస్థ కళ్ల ముందు ఆవిష్కృతమవుతుంది. బానిస వ్యాపారం మానవ చరిత్రలో చెరగని మచ్చ. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన ఫ్రాన్స్ కూడా ఈ బానిస వ్యాపారంలో భాగస్వామిగా ఉండడం విచిత్రం. ఇంగ్లాండ్ 1772లోనే బానిస వ్యాపారాన్ని రద్దు చేయగా, ఫ్రెంచ్ రిపబ్లిక్ 1794లో ఆ నిర్ణయం తీసుకుంది. కానీ, నెపోలియన్ 1802లో దానిని పునరుద్ధరించాడు. ఫలితంగా 1830లో లూయిస్ ఫిలిప్ మళ్లీ నిషేధం విధించే వరకు బానిస వ్యాపారం చట్టబద్ధంగానే కొనసాగింది. అనధికారికంగా 1850 దశగాల వరకూ ఈ దుర్మార్గం అమల్లోనే ఉంది. మన దేశంలో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో భాగంగా ఉన్న యానాంలో బానస వ్యాపారం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆ రోజుల్లో, రీయూనియన్ వంటి ఫ్రెంచ్ కాలనీలలో చెరకు తోటలకు విపరీతంగా కూలీల అవసరం ఉండేది. ఆ అవసరమే బానిస వ్యాపారానికి పునాదిగా మారింది. 1760 నాటికి ప్రతి సంవత్సరం 50 పైగా నౌకలు ఆఫ్రికా, ఇండియా ప్రాంతాల నుండి బానిసలను తరలించేవి. ఒక్కో నౌకలో 300 నుంచి 400 మంది బానసిలను తరలించేవారు. రీయూనియన్‌లోని తోటల్లో వీరి జీవితం దయనీయంగా ఉండేది. రోజుకు 18 నుంచి 20 గంటల కఠోర శ్రమ. కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి. మరణాల రేటు అధికంగా ఉండేది. యానాం ప్రాంతంలో బానిసల సేకరణ ఎంత కిరాతకంగా సాగిందో 1792లో ఏట్స్ అనే బ్రిటిష్ వ్యక్తి రాసిన లేఖ స్పష్టం చేస్తున్నది. కరువు పరిస్థితుల నేపథ్యంలో, ఆకలితో యాచకులు, రైతులు, ఇతర గ్రామాల ప్రజలను బలవంతంగా పట్టుకుని రాత్రివేళల్లో ఫ్రెంచి నౌకల్లోకి ఎక్కించేవారని ఏట్స్ తన లేఖలో పేర్కొన్నాడు. యానాం, ఆతేరు, నీలపల్లి ప్రాంతాల నుండి కూడా మహిళలు, పిల్లలు కిడ్నాప్ చేసి బానిసలుగా మార్చేశారని స్పష్టం చేశాడు. అక్కడి బానిస వ్యాపారం క్రమంగా కూలీల రవాణాగా మారింది. 1828లో ఫ్రెంచి ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇందులో మూడు సంవత్సరాల ఒప్పందం, నెలకు 7 రూపాయిల జీతం, తిండి, వసతి, ఆరోగ్య సదుపాయాలు, మతాచారాలకు గౌరవం, రవాణా ఖర్చులు వంటి వాగ్దానాలు ఉండేవి. ఈ పద్ధతితో 1829లో మొదటి కూలీల బృందం రీయూనియన్‌కు తరలివెళ్లింది. కానీ ఆర్థిక సమస్యల వల్ల ఈ పద్ధతి ఎక్కువ కాలం నిలదొక్కుకోలేకపోయింది. ఏదిఏమైనా యానాంలోని ఫ్రెంచి బానిస వ్యాపారం ఒక దారుణ చరిత్ర. తొలుత బలవంతం, మోసాలతో సాగిన ఈ వ్యాపారం, తరువాత కాంట్రాక్టు విధానంగా మారినా, పరోక్షంగా బానిస వ్యవస్థే కొనసాగుతున్నది.

## సుదీర్ఘ యుద్ధం..



యుద్ధాలు జరగని కాలం దాదాపు లేదు. చరిత్ర మొత్తం యుద్ధాలతో నిండిపోయింది. వర్తమానంలోనూ ఇదే పరిస్థితి. అయితే, ఏదైనా యుద్ధం కొన్ని రోజులు లేదా నెలలు లేదా కొన్ని సంవత్సరాలు జరగవచ్చు. కానీ, ఏకంగా 335 సంవత్సరాలు కొనసాగిన యుద్ధం ఒకటి చరిత్ర నిక్షిప్తమైందనే వాస్తవం బహుశా చాలా మందికి తెలియకపోవచ్చు. 1648లో ఇంగ్లాండ్‌లో జరిగిన గృహ యుద్ధాల కారణంగా, పార్లమెంటుతో రాజు చార్లెస్ I అనుకూల వర్గాలు ఘర్షణలకు దిగాయి. ఆ సమయంలో నెదర్లాండ్స్, ఇంగ్లాండ్ మధ్య విభేదాలు ఉండేవి. ఇంగ్లాండ్ తీర ప్రాంతాల్లో చాలా మంది రాజుకు, ఆయన మద్దతుదారులకు అండగా నిలుస్తున్నారన్న అనుమానంతో, నెదర్లాండ్స్ నావికాదళం వారిపై దాడులు ప్రారంభించింది. దీనితో రాజు మద్దతుదారులు వెనుకడుగువేసి, ఐస్లెస్ ఆఫ్ సిలీ అనే చిన్న దీవుల సమూహంలో ఆశ్రయం పొందారు. నెదర్లాండ్స్ వారిని శత్రువులుగా పరిగణించి 1651లో యుద్ధం ప్రకటించింది. అయితే, వాస్తవానికి ఎలాంటి దాడి చేయలేదు. ఒక్క తుపాకీ గుండు కూడా పేలలేదు. రక్తం చిందలేదు. కొంతకాలానికి రాయలిస్టులు ఓటమిని అంగీకరించారు. అయినప్పటికీ, ఐస్లెస్ ఆఫ్ సిలీపై ప్రకటించిన యుద్ధం ముగిసినట్లు నెదర్లాండ్ ప్రకటించలేదు. అధికారికంగా ముగించలేదు. దీనితో, కేవలం పేరుకు మాత్రం యుద్ధం కొనసాగింది. ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. 1986లో చరిత్రకారులు ఈ విషయాన్ని తవ్వి బయటకు తీశారు. నెదర్లాండ్స్ రాయబారి రియెన్ హుయెకాపర్ ఐస్లెస్ ఆఫ్ సిలీని సందర్శించినప్పుడు, అధికారికంగా యుద్ధ ముగింపు ఒప్పందంపై సంతకం చేశాడు. అంటే, యుద్ధం మొదలైన 335 సంవత్సరాల తర్వాత అది అధికారికంగా ముగిసింది. ఒక్క తుపాకీ కూడా పేలకుండా, శతాబ్దాలు కొనసాగిన యుద్ధం ఇదే. చరిత్ర దీనిని అత్యంత సుదీర్ఘమైన యుద్ధంగా పేర్కొంటుంది. కానీ, నిజానికి ఇది కేవలం కాగితంపై జరిగిన యుద్ధం మాత్రమే. అందుకే ఇది 'ఒక్క తుపాకీ కూడా పేలని యుద్ధం' (ది వార్ విత్‌ఔట్ ఎ షాట్)గా ప్రసిద్ధి చెందింది. కాగా, ఐస్లెస్ ఆఫ్ సిలీ ప్రజలు ఈ సంఘటనను ప్రత్యేక గర్వంతో చూస్తారు. శతాబ్దాలు జరిగిన యుద్ధంలోనూ తాము ఓడిపోలేదని అంటారు.

# పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

### కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

### చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

### సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభలో పలువురు నేతలు



ఖమ్మం...

**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నా రు. కమ్యూనిస్టుల త్యాగాలతోనే భారత దేశంలో తెలంగాణ విలీనమైందని ఇందులో మరో అభిప్రాయానికి తావు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోరాట చరిత్రను కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తే జాతి క్షమించదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభ బుధవారం ఖమ్మంలోని జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. అంతకు ముందు సిపిఐ శ్రేణులు ఖమ్మం పట్టణంలో కదం తొక్కాయి. పాత బస్టాండ్ సెంటర్ నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ప్రదర్శనను నిర్వహించారు. జన సేవా దళ్ కార్యకర్తలు నిర్వహించిన కవాత్ నగర ప్రజలను ఆకట్టుకున్నది. వైరా రోడ్డు అరుణ వరణం పులుముకున్నది. జెడ్పి మీటింగ్ హాల్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన లేని వారు మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. క మ్యూనిస్టుల పోరాటంతో తెలంగాణ విలీనమైతే భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు రావడంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారని నిజాంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుని ఆయనను రాజ్ ప్రముఖ్‌గా ప్రకటించడంతో పాటు రాజాభరణాన్ని ఇచ్చే ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. పటేల్ సైన్యాలు నిజాంకు వ్యతిరేకంగా పోరాడలేదని కమ్యూనిస్టులను హతమార్చాయని ఇది చారిత్రిక సత్యమని హేమంతరావు తెలిపారు. నిజాంతో పోరాటం కంటే యూనియన్ సైన్యాల పోరాటంలోనే ఎక్కువ మంది కమ్యూనిస్టులు మరణించారన్నారు. పరమ కిరాతకుడు ఖాసిం రజ్వీని సైతం రక్షించి విమానంలో బయటకు పంపిన ఘనత అప్పటి పటేల్‌కు ఆయన సైన్యాలకు ఉందన్నారు. నేటి యువతరం అమరుల త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా హేమంతరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జన సేవాదళ్ ఇంచార్జి సిద్ధినేని కర్ణకుమార్ ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఖిలా వరంగల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర నాయకులు మేకల రవి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం తమ్మెర భవన్‌లో జాతీయ జెండాను రాష్ట్ర నాయకులు మేకల రవి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ బాష్‌మియా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయని, సెప్టెంబర్ 17న తె లంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా ని ర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దండు లక్ష్మ ణ్, గుండె బద్రి, బుస్స రవి, గన్నారపు రమేష్, సంగీ ఎలేందర్, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ల్యాదల్ల శరత్, సుదీర్, దస్సు, యాకాంచారి, జాన్ పాల్, రాజేందర్, చిరంజీవి, దివ్య మహేష్, ప్రభాకర్, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాకేంద్రంలో స్థానిక నూతన కూరగాయల మార్కెట్ నుండి స్ఫూర్తి ప్రదర్శన నిర్వహించి, మూడు కోట్ల జంక్షన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద పూలమాలలు వేసి సాయుధ పోరాట వీరుడు తీగల సత్యనారాయణ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వీర తెలంగాణ సాయుధ పోరాట సభ స్థానిక వీరభవన్‌లో జరిగింది, ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ తెలంగాణకు నిజమైన స్వాతంత్రం సెప్టెంబర్ 17న వచ్చిందన్నారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిర్వహించి తెలంగాణను విలీనం చేసిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సాయుధ పోరాట వారసులు 25 మందిని సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, కేదాసు రమేష్, బానోతు లింగ్య నాయక్, మాలోతు రవీందర్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, మంద శంకర్, ముదుసు రాణి, నాంచారిదాసు తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** నిజాం నవాబుల పరిపాలన అంతం కోసం జరిగిన మహోత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాదులు హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ విమర్శించారు. సెప్టెంబర్17న హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం చేసిన రోజును పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని, పార్టీ పతాకాన్ని శ్రీనివాస్ ఎగరవేశారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి తెలంగాన సాయుధ పోరాట స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బావండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, బీర్ల పద్మ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కసిబోజుల సంతోష్ చారి, నగునూరి రమేష్, బాకం ఆంజనేయులు, నాయకులు పి.సాంబయ్య, వెంకట్రాములు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, ప్రజ్వల్, రాజమల్లు, గట్టయ్య, చింటూ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్...


కరీంనగర్...



మహబూబాబాద్...

## ఖమ్మంలో 'రెడ్ షర్ట్' వలంటీర్ల కవాతు




సాయుధ పోరాట వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఖమ్మంలో సిపిఐ శ్రేణులు కదం తొక్కాయి. వందలాది మంది జనసేవా దళ్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన అంబేడ్కర్ సెంటర్ మీదుగా జెడ్పి మీటింగ్ హాల్ వరకు సాగింది.

## విమోచనం పేరుతో బిజెపి సభలు పెట్టడం ప్రజలను మోసం చేయడమే



### సాయుధ పోరాటం నడిపింది.. త్యాగాలు చేసిందీ కమ్యూనిస్టులే

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ :** భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటం నడిపింది.. ప్రాణ త్యాగాలు అర్పించింది కమ్యూనిస్టులేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పోరాటానికి సంబంధం లేని బిజెపి సభలు పెట్టి ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో జాతీయ జెండాను ఎగరవేసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంతో 4 వేల ఐదువందల మంది అమరుల త్యాగాలు, రక్తంతో తడిసి ఎరుపెక్కింది ఈ నేల అన్నారు. ఈ పోరాటం ఒక మహోజ్వల చరిత్ర అని పోరాటంలో పాల్గొన్న సమరయోధులకు పింఛన్లను ఇవ్వకుండా నిలిపివేసి పోరాటాన్ని అవమానపరిచిన కెంద్రంలో అదికారంలో ఉన్న బిజెపి నేడు విమోచనం పేరుతో సభలు పెట్టడం వెనుక ఏమి కుట్ర దాగిందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. భూస్వాములు, జాగిర్దారులు, దొరలకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి మతం పులిమి హిందూ–ముస్లిం మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారని, ఈ పోరాటంలో అసువులు బాసిన షేక్ బందగి, మగ్దూమ్ మోహినుద్దీన్, షోయబుల ఖాన్‌ల త్యాగాలకు బిజెపి ఏమి సమాధానాలు చెపుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17ను ప్రజాపరిపాలన దినోత్సవం కాకుండా సాయుధ పోరాట దినాన్ని అధికారికంగా నిర్వహించాలని ఈసందర్బంగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి వి.లెనిన్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ముండ్ల ముత్యాలు, దోటి పాండరి, కోమటిరెడ్డి ప్రద్యుమారెడ్డి, యూసుఫ్, వీరయ్య వేంకటయ్య, ఆర్‌ఎస్ రాములు, విజయరెడ్డి, కటకల్ల విజయ, దేవేందర్, డిఎస్ చారీ, రామచారి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## గురుకులంలో పరిశుభ్రత పైప్రత్యేక దృష్టి సారించండి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గురుకులంలో పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులను, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థుల వద్ద కు వెళ్లి వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. శానిటేషన్ ఇంకా చేయాల్సి ఉందని ఆదేశించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాదులు రాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య తో పాటు నాణ్యమైన భోజనం ను అందించాలని అన్నారు. మెనూ ను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

## సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాతాజీ**



**ప్రజాపక్షం/చర్ల :** భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ముంగింపులో భాగంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో అరు పతాకాన్ని ఎగురవేసి అమరులకు జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం నవాబు నిరంకుశ పాలనను అంతమొందించేందుకు ప్రజలే సాయుధులై రజాకార్లను సైతం తరిమికొట్టారని,ఈ మహత్తర పోరాటంలో సుమారు 4500 మంది అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని మతతత్వ బీజేపీ, దాని అనుబంధ సంఘాలు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నాయని, చరిత్రను వక్రీకరిస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. పాలకులు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, నాటి పోరాట స్ఫూర్తితో పాలకులను ప్రశ్నించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కోటిరెక్కల రాజారావు, ఉయిక గాంధీ, కట్టం ముత్తయ్య, పాగా ఆదినారాయణ, నర్సింహారావు, గణేష్, సత్యనారాయణ, నాగేశ్వర రావు, రాము, శంకర్, వెంకటేశ్వర్లు, రామయ్య, రాజు, తేజ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసిబి వలలో రెవెన్యూ అధికారులు

**రూ. 10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం**



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఏసిబి వలలో మరో ముగ్గురు అధికారులు చిక్కుకున్నారు. తల్లాడ మండలం తహసీల్దార్ వంకాయల సురేష్‌బాబు, ఆర్ఐ భాస్కర్, ధరణి కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్ ఏసిబికి చిక్కారు. మండల పరిధిలోని ఒక రైతుకు సంబంధించిన 15 కుంటల భూమిని భూభారతి రికార్డుల్లో ఎక్కించేందుకు రూ. 12వేలను డిమాండ్ చేశారు. చివరకు రూ. 10వేలకు అంగీకరించి దొరికిపోయారు. ఏసిబి డిఎస్‌పి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... రైతు వద్ద 15 కుంటల భూమిని రికార్డుల్లో చేర్చేందుకు రూ. 12వేలు డిమాండ్ చేశారని చివరకు రూ. 10వేలకు అంగీకరించారని ఇది ఇవ్వడం ఇష్టం లేని రైతు తమను సంప్రదించారని ఆయన తెలిపారు. తమ నగదు ఇచ్చి అధికారులకు ఇస్తుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిబంధనల ప్రకారం వారిని రేపు కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

## అమ్మలాంటిది అంగన్ వాడీ కేంద్రం

**డిసిపిఓ విష్ణు వందన**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చిన్నారులకు అంగన్‌వాడి కేంద్రం అమ్మలాంటిది అన్నారు డిసిపిఓ విష్ణు వందన. పట్టణంలోని బాలికల హైస్కూల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న పోషణ్ బి, పడయ్ బి మూడు రోజుల శిక్షణ భాగంగా బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి డిసిపిఓ విష్ణువందన ముఖ్య అతిదిగా హజరైనారు. రెండో రోజు మాల్ న్యూట్రిషన్ గురించి అనగా లోప పోషణ తో ఉన్న పిల్లలను ఎలా సామాన్య స్థితికి తీసుకురావాలి అనే అంశంపై శిక్షణ నడిచింది. ఏ విధమైన ఫుడ్ అందించటం ద్వారా సామాన్య స్థితికి చేరుకుంటారు, గ్రోత్ మానిటరింగ్ ఎలా నిర్వహించాలి, లోప పోషణ తో ఉన్న పిల్లలను ఎస్ఎస్ఎప్పి లో ఎలా నమోదు చేయాలి తదితర అంశాలపై సూపర్ వైజర్ గంగజాలం, కమల తెలిపారు. డిసిపిఓ విష్ణువందన మాట్లాడుతూ 1098, మిషన్ వాత్సల్య, చైల్డ్ మ్యారేజ్, చైల్డ్ అబ్యూస్ తదితరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మెహరున్నీస్సా బేగం, సూపర్ వైజర్స్ వసంత, రాణి, భవాని, మహాలక్ష్మి, కమల, రమాదేవి పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్, ఆఫీస్ స్టాఫ్ వెంకటేశ్వర్లు, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఇంకా మూడు విడతలుగా అందిస్తాం

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా అభివృద్ధి ఎక్కడా ఆగకుండా చేస్తున్నట్లు తెలిపారు. 21 నెలలో అనేక సంక్షేమ పథకాలు చేసి నిరూపించామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గం లో 3500 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. లక్షలాది మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. 11 లక్షల కార్డులు కొత్తగా మరో 15 లక్షల కార్డులలో మార్పులు, చేర్పులు చేసినట్లు తెలిపారు. మండలం లోని మోటాపురం, రాజేశ్వరపురం, కొత్తకొత్తూరు, బైరవునిపల్లి గ్రామాలలో అంతర్గత రహాదారులకు శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, వల్లాల రాధాకృష్ణ, రావెళ్ల కృష్ణారావు, జెర్రిపోతుల అంజిని,కుక్కల హనుమంతరావు, వెంకన్న, గేశ్వరరావు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, కొమ్మినేని విజయ్బాబు, కొచ్చేర్ల శ్రీనివాసరావు, బెల్లం వాసు, మురళీ, గొళ్ల శ్రీనివాస్ రావు,మరికంటి రమేష్, గండు సైదులు, లక్ష్మణ్,గోపి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజా పాలన

**ప్రజా పాలన దినోత్సవ వేడుకలో డిప్యూటీ సిఎం భట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేదల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర లో ప్రజా పాలన కొనసాగుతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రైతులు, కూలీలు భూమి భుక్తి కొరకు భూ పోరాటాలు చేసి నిజాం ప్రభుత్వ సాయుధ రజాకార్లను ఎదిరించారని ఆయన తెలిపారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలకు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తదనంతరం జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి చారిత్రిక పోరాటాలు జరిగాయని ఆయన తెలిపారు. అందులో ఖమ్మం జిల్లా కూడా ప్రముఖ భూమిక పోషించిందన్నారు. రజాకార్లను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి ఈ ప్రాంతాన్ని ప్రజా పాలనలో భాగస్వామ్యం చేశారన్నారు. మహకవి దాశరథి తన కలం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తే బొమ్మకంటి సత్యనారాయణ, రాంచందర్‌రావు, శీలం సిద్దారెడ్డి, నల్లమల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు లాంటి అనేక మంది ప్రముఖులు కీలక భూమిక పోషించారని భట్టి విక్రమార్క తెలిపారు. సోయాబుల్లాఖాన్ నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కలంతో పోరా టం చేశారన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ను ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 2030 నాటికి 1.98 లక్షల కోట్లతో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తామని 1.14 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని విక్రమార్క తెలిపారు. . సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లిలో ఆసుపత్రులను అభివృద్ధి చేశామన్నారు. సత్తుపల్లి, పాలేరులో నర్సింగ్ కళాశాలలు, వైరాలో వంద పడకల ఆసుపత్రి, ఖమ్మంలో ఆసుపత్రి అభివృద్ధి, క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ. 180 కోట్లతో మున్నేరుపై తీగల వంతెన, రూ. 130 కోట్ల వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని జిల్లాలో రూ. 139 కోట్లతో రెండు వరుసల రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిజాం నిరంకుశ పా లన అంతమొందిన సుదినం అని, భారత దేశానికి 1947 ఆగస్టు15న స్వతంత్రం సిద్ధిస్తే, ఆ నాడు నిజాంపాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం ఏడాది తర్వాత సె ప్టెంబర్ 17న అతిపెద్ద పోరాటంతో భారత దేశంలో విలీనమైందని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందని, మరింతగా పరిడమిల్లాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఐడిఓసి కార్యాల య ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవా న్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేన ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. భద్రాచలం ఎంఎల్ఏ డా తె లఅనంతరం తుమ్మల మాట్లాడుతూ జి ల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమర యోధులు, తెలంగాణ అ మర వీరులకు జో హార్లు అర్పిస్తున్నట్లు తెలిపారు. వారి త్యాగాల మూలంగా నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీ ల్చుకోగలుగుతున్నట్లు చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఇది గర్వకారణమైన రోజని, నిరంకుశ పా లన నుండి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన రోజని చెప్పారు. గత పాలకుల పోకడల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిద్రమైందని, ఆ పరిస్థితి ని గాడిలో పెట్టుకుంటూ సుపరిపాలన దిశగా అడుగులేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టుతో నీటి కల నెరవేరిందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనతో జిల్లా ఖ్యాతి పెరిగిందని, భద్రాచలంకు రాకపోకలు జరిగేలా రైల్వే పనులు సాగుతున్నాయని, కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు, రింగ్‌రోడ్, బైపాస్ రోడ్, నేషనల్ హైవే పనులు ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడం, భవిష్యత్‌లో థర్మల్ సో లార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్ర భుత్వం కృ షి చేస్తోందని చెప్పారు. వర్షానికి చేరే చర్యలు తీసుకోవడం మనందరి బాధ్యతని మంత్రి జిల్లా అటవీ అధికారి కృష్ణగౌ డ్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థా నిక స ం స్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సం క్షేమాధికారి విజయలక్ష్మి , జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ సం ఘం నా యకులు వెంకటాచా రి, వారాధి సత్యనారాయణ, బసవపాత్రుని తిరుప తి, వారాధి రా మాచారి, బి సాంబయ్య, ఎస్ కృష్ణమాచారి, కూరపాటి లింగాచారి, వెంకటాచారి పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల పేరుపల్లిలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పేరుపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కలిసి వారికి పూలమాలలతో, శాలువలతో షీల్డ్ ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన గ్రహీతలుగా మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు, ఎంపీపీఎస్ పేరుపల్లి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బానోత్ శ్యామ్లాల్, జెడ్‌పిహెచ్ఎస్ పేరుపల్లి ఎస్ఏ ఫిజిక్స్ రామకృష్ణారావు, జెడ్‌పిహెచ్ఎస్ పేరుపల్లి ఎస్ఏ హిదీ మాలోత్ రాములు ఉన్నారు. సంఘ బాధ్యులు అజ్మీరా వీరు నాయక్, బానోత్ పాపాలాల్, అజ్మీరా బన్సీలాల్, హరీష్, బానోత్ శ్రీనివాస్‌రావు, స్లీవారాజు, పేరుపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, జెడ్‌పిహెచ్ఎస్ పేరుపల్లి ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీవో, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.



## పోరాటాల నేల తెలంగాణ

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సుదీర్ఘ పోరాటాల నేల తెలంగాణ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం తన అస్తిత్వం, గుర్తింపు కోసం సుదీర్ఘంగా పోరాటం చేసిందన్నారు. ఆనాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశామని, దశాబ్దాల పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన బతుకమ్మ, బోనాలు, సంస్కృతికి, మన కళలకు, సాంప్రదాయాలకు మంచి గుర్తింపు, ప్రాముఖ్యత లభించిందన్నారు. అభివృద్ధి ప్రమాణాలలో దేశంలోనే అనేక రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే పరమావిధిగా అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఖమ్మంజిల్లా మంచి పనితీరుతో ముందంజలో ఉందని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో**

ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ జా తీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం నగరాభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ప్రజల సహకారంతో కార్పోరేషన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు అమలు చేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో కార్పోరేషన్‌కు అవసరమైన నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఉప మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ముఠా కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**

**ప్రజాపక్షం/మణుగూరు:** బొగ్గు ముఠా కార్మికులు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, మీ కు అండగా సిపిఐ పార్టీ నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. బుధవారం బొగ్గు ముఠా ఆఫీసు (రాజబల్లి భవన్లో) బొగ్గు ముఠా 11వ మహాసభ శ్రీకాకుళం వీర మల్లు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముందుగా పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి ఎగరవేశారు.అనంతరం జరిగిన మహాసభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ బొగ్గు ముఠా కార్మికులు అనేక సంవత్సరాలుగా ఇక్కడ పని చేస్తున్నారని, వీరిని కొంతమంది పెట్టి చాకిరీ చేయించుకునే వారని ఇండ్లలో పని చేయించుకునే వారని, వీరి ఆగడాలను భరించలేక ఏఐటియుసి సంఘంలో చేరారని, వారి సమస్యలు ఏఐటీయూసీ పరిష్కరించామని, అప్పటినుండి ఏఐటియుసీ లో కొనసాగుతూ, సిపిఐ అనుబంధంగా ఒక ముఠా కార్మికులు కొనసాగుతున్నారని అన్నారు. గుమస్తాలు, కోల్ ట్రాన్స్పోర్ట్, లారీ ఓనర్స్, బొగ్గు మూఠా వారు ఇలా అందరూ ఐక్యతతో పనిచేస్తున్నారని, బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ సెక్షన్లో, అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులు ఏఐటియుసి కి అనుబంధంగా కొనసాగుతూ వస్తుందని, వీరికి ఏ సమస్య వచ్చినా ఏఐటీయూసీ పార్టీ అండగా నిలిచిందన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య ఎల్లవేళలా ముఠా కార్మికులకు అండగా నిలిచారని, వారికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. వారు లేని లోటు మరువలేనిదని, అయినా బొగ్గు ముఠా కార్మికుల సమస్యల కోసం ఏఐటీయూసీ, సిపిఐ అండగా నిలుస్తూ ముందుకు సాగుతామని, దీనికి కార్మికుల ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. బొగ్గు ముఠా కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి

**సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**

ఈ మహాసభలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్హాజరై మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా బొగ్గు ముఠా కార్మికులు బ్రతుకుతెరువు కోసం జీవనోపాధి కొరకు బొగ్గులో ఉంటూ బొగ్గు, గాలి పీలుస్తూ వచ్చి రాని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని, దుమ్ములో దూళిలో ఉంటూ ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న జీవన కోసం సంవత్సరాల తరబడి, బొగ్గు లోడింగ్ అన్ లోడింగ్ లో పనిచేస్తున్నారని, అనేకమంది గుండె సంబంధిత, ఉదర సంబంధిత వ్యాధులతో, బొగ్గు ముఠా కార్మికులు మరణించారన్నారు. వీరిని సింగరేణి గానీ ప్రభుత్వం కానీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని, కాంట్రాక్టు లేబర్‌గా గుర్తించడం లేదని, ప్రభుత్వం వీరిని కాంట్రాక్టు లేబర్గా గుర్తించాలని, వీరికి కూడా కనీస వేతన అమలు జరిగేలా చూడాలని, సింగరేణి వారు వీరికి ఉచితంగా వైద్యం అంది ఎలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గద్దం వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు.



## తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, ఆ పోరాటంలో కమ్యూనిస్టులు అసమానమైన త్యాగాలు వెలకట్టలేనివని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్ అన్నారు. బుధవారం నాడు కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్లో వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు పూల తో నివాళులు అర్పించారు.అనంతరం ఎజె రమేష్ మాట్లాడుతూ. కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన విరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో విషపురుగులైన కాషాయ ఉన్మాదులకు ఏమిటి సంబంధమని, మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే నైతిక అర్హత మతోన్మాద బీజేపీకి లేదని విమర్శించారు. విరోచిత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మచ్చుకైనా కనిపించని మతోన్మాదులు ఆ పోరాటానికి వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు నందు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా వైరాలోని మున్సిపాల్ కమీ షనర్ గురులింగం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపి డివో సక్రియ, వైరా ఏరియా హాస్పిటల్ నందు డాక్టర్ బాలు సోమవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ హర్ష, సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు కార్తీక్, నీటిపా రుదల కార్యాలయం నందు డి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ కార్యాలయం ఎంఈవో వెంక టే శ్వర రావుతో ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగరవేసి ప్రజపాలన దినోత్సవం నిర్వహించారు.

**ప్రజాపక్షం/ మధిర :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణం, మండలంలో దినోత్సవ వేడుకలను బుధ వారం ఘనంగా నిర్వహించారు. మధిర పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సిఐ మధు జాతీయ జెండాను ఎగురవేశారు. మధిర తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాంబాబు, మున్సిపాల్టీ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, మధిర విద్యుత్‌శాఖ కార్యాలయంలో సబ్‌డివిజన్ ఎడిఇ అనురాధ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలు వివిధశాఖల అధికారులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మం డలం, ఏదులాపురమున్సిపాలిటీలో ప్రజా పాల నది నోత్సవం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వ హించారు. రెవిన్యూ కార్యాలయంలో తహశీల్దార్ పిల్లి రాం ప్రసాద్, ఇఎమ్‌సీలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ తిరుపతిరెడ్డి, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడీఓ శ్రీదేవి, ప్రభుత్వకార్యాలయల్లో అధికారులు జాతీయజెండాలను ఆవిష్కరించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ హరిత, మున్సిపాలిటీలో మేనేజర్ నాగేశ్వరరావు, రైతువేదికలో రూప, మార్కెట్ కమిటీలో నీరజాదేవి ఎంపీడీవో కార్యాలయంలో చంద్రశేఖర్ తాసిల్దార్ కార్యాలయంలో పులి సాంబశివుడు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో అజయ్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ అధికారులు పలు పార్టీల ప్రతినిధులు తో పాటు ఆయా కార్యక్రమాలలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు పలువురు పాల్గొన్నారు. ప్రజాపాలన దినోత్సవం ప్రత్యేకతను అధికారులు వివరించారు.

**ప్రజాపక్షం/ఇల్లెందు:** బులియన్ మర్చంట్, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని రాందేవ్ బాబ



ఆలయంలో స్వర్ణకార కుటుంబ సభ్యులు యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించి, సాయంత్రం పట్టణం పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాస్, బొజ్జ కృష్ణ, అద్దంకి రవికుమార్, అనిల్ గోయల్, కాలూరి నవీన్, ఆకారపు ప్రవీణ్, ఇమ్రాన్, తేలుకుంట్ల రమేష్, కాలూరి హరీష్, జక్కోజు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో ప్రజాపాలన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య ఆయా కార్యాలయాలలో జెండా ను ఎగురవేశారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బాధిత కుటుంబాలకు ఝాన్సీరెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో ఇటీవల మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులను టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి పరామర్శించారు. పట్టణ కేంద్రానికి చెందిన విశ్రాంత ఎఇ వెంకటేశ్వర్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా, రెండవ వార్డులోని కర్ర ప్రశాంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా, మూడవ వార్డుకు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు లలితమ్మ మనవడు అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఝాన్సీరెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, యువజన నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం

**ప్రజాపక్షం/రాయపర్తి :** ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. మండలంలోని మైలారం గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి పాఠశాల తరగతి గది ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు. బుధవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు అక్కడి సన్నివేశాన్ని చూసి ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. క్షుద్ర పూజలు ఎవరు చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. క్షుద్ర పూజలు చేశారని పాఠశాల వర్గాలు చెబుతుంటే మరికొందరు ఇది ఆకతాయిలపనంటూ చెప్పుకొస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలో ఇలాంటి వికృత పనులకు ఒడిగట్టినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పోలీసులను కోరారు.

## విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు

**ప్రజాపక్షం/నెక్కొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాలభివృద్ధి కోసం గ్రామ పాలన అధికారుల కోసం పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులను పలు గ్రామాలకు రాష్ట్ర వ్యాప్తంగా పంపించింది. ఇందులో భాగంగా నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలను 14 రెవెన్యూ సెక్టార్లుగా ఎంపిక చేసిన జిల్లా అధికారులు ఆయా సెక్టార్ గ్రామాలకు జిపిఓ గ్రామ పరిపాలన అధికారులను నియమించింది. ఈ సందర్భంగా తహసీల్దారు రాజ్‌కుమార్, డిటి పల్లకొండ రవిలు మాట్లాడుతూ.. రాబోయే రోజులు చాలా క్లిష్టమైనవి గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని ఎంపిటిసి, జడ్పీటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని రాజకీయాలకు, బంధుప్రీతి, కమ్యూనిటీకి అతీతంగా పనిచేయాలని, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు.

## విమోచన, విముక్తి కాదు 'విద్రోహ' దినం

**ప్రజాపక్షం/నర్సంపేట :** 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన, విముక్తి కాదని ముమ్మాటికీ విద్రోహ దినంగా పాటించాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. బుధవారం కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డూరి రాజు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం నెత్తురు చిందిన చరిత్ర మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానిదని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా తెలంగాణలో 3వేల గ్రామాలు విముక్తిని పొందాయని, 10 లక్షల ఎకరాల భూములను నిరుపేద ప్రజలు దున్నుకున్నారన్నారు. బిజెపి, ఆర్‌ఆర్‌ఎస్ ఈ పోరాటాన్ని హిందూముస్లింల మధ్య జరిగిన మత యుద్ధంగా చరిత్రను తప్పుగా చూపిస్తోందని, మతోన్మాద శక్తులు చేసే ఈ దుష్ప్రచారాన్ని నేటి తెలంగాణ ప్రజలు, కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామికవాదులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బానోతు జవహర్ లాల్, సింగరబోయిన కట్టయ్య, అడ్డూరి మనోహర్ చారి, రాజేందర్, బాలరాజు, ఖలీల్, విఠల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో కమలాపూర్‌లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ళ పంపిణీ

### హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్

**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ మండల కేంద్రంలో త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయబోతున్నామని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ అన్నారు. బుధవారం కమలాపూర్ మండల కేంద్రంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ళను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ళ మరమ్మతుల కోసం సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పూర్తి వివరాలు అందజేశామని, ఆ పనులు జరుగుతున్నాయని అన్నారు. కమలాపూర్‌లో 320, గూడూరు గ్రామంలో 50, మర్రిపల్లి గూడెం గ్రామంలో 50 అర్హులైన నిరుపేదలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక్కొక్కటిగా హామీలు అమలుపరుస్తున్నామని, అర్హులైన వారికి అందరికీ ఇల్లు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్, మౌటం కుమారస్వామి, పోడేటి బిక్షపతి, మాజీ ఎంపిపి తడక రాణి శ్రీకాంత్, మాట్ల రమేష్, పుల్లూరి శ్రీనివాస్ రావు, కెత్తె రవి, రమేష రామారావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో రాణించాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** బెంగుళూరు విశ్వేశ్వరయ్య వైజ్ఞానిక, సాంకేతిక సంగ్రహాలయం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సైన్స్ సెమినార్ క్వాంటం ఏజ్ బిగిన్స్; పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై జిల్లాస్థాయిలో హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లష్కర్ బజార్ ప్రాంగణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో బుధవారం నిర్వహించడం జరిగింది. జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. సెమినార్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ధర్మసాగర్ మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న అపూర్వ శ్రీవాస్తవను జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు. మరింత మెలకువతో రాష్ట్రస్థాయి సెమినార్లో పాల్గొని జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపిక కావాలని ప్రోత్సహించారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సెమినార్‌కు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 18 మంది విద్యార్థులు హాజరవగా, ఏకశిలా టెక్నో స్కూల్, పెంబర్తిలో పదవ తరగతి చదువుతున్న ఎం.మన్వితారెడ్డి ద్వితీయ, అయినవోలులోని ఏకశిలా సి.బి.ఎస్.ఇ. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వై.రేష్మ తృతీయ స్థానాన్ని పొందారు. కాకతీయ ప్రభుత్వా డిగ్రీ కళాశాల హనుమకొండలో కంప్యూటర్ విభాగం సహాయక ఆచార్యులుగా పనిచేస్తున్న శ్రవణ కుమారి, వాగ్దేవి డిగ్రీ కళాశాల కంప్యూటర్ విభాగంలో సహాయక ఆచార్యులుగా పనిచేస్తున్న బి.స్వప్న న్యాయ నిర్ణేతలుగా పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను అభినందించారు. నిర్వహణ కమిటీలో ఉపాధ్యాయులు ఎ.సంపతి, బి.శ్వేత, కె.రమాదేవిలు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి :** టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పిసిసి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డిలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిసిసి చీఫ్‌గా మహేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలంలో పార్టీని బలోపేతం చేయడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు.

# నాటి తెలంగాణ సాయుధపోరాటమే స్ఫూర్తి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### హనుమకొండలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/హనుమకొండ :** నిజాం రాచరిక పాలన నుండి విముక్తి అయిన తెలంగాణ తిరిగి గత పదేళ్లలోనూ నయా నిజాం రాచరిక పాలనలో మగ్గిపోయిందని, అలాంటి తెలంగాణాకు తిరిగి విముక్తి కల్పించడంలో నాటి తెలంగాణ సాయుధపోరాటమే మాకు స్ఫూర్తి అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత అదాలత్ కూడలిలో అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, తదితరులు అమరవీరుల స్థూపం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎగురవేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గత పదేళ్లలో పాలించిన పెద్ద మనిషి ప్రజాస్వామ్యం పీక పిసికేశారని, ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, ఉద్యమాలను నిషేధించారని అన్నారు. ధరణి పేరుతో భూములనే కాకుండా ప్రాజెక్టులను కూడా పన్నుకు మట్టి అంటకుండా మింగేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేడు అనేక రంగాలలో తెలంగాణ ముందంజలో నిలిచిందని అన్నారు. కాగా అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించగా కలెక్టరేట్ వద్ద పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్ :** వరంగల్ ఓసిటీ ఎదురుగా గల ఐడిఓసి మైదానంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి, పుర ప్రముఖులకు, అధికార అనధికారులకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజనుద్దేశించి మంత్రి కొండా సురేఖ ప్రసంగించారు.



## మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** లష్కర్ సింగారంలోని యూపిహెచ్‌పిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మెగా హెల్త్ క్యాంప్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్య సేవలను అందించాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఎంపి డాక్టర్ కడియం కావ్య ఆదేశించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం టి.బి పేషంట్లకు ఎంపి న్యూట్రిషన్ కిట్ల ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఇతర వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి

### నిజాముకు, మోదీకి తేడా ఏమీ లేదు..!

### సిపి(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకరీ విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని నాడు నిజాం రాజు భూస్వాములు జాగీర్దారులు, పెత్తందారులు, జమీందారులకు, దేశముఖ్‌లకు, దొరలకు వత్తాసు పలకగా నేడు నరేంద్ర మోడీ కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు బహుళ జాతి సంస్థలకు ఊడిగం చేస్తున్నారని వారిద్దరికీ తేడా ఏమీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. మహబూబాబాద్ వీఆర్ఎన్ గార్డెన్లో నిర్వహించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభ సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ దేశ చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య గునిగంటి రాజన్న ఆకుల రాజు కందునూరి శ్రీనివాస్ కుంట ఉపేందర్ అల్వాల వీరన్న పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు టూ టౌన్ కార్యదర్శి సమ్మెట రాజమౌళి జిల్లా కమిటీ సభ్యులు మండ రాజన్న గాడి పెళ్లి ప్రమీల కందునూరి కవిత హరి నాయక్ బొమ్మన అశోక్ గునిగంటి మోహన్ దుడ్డేల రామ్మూర్తి ఏం పాపారావు మండల కార్యదర్శిలు పాల్గొన్నారు.

# విస్తృత ఏర్పాట్లు చేయాలి

### సద్దుల బతుకమ్మకు, దసరా ఉత్సవాలకు

### మంత్రి కొండ సురేఖ

### ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/వరంగల్ :** బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కరిమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యూఎంసి సంయుక్త ఆధ్వర్యంలో రంగలీల మైదానం (ఉర్సుగుట్ట) కరీమాబాద్ ప్రాంతం లో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ గుండు సుధారాణి నగర పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్‌పాయిలతో కలసి సమీక్షించి సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటామని వారి సౌకర్యార్థం అవసరమగు ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని, ఆయా పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల వద్ద ప్రతిరోజు శుభ్రం చేయాలని మునిసిపల్ అధికారులను సూచించారు. దసరా పర్వదినం సందర్భంగా రంగలిలా మైదానంలో అంగరంగ వైభవంగా జరుపుకొనే వేడుకలకు దసరా కమిటీ కోరిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తగినంత లైటింగ్ పారిశుద్ధ్యం మంచినీటి సౌకర్యం, సీటింగ్ ట్రాఫిక్ నియంత్రణ, మహిళ పురుషుల పోలీసులతో పటిష్ట పోలీసు బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు, అంబులెన్సు, అగ్నిమాపక యంత్రం ఏర్పాటు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేయాలన్నారు. డిసిపి సలీమా, డిఆర్ఓ విజయలక్ష్మి, పోలీస్, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి ప్రభాకర్ రావు, ఎసిపి శుభం ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి జితేందర్ రెడ్డి, ఇరిగేషన్, డిడబ్ల్యూఓ, ఎన్పీడిసిఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, తదితర శాఖల అధికారులు, కార్పొరేటర్ ప్రవీణ్ ఉర్స్, కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ నేతల తీరు సిగ్గుచేటు

### మీ హయాంలో విలీనం చేసుకున్న ఎమ్మెల్యేలపై మాట్లాడరేమి..?

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి, కెఆర్.నాగరాజు




**ప్రజాపక్షం/హనుమకొండ :** కాళేశ్వరం అవినీతిపై మాట్లాడని బిఆర్‌ఎస్ నాయకులు కడియం శ్రీహరి పార్టీ మార్పు గురించి మాట్లాడడం హాస్యాస్పదం అని, కాళేశ్వరం అవినీతిపై ఇప్పటికీ వారు ప్రజలకు సమాధానం చెప్పలేదని కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,వరంగల్ ఎంపి కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్.నాగరాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. నాడు బిఆర్‌ఎస్‌లో విలీనం చేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై బిఆర్‌ఎస్ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతో కొందరు కాంగ్రెస్‌తో కలిసి నడుస్తున్నారన్నారు. తమ హయాంలో కట్టిన ఏళ్లనాటి ప్రాజెక్టులు చెక్కుచెదరలేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం తాము కృషి చేస్తుంటే మీరు ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేయడంలో బిఆర్‌ఎస్ నేతలు ఘనులన్నారు. నాడు డిప్యూటీ సిఎంగా ఉన్న డాక్టర్ రాజయ్యని పక్కనపెట్టి కడియంకి టికెట్ ఎందుకు ఇచ్చారో చెప్పాలన్నారు. రాజయ్యకి టికెట్ ఇవ్వకపోతే మాట్లాడని బిఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజవర్గ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధి చేపట్టారన్నారు. ఎన్నికలు వచ్చినా, రాకపోయినా ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నిత్యం శ్రమిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరుమాండ్ల రామక్రిష్ణ, పి. వెంకట్రామ్ రెడ్డి,లక్ష్మి రెడ్డి, టి.విద్యాసాగర్, వెంకట్, రహీమున్నీసా, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/జనగామ :** ప్రజాపాలన దినోత్సవ వేడుకలు బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని జెండావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపానికి నివాళ్లు అర్పించి తెలంగాణలో చేపడుతున్న పథకాలను విరించారు. హైదరాబాద్ సంస్థానంలో 1948 సెప్టెంబర్ 17న భారత దేశంలో విలీనమైందన్నారు. తెలంగాణ పోరాటంలో జనగామ జిల్లా పాత్ర సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, పోరాట వనిత చాకలి ఐలమ్మ లాంటి వారు జనగామ జిల్లాకు చెందినవారన్నారు. అనేక మంది అమరులు అయ్యారని, 10లక్షల ఎకరాల భూమి పంచబడిందన్నారు. పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించి షేక్ బందగీ కామారెడ్డిగూడెం బిడ్డనే అన్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో పోరాట ఘట్టాల చరిత్ర ఉందని, వీర భైరాన్‌పల్లి, కూటిగల్లు ఇలా చెప్పుకుంటు పోతే ఒకొక గ్రామానికి ఒకొక చరిత్ర ఉందన్నారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్‌కుమార్, అదనపు కలెక్టర్ బెన్షలోమ్, డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పండరి చేతన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పాల్గొన్నారు. స్వచ్ఛతా హి సేవ 2025ను ప్రారంభించారు. చంపక్‌హిల్స్ లోనూ స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించారు.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా బుధవారం ఎంపిడిఓ విజయ ఆధ్వర్యంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకట నర్సయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సయ్యద్ సర్వర్ పాషా, కన్నాయిగూడెం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎండి అప్సర్ పాషా, ఎంపివో సాజిదా భేగం, ఏపిఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సునార్కని రాంబాబు, శ్రీధరి సుమన్, టౌన్ అధ్యక్షులు మంగళవారం సత్యం, కావిరి మోహన్‌రావు, పూజారి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** విశ్వకర్మ జయంతి వేడుకలు మండలంలో విశ్వకర్మల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వకర్మల గౌరవాధ్యక్షులు కేశోజు రాములు మాట్లాడుతూ ఈ విశ్వంలో అనాదిగా మానవుని యొక్క మనుగడ కోసం అవసరమైన వస్తువులను తయారు చేయడంలో పంచ శిల్పులు పిలవబడే విశ్వకర్మలదే ప్రధాన భూమిక అన్నారు. నాగరిక ప్రపంచానికి దిక్సూచి లాంటి వారే విశ్వకర్మలని వారి యొక్క నైపుణ్యంతో అనేక శిల్పాలు, దేవాలయాలు, గృహాలు, గృహ ఉపయోగ వినియోగ వస్తువులు ఈ విశ్వానికి అందించిన చరిత్ర విశ్వకర్మలదన్నారు. ప్రభుత్వం విశ్వకర్మలను గుర్తించి ప్రోత్సాహకాలు అందిస్తే మా కులవృత్తులకే కాపాడుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తౌడోజు ఉపేంద్ర చారి, ఉపాధ్యక్షులు పర్వతపు వీరాచారి, కార్యదర్శి తౌడౌజు లక్ష్మ ణ్, క్యాషియర్ పోలోజు రమేష్, చేరాల కనకాచారి, పోలోజు ప్రసాద్, బ్రహ్మం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు మట్టి మనుషుల పోరాట ఫలితంగానే తెలంగాణకు స్వాతంత్ర్యం



**ప్రజాపక్షం/ములుగు :** కమ్యూనిస్టులు మట్టి మనుషుల పోరాట ఫలితంగానే తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం దక్కిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ములుగు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య, సిపిఐ మండల కార్యదర్శులు ముత్యాల రాజు, సిపిఐ మండల కార్యదర్శులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, మండికి క్రిష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కుమ్మరి సాగర్, కార్మిక సంఘాల నాయకులు పోలం కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో మహిళ మృతి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** వాటర్ హీటర్‌తో కరెంట్ షాక్ కొట్టడంతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొంతగట్టు నాగారం గ్రామానికి చెందిన పిల్లి లింగమ్మ(48)కు వాటర్ హీటర్‌తో కరెంట్ షాక్‌తో మృతిచెందిందన్నారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. వాటర్ హీటర్‌లతో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ సమీప బంధువు ముసిపట్ల వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన మరణ సమాచారం తెలుసుకున్న స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బుధవారం గోవర్ధనగిరి గ్రామానికి చేరుకుని వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇంచార్జి వై కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల నాయకులు రాజేందర్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, హరీష్‌గౌడ్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ ‘మా వందే’

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ ను ‘మా వందే‘ టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. నిర్మాత వీర్ రెడ్డి .ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారం గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి క్రాంతికుమార్.సీహెచ్. దర్శకత్వం వహిస్తున్నారు. సమాజం కోసం ఎన్నో ఆకాంక్షలు గల బాలుడి నుంచి దే శ ప్రధానిగా మోదీ ఎదిగిన క్రమాన్ని ‘మా వందే‘ సినిమాలో చూపించనున్నారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వీర్ రెడ్డి.ఎం. ‘మా వందే‘ చిత్రాన్ని పాన్ ఇం డియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ నిర్మిస్తున్నాం. ప్రపంచనాయకుడి గా మోదీ ఎదగడం వెనక ఆయన మాతృమూర్తి హీరాబెన్ ఇచ్చిన ప్రేర ణ, తల్లితో మోదీకి గల అనుబంధం ఈ చిత్రంలో చూపించబోతున్నాం. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం ఈ కథలో కీలకాంశంగా ఉండనుంది అని అన్నారు. యాక్షన్ కింగ్ సోలొమన్, ఎడిటింగ్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్,సంగీతం రవి బస్రుర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గంధాధర్ ఎన్ఎస్, వాణిశ్రీ .బి, లైన్ ప్రొడ్యూసర్ టీవీఎన్ రాజేశ్, రచన, దర్శకత్వం క్రాంతికుమార్.సి.హెచ్.

## ‘ది గ్రేట్ వెడ్డింగ్ షో’ టీజర్ రిలీజ్



తిరువీర్, టీనా శ్రావ్య హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’. 7 పిఎం.ప్రొడక్షన్స్, పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 7న సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శేఖర్ కమ్ముల ఆవిష్కరించారు. చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ‘‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో టీజర్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. సినిమా టీమ్ మొత్తం యంగ్ అండ ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది.తీరువీర్‌కు ప్రీ వెడ్డింగ్ షో లాంటి మరిన్ని మంచి సినిమాలు చేయాలి. హీరోయిన్ నాచురల్‌గా కనిపించింది. ఇలాంటి కంటెంట్ ఓరియెంటెడ సినిమాలు నిర్మించడానికి ధైర్యం, పాషన్ ఉండాలి. నిర్మాతలను చూస్తుంటే నా డాలర్ డ్రీమ్స్, ఆనంద్ రోజులు గుర్తొచ్చాయి. కంప్లీట్ క్లీన్ ఫిల్మ్ అని తీరువీర్ అన్నాడు. బ్యాక్‌డ్రాప్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది అని తెలిపారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ ‘‘ఫ్రెండ సజేషన్‌తో ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ కథ విన్నాను. కథ వింటున్నప్పుడు స్టార్టింగ్ నుంచి చివరి వరకు నవ్వుతూనే ఉన్నాను. అప్పుడే ఈ సినిమా చేయాలని ఫిక్సయ్యాను. మార్కెట్ లెక్కల గురించి ఆలోచించకుండా నిర్మాతలు సందీప్, రంజిత్ ధైర్యంగా సినిమా చేయడానికి ముందుకొచ్చారు.అని చెప్పారు.నిర్మాత సందీప్ మాట్లాడుతూ మేము అనుకున్న బడ్జెట్ కంటే ఐదింతలు పెరిగింది. కథపై నమ్మకంతో ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా సినిమా చేశాం. 35 రోజులు అరకులో షూట్ చేశాం. సురేష్ బొబ్బిలి మంచి హిట్ సాంగ్స్ ఇచ్చాడు’’ అని పేర్కొన్నారు.దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ‘‘ప్రొడ్యూసర్లు సందీప్, రంజిత్ ఫస్ట్ సిట్టింగ్‌లోనే కథను నమ్మారు. వన్ ఇయర్ జర్నీ చాలా సాఫ్ట్‌గా వెళ్లిపోయింది అని అన్నారు. హీరోయిన్ టీనా శ్రావ్య మాట్లాడుతూ ‘‘టీజర్ శాంపిల్ మాత్రమే. రెండు గంటలు ప్రతి సీన్, డైలాగ్ బాంబ్‌ల పేలిపోతాయి. తీరువీర్ నుంచి చాలా నేర్చుకున్నారు. హేమ పాత్రకు న్యాయం చేయడమే కాకుండా నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శకుడి న మ్మకాన్ని నిలబెట్టానని అనుకుంటున్నాను’’ అని తెలిపింది.నిర్మాత అశ్విత రెడ్డి , =యాక్టర్ రోహన్, నరేంద్ర రవి, ఎడిటర్ నరేష్, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి పాల్గొన్నారు.

## ‘విక్రమ్’ సినిమాలో కొరియోగ్రాఫర్‌గా ‘లియో’తో నటుడిగా ప్రస్థానం

### పారంజిత్ సినిమాలో హీరోగా

### కొరియోగ్రాఫర్, నటుడు శాండీ చిట్ చాట్



నటుడు శాండీ తెలుగుతో పాటు తమిళ తెరపై కూడా ఇప్పుడిప్పుడే బిజీ అవుతున్నారు. తమిళంలోనే కెరీర్ ప్రారంభించినప్పటికీ తెలుగులోను కూడా శాండీకి మంచి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా విడుదలైన 'కిష్కింధపురి' సినిమాలో ఒక పెక్యులర్ క్యారెక్టర్ చేశాడు. ఈ సందర్భంగా శాండీ మీడియాతో ముచ్చటించారు. లియో, లోక, ఇప్పుడు కిస్కింందపురి ఇలా వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు నటుడు , కొరియోగ్రాఫర్ శాండీ చాలా ఆనందంగా ఉంది. ముందుగా డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కి థాంక్స్ చెప్పాలి. ఆయన లియోలో నాకు ఆ క్యారెక్టర్ ఇవ్వకపోతే ఈ జర్నీ మొదలయ్యేది కాదు.చిన్నప్పుడు అందరూ నా కళ్ళను చూసి ఆటపట్టించేవారు. 'డెత్ గోట్ ఐస్' అంటూ టీజ్ చేసేవారు. అయితే ఇప్పుడు అదే నాకు చాలా ఆనందం ఇచ్చింది. నిజంగా నాకు అలాంటి కళ్ళు లేకపోతే లోకేష్ ఆ క్యారెక్టర్ కి నన్ను ఎంపిక చేసేవారు కాదు. విక్రమ్ సినిమాలో ఒక సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను. అప్పుడే ఆయన లియోలో క్యారెక్టర్ గురించి చెప్పారు.లియో తర్వాత నాకు చాలా క్యారెక్టర్లు వచ్చాయి. అన్ని ఒకే తరహా సైకో పాత్రలు చెప్పేవారు. ఇలాంటి సమయంలో లోక, కిష్కింధపురి డిఫరెంట్ పత్రాలు రావడంతో చేయడానికి ఒప్పుకున్నాను. కిష్కిందపురిలో నేను చేసిన పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. పోతే పోనీ పోరా పాట నాకు చాలా మంచి ఫేమ్ తీసుకొచ్చింది. నాకు హ్యూమర్ సెన్స్ ఉన్న క్యారెక్టర్స్, డాన్స్ పెర్ఫార్మన్స్ అంటే చాలా ఇష్టం.డైరెక్టర్ కౌశిక్ నా క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఆ క్యారెక్టర్ గురించి ఎక్కువ రివిల్ చేయకూడదు. అది ఒక స్ప్రైజ్ లాగా ఉంచాము. ఈ క్యారెక్టర్ కోసం దాదాపు ఏడు గంటల పాటు టెస్ట్ షూట్ చేశాం. అది డైరెక్టర్ కి చాలా నచ్చింది. ఇలాంటి యూనిక్ క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.నాకు రిఫరెన్స్ తీసుకోవడం ఇష్టం ఉండదు. అయితే గతంలో సూర్య చేసిన ఒక సినిమా ని రిఫరెన్స్ గా ఇచ్చారు. అయితే ఆ క్యారెక్టర్ కి ఈ క్యారెక్టర్ కి సంబంధం లేదు. చాలా కొత్తగా ఈ క్యారెక్టర్ ని ప్రజెంట్ చేయడం జరిగింది.యాక్టర్ గా కొరియోగ్రాఫర్ గా ఏ జర్నీ బెస్ట్ అని అంటే కొరియోగ్రఫీ నా బేస్. కచ్చితంగా కొరియోగ్రఫీ చేస్తాను. అయితే ప్రస్తుతం నేను యాక్టింగ్ మీద ఫోకస్ చేశాను. ఈ రెండు బ్యాలెన్స్ చేస్తూ చేయాలని ఉంది. నాకు దర్శకత్వం మీద కూడా ఆసక్తి ఉంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. పా రంజిత్ నిర్మాణంలో హీరోగా ఒక సినిమా చేస్తున్నాను. మలయాళం లో 'కథామినార్' లో ఒక కీలక పాత్ర చేస్తున్నాను. ఓజీలో ప్రమోషనల్ సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను.

## ‘టన్నెల్’ 19న విడుదల




అథర్వా మురళీ ఇటీవల ‘టన్నెల్’ అంటూ ఓ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ తో ఆడియెన్స్ ముందుకు వచ్చి తమిళ్ లో మంచి విజయం సాధించారు. తమిళంలో హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న ‘టన్నెల్’ తెలుగు ఆడియెన్స్ ముందుకు సెప్టెంబర్ 19న రాబోతోంది. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఎ.రాజు నాయక్ గ్రాండ గా విడుదల చేస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. సెప్టెంబర్ 19న విడుదల అవుతున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా అలరిస్తుందని నిర్మాత రాజు నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ‘తెలుసు కదా’ షూటింగ్ పూర్తి



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మిస్తున్న సంగీత భరిత వినోదాత్మక చిత్రం 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్ లుగా నటిస్తున్నారు. నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది.ఈ సందర్భంగా లోకేషన్ లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇటీవల విడుదల చేసిన తెలుసు కదా టీజర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందల వచ్చింది. ఫస్ట్ సాంగ్ మల్లిక గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. త్వరలో రెండో పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి ఈ సినిమాను అక్టోబర్ 17న విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఉద్యమాలకు ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)





దీంతో భాషా పరిరక్షణ ఉద్యమంగా ప్రారంభమై ఆ తర్వాత నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంమన్నారు. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు 10 శాతం ముస్లింలలో 8 శాతం మంది ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారన్నారు. ఆలాంటి ఈ పోరాటం హిందూ ముస్లింల మధ్య జరిగిన ఘర్షణ ఏలా అవుతుందో బిజెపి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశానికి 1947లో స్వాతంత్ర్యం లభిస్తే, నిజాం మాత్రం స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే ప్రయత్నం చేస్తే కమ్యూనిస్టుల సారథ్యంలో ఏడాది పాటు పోరాడి నిజాం పీచం అణిచివేసిందన్నారు. దీంతో హైదరాబాద్ సంస్థానం కమ్యూనిస్టుల వశం కాబోతుందనే భయంతో నాడు కేంద్రం ఆపరేషన్ పోలో చేపట్టగా ఇటు వైపు గానీ అటువైపు గానీ చుక్క రక్తం బొట్టు నేల రాలకుండానే సెప్టెంబర్ 17న కేంద్రం ముందు నిజాం మొకరిల్లిన విధానమే చీకటి ఒప్పందంలో భాగమనేది స్పష్టమైందని పేర్కొన్నారు.



కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారానే నిరకుంశ నిజాం పాలన పతనమై హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని, ఎవరూ అవునన్నా, కాదన్నా చరిత్రే ఇందుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గానీ, దేశ స్వాతంత్రోద్యమంలో గానీ పాల్గొన్న చరిత్ర లేని బిజెపి కమ్యూనిస్టులను, మాజీ ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూను తప్ప మిగిలిన గాంధీ మొదలు గాడ్సే వరకు వివేకానంద నుంచి విప్లవ కెరిటం భగత్‌సింగ్ వరకు అంతా తమ వారే అంటూ సొంతం చేసుకునే కుట్రకు తెరలేపిందని విమర్శించారు. కమ్యూనిస్టులు అన్నా, ఎర్రజెండా అన్నా ఇప్పటికీ ప్రజల గుండెల నిండుగా ప్రేమాభిమానాలు ఉన్నాయని వాటిని ముందుకు తీసుకువెళ్లడమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు.

జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో పాటు రాజ్యాంగబద్ధ సంస్థలను

చెరబట్టడంతో దేశంలో తీవ్ర సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజ్యాంగంతో పాటు వ్యవస్థల పరిరక్షణకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు మరో అవిశ్రాంత పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు.



ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ప్రభావం తెలంగాణ సమాజంపై ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ పోరాటం ప్రేరణ విప్లవోద్యమంలో ఉన్న నాయకులు మొదలుకుని, మేధావులు, కవులు, కళాకారులు, పౌర సమాజం నిండి ఉందని పేర్కొన్నారు. అంత గొప్ప పోరాటంతో ఏ సంబంధం లేని బిజెపి ఆ చరిత్రను వక్రీకరించడం హాస్యాస్పదమన్నారు.

కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సాధించుకున్న స్వేచ్ఛ మన తెలంగాణ అని, ఈ తెలంగాణ ప్రపంచంలో పేరెన్నిక గల తెలంగాణగా అభివృద్ధి సూచికగా నిలబడాలంటే అందుకు శ్వాస సాయుధ పోరాటమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దినోత్సవం వేదికగా ఉద్ఘాటించారని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికీ కమ్యూనిస్టుల ప్రాబల్యం, త్యాగనిరితి ప్రజలలో నెలకొని ఉన్నందునే సిఎం ఆ మాటలు చెప్పారన్నారు. అయితే అంతటి చరిత్ర గల కమ్యూనిస్టుల ఉద్యమం చీలిక వల్ల బలపడిందో బలహీనపడిందో అని కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తాగ్యాలు, ఉద్యమాలు కమ్యూనిస్టులవైతే, వాటి ఫలితాలను బుర్జువా పార్టీలు అనుభవిస్తున్నాయని, ఇప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు తాత్కాలికంగా సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు.





కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారికంగా నిర్వహించాలని అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం, మరో వైపు కేంద్ర ప్రభుత్వం వారి రాజకీయాలకు అనుగుణంగా ఎదో ఒక పేరుతో వేడుకలు నిర్వహించడం కొంత మేరకు సంతోషమేనన్నారు.



విమలక్క మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో పాటు సామాజిక రుగ్మతలకు కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం తగ్గడం కూడా ఒక కారణమన్నారు. ఇప్పటికైనా అన్ని వామపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యా పుస్తకాలలో చేర్చడంతో పాటు నాటి వీర యోధుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు స్మృతి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూంమొహియుద్దీన్ విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని ఐదు తీర్మానాలను బహిరంగ సభ ఆమోదించింది.

## డిజిపి కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర డిజిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజిపి(రోడ్ సేఫ్టీ రైల్వేస్) కె.రమేష్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ ఐజిపి ఎం.శ్రీనివాసులు, లీగల్ ఎస్‌పి సతీష్, శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పిలు యోగేశ్వరరావు, వేణుగోపాల్, ఉదయ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా డిజిపి కార్యాలయానికి చెందిన మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులకు నివాళులు అర్పించిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జాతీయ నాయకులు

## ఇవిఎం బ్యాలట్‌పై అభ్యర్థుల కలర్ ఫొటోలు

### డిజైన్‌లో మార్పులు చేసిన ఎన్నికల సంఘం

### కొత్త మార్గదర్శకాలు విడుదల

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకోసం ఇవిఎం బ్యాలట్ పత్రాల డిజైన్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. ఓటర్లు ఎలాంటి గందరగోళానికీ గురికాకుండా అభ్యర్థుల ఫొటోలు స్పష్టంగా, సులభంగా గుర్తుపట్టడంకోసం పెద్ద పెద్ద ఫొటోలను బ్యాలట్ పత్రాలలో ముద్రిస్తారు. ఈ ఫొటోలు కూడా కలర్‌లో ఉంటాయి. అందువల్ల ఓటర్లు చాలా సులభంగా అభ్యర్థులను గుర్తుపట్టగలుగుతారు. బ్యాలట్‌పత్రంలో మూడువంతులు స్థలం ఈ ఫొటోలే ఆక్రమిస్తాయి. ఎన్నికలసంఘం ఈ మేరకు బుధవారం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. గడచిన ఆరునెలలుగా ఈ మార్గదర్శకాలకు సంబంధించి 28 చొరవలను ఇప్పటికే అమలు చేయగా, అదేమార్గంలో మిగిలిన చొరవలను కూడా అమలు చేస్తారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా విధానపరమైన మెరుగుదల చర్యలు ఓటర్లకోసం తీసుకున్నామని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలియజేసింది. అభ్యర్థుల పేర్లు సీరియల్ నెంబర్లు కూడా అంతర్జాతీయ ప్రామాణికతల ప్రకారం భారతీయ సంఖ్యల్లో ముద్రితమవుతాయిఇ. అభ్యర్థుల పేర్లు పెద్ద అక్షరాల్లో ముద్రిస్తారు. ఇవిఎం అసెంబ్లీ బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్ఎం పింక్ కలర్ పేపర్‌పై ముద్రిస్తారు.

**త్వరలో దేశవ్యాప్తంగా ‘సర్’... సగంమంది ఓటర్లకు ఇబ్బంది లేదు**

దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం త్వరలో ఓటర్ల జాబితాల ప్రక్షాళన కార్యక్రమం చేపడుతుంది. దీనికి సంబంధించి త్వరలో ఒక తేదీని ఎన్నికల సంఘం నిర్ణయిస్తుంది. దేశంలోని పలు రాష్ట్రాలలో సగంమంది ఓటర్లు ఎలాంటి ఆధారాలను సమర్పించే అవసరం ఉండకపోవచ్చునని కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బుధవారం చెప్పారు. ఇంతకుముందు జరిగిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమీక్ష సందర్భంగా వారందరూ తగిన ఆధారాలు సమర్పించినవారేనని పేర్కొన్నారు. 2002 నుండి 2004 వరకూ జరిగిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) సమీక్షా కార్యక్రమాలలో సగంమంది ఓటర్లు తమ తమ అర్హతపత్రాలను అందజేసిన వారే ఉన్నారని తెలిపారు. ఇక తదుపరి నిర్వహించే ప్రత్యేక ముమ్మర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలకు 2002, 2004 సంవత్సరాలలో చేసిన సవరణలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమాలకు త్వరలో ఒక తేదీని ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేస్తారు. త్వరలో దీనికి ఒక తేదీని ఎన్నికల సంఘం నిర్ణయించి ప్రకటిస్తుంది. వివిధ రాష్ట్రాలలో ఎన్నికల సంఘాల ప్రధానాధికారులు ఇంతకుముందు ప్రత్యేక ముమ్మర సవరణ తర్వాతనాటి ఓటర్ల జాబితాలను ముద్రించి సిద్ధంగా ఉంచాలని కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలోని ఎన్నికల అధికారులు ఈ విధంగా సిద్ధంచేసిన ఓటర్ల జాబితాలను వెబ్‌సైట్లలో ప్రచురించి ఉంచారని తెలిపింది. ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి 2008 నాటి ఓటర్ల జాబితాను వెబ్‌సైటులో ప్రచురించి అందరికీ అందుబాటులో ఉంచారు. 17 సంవత్సరాలక్రితం ఈ ఓటర్ల జాబితాల ముమ్మర తనిఖీ కార్యక్రమం పూర్తయింది. ఇక ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కూడా 2006లో ఓటర్ల ముమ్మర ప్రక్షాళన పూర్తయింది. ఈ జాబితాలను కూడా ఆ రాష్ట్రం వెబ్‌సైటులో ప్రచురించి సిద్ధంగా ఉంచింది.

**బీహార్‌లో 60 శాతం ఓటర్లు ఆధారాలు ఇవ్వక్కరలేదు**

బీహార్‌లో 60 శాతం మంది ఓటర్లు ఎలాంటి ఆధారాలను సమర్పించాల్సిన అవసరం లేదు. ఎన్నికల సంఘం ఈ ప్రకటన చేసింది. బీహార్‌లో మొత్తం 4.96 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 2003వ సంవత్సరంలో బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమీక్ష నిర్వహించారు. వీరిలో 60 శాతం ఓటర్లు తర్వాత ప్రచురించిన సవరణ జాబితాలో ఉన్నారు. అందువల్ల వారంతా తమ పుట్టిన ప్రదేశం లేదా పుట్టిన తేదీలను రుజువుచేసుకునేందుకు ఎలాంటి ఆధారాలూ సమర్పిచాల్సిన అవసరం లేదని తెలిపింది. ఐతే మిగిలిన 40 శాతం ఓటర్లు ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగా 12 రకాల ఆధారాలలో ఏదో ఒక ఆధారం చూపాంచాల్సి ఉంటుంది. దీంతోపాటు అదనంగా కొత్తగా ఓటర్ల జాబితాలో చేరాలనుకునేవారు లేదా ఇతర రాష్ట్రాల నుండి తమ ఓటును స్వరాష్ట్రానికి బదిలీ చేసుకోవాలనుకునే వారికోసం ఒక యోగ్యతా పత్రాన్ని ప్రవేశపెట్టారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, Editor : Makkena Subbarao, E-mail : editorprajapaksham@gmail.com